జాతీయ తెలుగు దినపత్రిక

ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం

తెలంగాణ రాజకీయాల్లో కీలక పరిణామం

కొండా సురేఖకు మీనాక్షి నటరాజన్ ఫోన్!

హైదరాబాద్, సెప్టెంబర్ 11(ప్రజాజ్యోతి): తెలంగాణ రాజకీయాల్లో కీలక పరిణామం చోటుచేసుకుంది. రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌ఛార్జ్ మీనాక్షి నటరాజన్ మాజీ మంత్రి కొండా సురేఖకు స్వయంగా ఫోన్ చేసినట్లు విశ్వసనీయ వర్గాల ద్వారా సమాచారం తెలిసింది. ప్రస్తుతం రాష్ట్ర శాసనసభ సమావేశాలు కొనసాగుతున్న తరుణంలో, ఇన్‌ఛార్జ్ నేరుగా ఆమెతో మాట్లాడటం రాష్ట్ర రాజకీయ వర్గాల్లో తీవ్ర ఆసక్తిని,

మిగతా 2లో..

బొల్లారం ఆయుధాల చోరీ కేసు..

ఛేదించిన పోలీసులు, మిలిటరీ అధికారులు
కేసులో నలుగురు నిందితులను అరెస్ట్

హైదరాబాద్, సెప్టెంబర్ 11(ప్రజాజ్యోతి): హైదరాబాద్‌లోని బొల్లారంలో ఉన్న మద్రాస్ రెజిమెంట్ బెల్ ఆఫ్ ఆర్మ్స్‌లో జరిగిన భారీ ఆయుధాల చోరీ కేసును పోలీసులు, మిలిటరీ అధికారులు అత్యంత సమర్థవంతంగా ఛేదించారు. ఈ వ్యవహారానికి సంబంధించిన పూర్తి వివరాలను తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్ వెల్లడించారు. ఈ కేసుకు సంబంధించి మొత్తం

మిగతా 2లో..

ఆదిలాబాద్, హైదరాబాద్ | శనివారం 12 సెప్టెంబర్ 2026 | సంపుటి: 19 | సంచిక: 169 | పేజీలు: 12 | వెల: రూ.3 | RNI No : TELTEL/2008/24799

పరాభవ నామ సంవత్సరం , శ్రావణ మాసము , తిథి: చతుర్దశి - 10:34:59 వరకు నక్షత్రంమాఘ - 14:05:10 వరకు కరణంశకుని - 10:34:59 వరకు, చతుష్పాద - 21:43:34 వరకు పక్షంకృష్ణ యోగంసిద్ధ - 19:17:38 వరకు

Published from ADILABAD, RANGAREDDY (HYDERABAD), NIZAMABAD, WARANGAL | http://www.prajajyothinews.com | Mail: prajajyothidaily@gmail.com



బ్రిక్స్ సదస్సు సర్వం సిద్ధం

- నేటినుండి బ్రిక్స్ 2026 శిఖరాగ్ర సమావేశం
- భారత్ వేదికగా రెండు రోజులపాటు సమావేశాలు
- సర్వాంగ సుందరంగా ముస్తాబైన దేశ రాజధాని
- హాజరుకానున్న ప్రపంచ దేశాల అగ్రనేతలు
- ఏడేళ్ల తర్వాత భారత్‌కు జిన్‌పింగ్ రాక..
- శిఖరాగ్ర సదస్సుకు భారీ భద్రత ఏర్పాటు
- బ్రిక్స్ బిజినెస్ ఫోరమ్‌లో మోదీ కీలక ప్రసంగం
- బ్రిక్స్‌తో ప్రపంచానికి ప్రధాని కొత్త దిశానిర్దేశం

ఒకప్పుడు బ్రిక్స్‌లో భారత్ కొనసాగడం సరైనదేనా? ఇప్పుడు భారత్ లేకుండా బ్రిక్స్ ముందుకు సాగగలదా? ఈ రెండు ప్రశ్నల మధ్య ఉన్న దూరమే గత దశాబ్దన్నర కాలంలో ప్రపంచ వేదికపై భారత్ సాధించిన ఎదుగుదలకు అద్దం పడుతోంది. 2026లో భారత్ బ్రిక్స్ శిఖరాగ్ర సమావేశానికి ఆతిథ్యం ఇవ్వబోతోంది. ఈ సందర్భంగా 2012లో భారత్ నిర్వహించిన బ్రిక్స్ సమావేశం నాటి పరిస్థితులను గుర్తు చేసుకోవడం ఆసక్తికరం. అప్పట్లో అంతర్జాతీయ ఆర్థిక వర్గాల్లో భారత్ స్థానం గురించి అనేక సందేహాలు వ్యక్తమయ్యాయి. భారత్ బ్రిక్స్‌లో ఉండటానికి నిజంగా అర్హమేనా? ఇండోనేషియాను భారత్ స్థానంలో చేర్చాలా? బ్రిక్స్ దేశాల్లో భారత్ బలహీనమైన దేశమా? అంటూ చర్చలు జరిగాయి. కానీ ఇప్పుడు పరిస్థితి పూర్తిగా మారిపోయింది.

న్యూఢిల్లీ,సెప్టెంబర్ 11(ప్రజాజ్యోతి): ప్రపంచ దేశాల చూపు ఇప్పుడు భారత్ వైపు మళ్లింది. అంతర్జాతీయ రాజకీయాల్లో అత్యంత కీలకమైన బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సుకు దేశ రాజధాని దిల్లీ సర్వాంగ సుందరంగా ముస్తాబైంది. భారత్ అధ్యక్షతన దిల్లీ వేదికగా శని, ఆదివారాల్లో జరిగే 18వ బ్రిక్స్ శిఖరాగ్ర సమావేశాలకు ప్రపంచంలోని పలుదేశాల అగ్రనేతలు హాజరవుతున్నారు. రష్యా, చైనా అధ్యక్షులు పుతిన్, జిన్‌పింగ్ సహా 11సభ్య దేశాల అధినేతలు పాల్గొననున్నారు. ముఖ్యంగా చైనా అధినేత జిన్‌పింగ్ ఏడేళ్ల సుదీర్ఘ విరామం తర్వాత భారత్‌కు రావనుండటం ఆసక్తి రేపుతోంది. ప్రపంచవ్యాప్తంగా యుద్ధాలు, వాణిజ్య ఉద్రిక్తతలు, ఆర్థిక సవాళ్ల నడుమ గ్లోబల్ సౌత్ దేశాల అభివృద్ధి

మిగతా 12లో..

ప్రధాని మోదీ, రష్యా అధ్యక్షుడు పుతిన్ భేటీ

ద్వైపాక్షిక వాణిజ్యాన్నిపెంపొందించేందుకు చర్చలు
2030 నాటికి 100 బిలియన్ డాలర్లకు పెంచడంపై చర్చ
రక్షణ రంగంలో పెట్టుబడులపై ఇరువురు కీలక చర్చలు
పుతిన్‌కు తమిళ గ్రంథాన్ని గిఫ్ట్ ఇచ్చిన ప్రధాని మోదీ

న్యూఢిల్లీ,సెప్టెంబర్ 11(ప్రజాజ్యోతి): భారత్ వేదికగా జరుగుతున్న 18వ బ్రిక్స్ శిఖరాగ్ర సమావేశానికి ఢిల్లీ సిద్ధమైంది. సెప్టెంబర్ 12, 13 తేదీల్లో న్యూఢిల్లీలో జరగనున్న ఈ కీలక అంతర్జాతీయ సదస్సుకు ముందు

మిగతా 12లో..

కులగణన ఒక 'ఎక్సరే'

తెలంగాణ కులగణన సర్వే దేశానికే ఆదర్శం

- జనగణనలో కులగణనను తప్పనిసరిగా చేర్చాలి
- కులగణన చేద్దామా? వద్దా? బీజేపీ సూటిగా చెప్పాలి
- కులగణనతోనే బలహీన వర్గాలకు న్యాయం..
- దేశ సంపద సమాన పంపిణీకి మార్గం
- తెలంగాణ తరహాలో దేశవ్యాప్తంగా సర్వే చేయాలి
- వచ్చే ఎన్నికల్లో రాహుల్ గాంధీ ప్రధాని అవుతారు
- అసెంబ్లీలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క
- జనగణనలో కులగణన చేపట్టాలని శాసనసభ తీర్మానం

హైదరాబాద్, సెప్టెంబర్ 11(ప్రజాజ్యోతి): దేశంలో సామాజిక అసమానతలను తొలగించి బలహీన వర్గాలకు న్యాయం చేయాలంటే జనగణనలో కులగణనను తప్పనిసరిగా చేర్చాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. కులగణన చేద్దామా? వద్దా? అనే విషయాన్ని బీజేపీ సభ్యులు సూటిగా చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం నిర్వహించిన సామాజిక, ఆర్థిక, రాజకీయ సర్వే ను దేశానికి ఆదర్శంగా తీసుకుని, దేశవ్యాప్తంగా కూడా ఇలాంటి సమగ్ర సర్వే నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్ర అసెంబ్లీలో జనగణన, కులగణన అంశంపై జరిగిన చర్చలో ఆయన మాట్లాడుతూ.. కులగణన అనేది కులాలకు, రాజకీయ పార్టీలకు సంబంధించిన అంశం కాదని, సమాజ శ్రేయస్సుకు సంబంధించిన విషయమని పేర్కొన్నారు. సమాజంలో నెలకొన్న అసమానతలను సరిచేయాలంటే ముందుగా వాటి తీవ్రతను, స్వభావాన్ని తెలుసుకోవాల్సి ఉంటుందని,

మిగతా 12లో..

రైతుల మోటార్లకు మీటర్లు పెట్టబోము

ఎక్కడా మీటర్లకు పెట్టాలనే నిబంధన లేదు
అసెంబ్లీలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

హైదరాబాద్, సెప్టెంబర్ 11(ప్రజాజ్యోతి): రైతుల మోటర్లకు ఎట్టి పరిస్థితుల్లో మీటర్లు పెట్టబోమని, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క స్పష్టంచేశారు. శాసనమండలిలో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ అడిగిన ప్రశ్నకు ఆయన సమాధానమిచ్చారు. రాష్ట్రంలో విద్యుత్ సరఫరా వ్యవస్థను అప్‌గ్రేడ్ చేయడానికే కేంద్ర ప్రభుత్వం తెచ్చిన ఆర్‌డీఎస్ఎస్ పథకాన్ని వినియోగించుకుంటామన్నారు. అందులో ఎక్కడా వ్యవసాయ మోటర్లకు మీటర్లకు పెట్టాలనే నిబంధన లేదని భట్టి విక్రమార్క తెలిపారు. అలాంటి భయాందోళన సృష్టించవద్దని ఆయన సూచించారు. థర్మల్‌తో పాటు సోలార్ విద్యుత్ ఉత్పత్తి పెంచుకుంటూ వెళ్లాల్సిన అవసరముందని భట్టి విక్రమార్క తెలిపారు.రాష్ట్రంలోని 29 లక్షల వ్యవసాయ పంపుసెట్లకు ఉచిత విద్యుత్ అందించడానికి

మిగతా 12లో..

ఉద్యోగులకు ప్రమాద బీమా

- కోటి రూపాయల బీమా అందిస్తున్నాం
- ఒక్క రూపాయి ప్రీమియం లేకుండానే బీమా
- ఈ బీమాతో 12.91 లక్షల మందికి లబ్ది
- అసెంబ్లీలో డిప్యూటీ సీఎం భట్టి వెల్లడి

హైదరాబాద్, సెప్టెంబర్ 11(ప్రజాజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు, కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ సిబ్బంది సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. శాసనమండలిలో సభ్యులు అడిగిన ప్రశ్నలకు ఆయన సమాధానమిచ్చారు. రాష్ట్ర ఖజానాపై, ఉద్యోగుల వేతనాలపై రూపాయి భారం పడకుండా, మానవీయ కోణంలో దేశంలోనే తొలిసారిగా రూ. కోటి దాకా ఉచిత ప్రమాద బీమా సౌకర్యాన్ని కల్పించినట్లు ఆయన స్పష్టం చేశారు. ఉద్యోగికి అనుకోకుండా ఏదైనా ప్రమాదం జరిగి మరణిస్తే వారి కుటుంబం తీవ్ర ఆర్థిక సంక్షోభంలో పడుతుంది. అటువంటి

మిగతా 2లో..

పురపాలక పాలనలో ట్రాన్స్‌జెండర్లు..

కో-ఆప్షన్ సభ్యులుగా వారికి అవకాశం
అసెంబ్లీలో కీలక బిల్లుకు ఆమోదం

హైదరాబాద్, సెప్టెంబర్ 11(ప్రజాజ్యోతి): తెలంగాణ ప్రభుత్వం మరో చరిత్రాత్మక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలోని మున్సిపల్ కార్పొరేషన్లలో ట్రాన్స్‌జెండర్లకు కో-ఆప్షన్ సభ్యులుగా ప్రాతినిధ్యం కల్పించే బిల్లుకు శాసనసభ శుక్రవారం ఆమోదం తెలిపింది. ఈ నిర్ణయంతో పురపాలక పరిపాలనలో, విధాన నిర్ణయాల్లో ట్రాన్స్‌జెండర్ల భాగస్వామ్యానికి మార్గం సుగమమైంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తరఫున రాష్ట్ర శాసనసభా వ్యవహారాల మంత్రి డి. శ్రీధర్ బాబు 'తెలంగాణ మున్సిపాలిటీల (నాలుగో సవరణ) బిల్లు, 2026'ను సభలో ప్రవేశపెట్టారు. 2019 నాటి తెలంగాణ మున్సిపాలిటీల చట్టానికి ఈ బిల్లు సవరణలు ప్రతిపాదిస్తుంది. దీని ప్రకారం, హైదరాబాద్ కోర్ అర్బన్ రీజియన్ (క్యూర్) వెలుపల ఉన్న తొమ్మిది

మిగతా 12లో..

మూసీ ప్రాజెక్టుకు అడ్డంకులు

రాష్ట్ర ప్రభుత్వానికి ఎన్జీటీ నోటీసులు జారీ

హైదరాబాద్, సెప్టెంబర్ 11(ప్రజాజ్యోతి): తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మూసీ పునరుజ్జీవన ప్రాజెక్టుకు మరోసారి న్యాయపరమైన అడ్డంకులు ఎదురయ్యాయి. ఈ ప్రాజెక్టుకు సంబంధించి

మిగతా 2లో..

పాలిటెక్నిక్ కళాశాలలను ప్రైవేటీకరించే ప్రసక్తేలేదు

శాసనసభలో మంత్రి వివేక్ వెంకటస్వామి వెల్లడి

హైదరాబాద్, సెప్టెంబర్ 11(ప్రజాజ్యోతి): తెలంగాణ రాష్ట్రంలో ఉన్న ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలను ప్రైవేటీకరించే ప్రసక్తే లేదని రాష్ట్ర రవాణా, బిసి సంక్షేమ శాఖ మంత్రి

మిగతా 2లో..

రేవంత్ డైరెక్షన్‌లోనే అంతా జరిగింది

మహిళా ఎమ్మెల్యేలపై విచక్షణారహితంగా దాడి చేశారు
తెలంగాణలో దేశంలోనే ఎక్కడాలేని విధంగా కౌరవసభ
జాతీయ మహిళా కమిషన్‌కు సబితా ఇంద్రారెడ్డి ఫిర్యాదు

న్యూఢిల్లీ,సెప్టెంబర్ 11(ప్రజాజ్యోతి): తెలంగాణ అసెంబ్లీ ముట్టడి సందర్భంగా బీఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యేలపై పోలీసులు విచక్షణారహితంగా దాడి చేశారని ఆరోపిస్తూ మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి ఢిల్లీ వేదికగా తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. ఈ ఘటనపై ఆమె జాతీయ మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్‌తో పాటు జాతీయ మానవ హక్కుల కమిషన్ సభ్యులకు ఫిర్యాదు చేశారు. అనంతరం మీడియాతో మాట్లాడిన

మిగతా 2లో..

తమ్ముడు.. లెట్స్ డూ కుమ్ముడు

- రేవంత్ రెడ్డి, పొంగులేటి రాష్ట్రాన్ని దోచేస్తున్నారు
- రేవంత్ అధికారంలోకి వచ్చాక పెరిగిన దందాలు
- పరాకాష్ఠకు చేరిన భూ దందాలు, ల్యాండ్ కబ్జాలు
- అస్మదీయులకు దోచిపెట్టడమే పనిగా పెట్టుకున్నారు
- గాంధీల పేరు చెప్పుకుని ఏలుతున్న గజదొంగలు
- రాష్ట్రంలో మరో సమాంతర రెవెన్యూ సామ్రాజ్యం
- సీఎం రేవంత్‌పై కేటీఆర్ సంచలన వ్యాఖ్యలు
- 22ఏ జాబితా అనేది దురుద్దేశంతో చేసిన దుర్మార్గం
- 'భూ భారతి' పేరుతో ప్రజల భూములకు 'భూ హారతి'
- కేవలం భూములను కాజేయడమే పనిగా పెట్టుకున్నారు
- బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్ రావు ఫైర్
- మంత్రి పొంగులేటి రాజీనామాకు హరీష్ రావు డిమాండ్
- తెలంగాణ భవన్‌లో 22ఏ భూ బాధితులతో సమావేశం

హైదరాబాద్, సెప్టెంబర్ 11(ప్రజాజ్యోతి): తెలంగాణ భవన్‌లో సెక్షన్ 22ఏ భూ బాధితులతో జరిగిన సమావేశంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కాంగ్రెస్ ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు. తమ్ముడు.. లెట్స్ డూ కుమ్ముడు అన్న రీతిలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి చెట్టాపట్టాల్‌వేసుకుని రాష్ట్రాన్ని దోచేసుకుంటున్నారని ఆరోపించారు. కొండల్, తొండల్, అనకొండల్ అంటూ రేవంత్ రెడ్డి సోదరుడు అనుముల కొండల్ రెడ్డి, పొంగులేటి వర్గీయులను ఉద్దేశించి సంచలన వ్యాఖ్యలు చేశారు. రేవంత్ అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో భూ దందాలు, ల్యాండ్ కబ్జాలు పరాకాష్ఠకు చేరాయని, అస్మదీయులకు దోచిపెట్టడమే పనిగా పెట్టుకున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో అధికారికంగా ఒక రెవెన్యూ వ్యవస్థ ఉంటే.. తెరవెనుక అదృశ్య శక్తులతో కూడిన మరో సమాంతర రెవెన్యూ సామ్రాజ్యం నడుస్తోందని కేటీఆర్ సంచలన ఆరోపణ చేశారు. ఫైళ్లు ఎవరి ఆదేశాల మేరకు కదులుతున్నాయో, అసైన్డ్ భూములు ఎవరి జేబుల్లోకి వెళ్తున్నాయో అర్థం కాని పరిస్థితి ఏర్పడిందన్నారు. లగచర్లలో తమ అల్లుడికి భూములు కట్టబెట్టడానికి గిరిజనుల పొలాలను గుంజుకున్నారని, హైదరాబాద్ చుట్టూ ఉన్న రూ. వేల కోట్ల విలువైన 10 వేల ఎకరాల భూములపై సీఎం రేవంత్ రెడ్డి కన్ను పడిందని విమర్శించారు. మూసీ ముసుగులోనూ, ఫ్యూచర్ సిటీ పేరుతోనూ పెద్ద ఎత్తున రియల్ దందాకు తెరలేపారని దుయ్యబట్టారు. కేసీఆర్ హయాంలో కొంగరకలాన్‌కు ఫాక్స్‌కాన్ వంటి దిగ్గజ కంపెనీ తెచ్చి ప్రాంతపు రూపురేఖలు మార్చితే, రేవంత్ రెడ్డి మాత్రం రూ. 200 కోట్ల విలువైన భూమిని

మిగతా 12లో..

25 ఏళ్ల రాజకీయ ప్రస్థానాన్ని పూర్తి చేసుకున్న మోదీ

సెప్టెంబర్ 17న ప్రతి ఇంటా దీపాలు వెలిగించాలి
అక్టోబర్ 17 వరకు సేవా సంకల్ప్ అభియాన్
బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు వెల్లడి

హైదరాబాద్, సెప్టెంబర్ 11(ప్రజాజ్యోతి): ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 25 ఏళ్ల సుదీర్ఘ ప్రజాసేవా ప్రస్థానాన్ని పురస్కరించుకుని తెలంగాణ వ్యాప్తంగా సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 17 వరకు నెల రోజుల పాటు 'సేవా సంకల్ప్ అభియాన్' కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు

మిగతా 2లో..

సంపాదకీయం

మొహం చాటేసిన వర్షాలు!

ఈ ఏడాది ఇప్పటివరకు వర్షాభావ పరిస్థితులే ఏర్పడ్డాయి. ఆయా ప్రాంతాల్లో అక్కడక్కడ చెదురుముదురు వర్షాలు మినహా ఎక్కడా అనుకున్న స్థాయిలో వర్షాలు కురవలేదు. మరోవైపు వర్షాకాలం చివరికి వస్తున్న కొద్దీ దేశంలోని రైతన్నల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి. వాతావరణ శాఖ వెల్లడించిన తాజా అంచనాల ప్రకారం.. సెప్టెంబర్ మూడో వారం నుంచి దేశవ్యాప్తంగా పొడి వాతావరణం ఏర్పడే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. దీనికి తోడు పసిఫిక్ మహాసముద్రంలో బలపడుతున్న 'ఎల్ నినో' ప్రభావం రబీ పంటల సాగుపై తీవ్ర ముప్పుగా పరిణమించేలా ఉంది. ఇప్పటికే ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, బీహార్ వంటి పలు రాష్ట్రాల్లో సాధారణం కంటే 27 నుంచి 45 శాతం వరకు తక్కువ వర్షపాతం నమోదైంది. వర్షాకాలం ముగిసే సమయానికి వర్షాలు మొహం చాటేస్తే.. వచ్చే శీతాకాలంలో వేసే రబీ పంటల పరిస్థితి ఏంటనేది ఇప్పుడు పెద్ద ప్రశ్నగా మారింది. సాధారణంగా రబీ సీజన్ అక్టోబర్ నుంచి ప్రారంభమవుతుంది. సెప్టెంబర్‌లో వర్షాలు పడకపోయినా విత్తనాలు వేసే సమయం మారకపోవచ్చు కానీ, నేలలో తేమ శాతం దారుణంగా పడిపోతుంది. ప్రస్తుతం దేశంలోని 178 ప్రధాన రిజర్వాయర్లలో నీటి నిల్వలు గత ఏడాదితో పోలిస్తే దాదాపు 20 శాతం తగ్గిపోయాయి. గతేడాది ఇదే సమయానికి 163.44 బిలియన్ క్యూబిక్ మీటర్ల నీరు ఉండగా, ఇప్పుడు అది 130.55 బిలియన్ క్యూబిక్ మీటర్లకు పరిమితమైంది. పంజాబ్, హర్యానా, ఉత్తరప్రదేశ్, బీహార్, రాజస్థాన్ , మధ్యప్రదేశ్ వంటి వ్యవసాయ ఆధారిత రాష్ట్రాల్లో నీటి నిల్వలు లేకపోతే విత్తనాలు మొలకెత్తడమే కష్టమవుతుంది. భారతీయ వ్యవసాయంలో రబీ కాలం చాలా కీలకమైనది. ముఖ్యంగా నీటి లభ్యత , నేలలోని తేమపై ఆధారపడే గోధుమ, ఆవాలు, శనగ పంటలు ఈసారి తీవ్ర ముప్పును ఎదుర్కొంటున్నాయి. మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్, రాజస్థాన్, హర్యానా రాష్ట్రాల్లో గోధుమలు, ఆవాల సాగు ఎక్కువగా ఉంటుంది. ఇక్కడ మొదటి తడికి రిజర్వాయర్ నీళ్లే ఆధారం. మహారాష్ట్ర, కర్ణాటక, మధ్యప్రదేశ్‌లోని నల్లరేగడి నేలల్లో వేసే శనగ పంట కేవలం భూమిలోని తేమ ఆధారంగానే పెరుగుతుంది. వర్షాలు లేక భూమి ఎండిపోతే ఈ పంటల దిగుబడి దారుణంగా పడిపోతుంది. ఎల్ నినో వల్ల ఏర్పడే కరవు పరిస్థితులను అధిగమించడానికి 'ఇండియన్ ఓషన్ డైపోల్' కాస్త ఆశాకిరణంగా కనిపిస్తోందని నిపుణులు చెప్తున్నారు. హిందూ మహాసముద్రంలో ఏర్పడే ఈ సానుకూల మార్పు వల్ల భారత్ వైపు వర్షపు మేఘాలు తొలకరిచ్చే అవకాశం ఉంది. 1997, 2023 సంవత్సరాల్లో ఎల్ నినో తీవ్రతను ఈ ఐఓడీ కొంతవరకు తగ్గించగలిగింది. అయితే, ఇది ప్రధానంగా వర్షాకాలానికే పరిమితమవుతుంది కాబట్టి, ఎండిపోయిన భూగర్భ జలాలను, ఖాళీ అయిన రిజర్వాయర్లను ఎంతవరకు నింపుతుందనేది అనుమానంగానే ఉంది. ఒకవేళ అక్టోబర్, నవంబర్ నెలల్లో భూమిలో తేమ శాతం పెరగకపోతే రబీ పంటల విస్తీర్ణం తగ్గడమే కాకుండా దిగుబడులు కూడా దెబ్బతింటాయి. దీనివల్ల రాబోయే రోజుల్లో గోధుమలు, పప్పుధాన్యాలు, వంటనూనెల సరఫరా తగ్గి, నిత్యావసర ధరలు మళ్లీ ఆకాశాన్ని తాకే ప్రమాదం ఉందని ఆర్థిక విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు. ఇది కేవలం రైతుల ఆదాయాన్నే కాకుండా, సామాన్య ప్రజల జేబులకు కూడా పెద్ద కన్నం వేసేలా కనిపిస్తోంది. మరోవైపు రాష్ట్రవ్యాప్తంగా కరవు తాండవిస్తోంది. ఓవైపు వర్షాధార పంటల సాగును చాలా వరకు తగ్గించినప్పటికీ మరోవైపు బోర్లు, బావులపై ఆధారపడి సాగు చేసిన వరి సైతం చేతికందేలా లేదు. భూగర్భజలాలు దారుణంగా పడిపోయి, బోర్లు వట్టిపోతున్నాయి. ఎండిపోతున్న పంటలను చూడలేక అన్నదాతలు బావుల్లో పూడిక తీయిస్తూ కొత్త బోర్లు వేయిస్తున్నా చుక్క నీరు పడటం లేదు. ఈ వర్షాభావ పరిస్థితులు మరో వారం, పదిరోజుల పాటు కొనసాగితే పంటలపై ఆశలు వదిలేసుకోవాల్సిందేనని రైతులు ఆందోళన చెందుతున్నారు. రాష్ట్రంలో సాధారణంగా 1.32 కోట్ల ఎకరాల విస్తీర్ణంలో సాగు నమోదయ్యేది. కానీ ఈ ఏడాది 1.21 కోట్ల ఎకరాలు అంటే సుమారు 92 శాతం మేరకే సాగు చేసినట్లు వ్యవసాయశాఖ గణాంకాలు నివేదిస్తున్నాయి. ప్రధానంగా 66 లక్షల ఎకరాల విస్తీర్ణంలో వరి సాగు నమోదవుతుండగా ఈసారి 52.81 లక్షల ఎకరాల్లో(80 శాతం) మాత్రమే నాట్లు పడ్డాయి. ఇక పత్తి అంచనా సాగు 47 లక్షల ఎకరాలకు గాను 48 లక్షల ఎకరాల్లో సాగు నమోదైంది. 6.49 లక్షల ఎకరాల విస్తీర్ణంలో అపరాలు సాగవుతుండగా 7.86 లక్షల ఎకరాలకు చేరింది. అధికంగా నీటి ఆధారమైన వరి సాగు 20 శాతం వరకు తగ్గింది. కానీ చాలా ప్రాంతాల్లో నాట్లు వేసిన రైతులు మాత్రం పంటను కాపాడుకోడానికి ఎన్నో పాట్లు పడుతున్నారు.రాష్ట్రంలో ఈ సీజన్‌కు సంబంధించి ఇప్పటిదాకా 49 రోజులే వర్షం కురిసింది. 598.9 మిల్లీమీటర్ల సాధారణ వర్షపాతానికి గాను 478.2 మి.మీ మాత్రమే కురిసింది. మొత్తంగా 20 శాతం లోటు వర్షపాతం ఏర్పడగా 15 జిల్లాల్లో సాధారణ వర్షపాతం నమోదైంది. తక్కిన 18 జిల్లాల్లో లోటు వర్షపాతమే కొనసాగుతోంది. జనగామ, వరంగల్, హనుమకొండ, భద్రాద్రి కొత్తగూడెం, జోగులాంబ గద్వాల, సూర్యాపేట, ఖమ్మం, యాదాద్రి భువనగిరి, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాల్లో దాదాపు 40 శాతం లోటులో కొనసాగుతుండటం గమనార్హం. గతేడాదితో పోలిస్తే రాష్ట్రంలో భూగర్భ జలమట్టం దాదాపు 2 మీటర్లకు పైగా పడిపోయింది. గత సంవత్సరం ఆగస్టు చివరి నాటికి 5.78 మీటర్ల లోతులో ఉన్న నీటిమట్టం ఇప్పుడు 7.87 మీటర్లకు పడిపోవడం గమనార్హం. జిల్లాల వారీగా చూస్తే సూర్యాపేట, వికారాబాద్ జిల్లాల్లో గతంతో పోలిస్తే అదనంగా 5 మీటర్ల మేర నీటిమట్టం తగ్గింది. నారాయణపేట, మహబూబ్‌నగర్, మేడ్చల్ జిల్లాల్లో 4 మీటర్లు, అలాగే వరంగల్, సంగారెడ్డి, రంగారెడ్డి, నాగర్‌కర్నూల్ జిల్లాల్లో 3 మీటర్లకు లోతులోకి నీటిమట్టాలు పడిపోయాయి. వర్షాలు కురవక, సాగునీరు లేక అన్నదాతలు అష్టకష్టాలు ఎదుర్కొంటున్నారు. చెరువుల్లో నీటిని బయటకు తోడేందుకు మోటార్లను ఏర్పాటు చేసుకున్నారు. వనపర్తి జిల్లా, వీపనగండ్ల మండలంలోని పుల్లర్ల గ్రామంలో ఉన్న కొత్త చెరువు పరిధిలో 50 ఎకరాలకు పైగా ఆయకట్టు సాగయ్యేది. నీటి వసతి ఉన్న కొందరు రైతులు అక్కడక్కడా సుమారు ఐదు ఎకరాల వరకు వరి సాగు చేశారు. మిగిలిన పొలాలు మాత్రం బీళ్లుగా ఉండిపోయాయి. ఆయకట్టు చివరన ఉన్న పంటలకు నీరందించేందుకు చెరువులో ఉన్న కొద్దిపాటి నీటిని తోడేందుకు రైతులు మోటార్లను ఏర్పాటు చేశారు. ఇలాంటి పరిస్థితులే ముమ్ముందు కొనసాగితే సాగు నీటికే కాదు తాగునీటికి కూడా ఇబ్బందులు ఏర్పడే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

రేవంత్ డైరెక్షన్‌లోనే అంతా జరిగింది

మొదటిపేజీ తరువాయి..

ఆమె, తెలంగాణ అసెంబ్లీ గేటు వద్ద జరిగిన ఘటనలు దేశంలోనే ఎక్కడాలేని విధంగా కౌరవసభను తలపించాయని మండిపడ్డారు. ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపే హక్కు ప్రతిపక్షాలకు ఉంటుందని, అయితే 30 ఏళ్లుగా రాజకీయాల్లో ఉన్న తమను శాసనసభ లోపలికి వెళ్లకుండా పోలీసులు అడ్డుకున్నారని సబితా ఇంద్రారెడ్డి వాపోయారు. కనీసం మహిళా ప్రజాప్రతినిధులనైనా సభలోకి అనుమతించాలని విన్నవించినా పోలీసులు పట్టించుకోలేదని, మహిళా ఎమ్మెల్యేల జుట్టు పట్టుకుని లాగడమే కాకుండా, పురుష ఎమ్మెల్యేలను కిందపడేసి తొక్కేశారని ఆరోపించారు. ఈ తోపులాటలోనే మాజీ మంత్రి జగదీశ్వర్ రెడ్డి కిందపడిపోయారని గుర్తుచేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యక్ష ఆదేశాలతోనే పోలీసు బలగాలు తమపై ఈ స్థాయిలో విరుచుకుపడ్డాయని ఆమె సంచలన

వ్యాఖ్యలు చేశారు. శాసనసభ లోపలైనా ఈ దాడిపై ప్రభుత్వం చర్చ జరుపుతుందని, సీఎం లేదా హోంమంత్రి బాధ్యత వహించి మాట్లాడతారని భావించామని, కానీ దాడులకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోకపోగా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలపైనే ఎదురు కేసులు బనాయించారని సబిత ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళా ఎమ్మెల్యేలను లైంగికంగా వేధించారంటూ అసత్య ఫిర్యాదులు చేయించడం, కేసీఆర్ నివాసం వద్దకు నిరసనకారులను పంపడం వంటివన్నీ సీఎం రేవంత్ రెడ్డి డైరెక్షన్‌లోనే జరిగాయని ఆరోపించారు. రాష్ట్రంలో న్యాయం జరగకపోవడం వల్లే తాము ఢిల్లీకి వచ్చి జాతీయ కమిషన్లను ఆశ్రయించాల్సి వచ్చిందని, ఇది తెలంగాణ ప్రభుత్వానికి సిగ్గుచేటని వ్యాఖ్యానించారు. వంద రోజుల్లో ఇస్తామన్న హామీలను నెరవేర్చడంలో విఫలమైన కాంగ్రెస్ ప్రభుత్వం, ప్రశ్నిస్తున్న ప్రతిపక్షాల గొంతు నొక్కేందుకు మహిళా కానిస్టేబుళ్లను అడ్డుపెట్టుకుని 'శిఖండి రాజకీయాలు' చేస్తోందని ధ్వజమెత్తారు. 22ఎ పేరుతో కోటి ఎకరాలను నిషేధిత జాబితాలో చేర్చి భారీ భూదందాకు తెరలేపారని విమర్శించారు. కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీలకు ఈ దాడుల ఘటనలపై సమగ్ర లేఖలు రాస్తున్నామని, కాంగ్రెస్ నాయకత్వం దీనిపై వెంటనే స్పందించి సమాధానం చెప్పాలని సబితా ఇంద్రారెడ్డి డిమాండ్ చేశారు.

25 ఏళ్ల రాజకీయ ప్రస్థానాన్ని పూర్తి చేసుకున్న మోదీ

మొదటిపేజీ తరువాయి..

వెల్లడించారు. ప్రజలకు సేవ చేయడం ద్వారా మరింత చేరువ కావడం, అలాగే పార్టీ కార్యకర్తల్లో సేవా భావాన్ని పెంపొందించడమే ఈ అభియాన్ ప్రధాన ఉద్దేశమని ఆయన స్పష్టం చేశారు. అభియాన్ ఆరంభ రోజైన సెప్టెంబర్ 17న 'ఆశీర్వాద్ కా దియా' పేరిట రాష్ట్రంలోని ప్రతి ఇంట్లో దీపాలు వెలిగించి

ప్రధానమంత్రికి శుభాకాంక్షలు తెలియజేయాలని రాంచందర్ రావు పార్టీ శ్రేణులకు, ప్రజలకు పిలుపునిచ్చారు. నెల రోజుల పాటు సాగే ఈ ఉత్సవాల్లో భాగంగా రక్తదాన శిబిరాలు, స్వచ్ఛ భారత్ కార్యక్రమాలు, ఉచిత వైద్య శిబిరాలు, వ్యాసరచన పోటీలు నిర్వహిస్తామన్నారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని కేంద్రంలోని మోదీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లేందుకు ప్రణాళికలు సిద్ధం చేసినట్లు వివరించారు. మోదీ పాలనలో జన్‌ధన్ యోజన, డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్ (డీబీటీ) ద్వారా పేదలను నేరుగా బ్యాంకింగ్ వ్యవస్థతో అనుసంధానించి సంక్షేమ ఫలాలను పూర్తి పారదర్శకంగా అందిస్తున్నామని ఆయన తెలిపారు. యూపీఐ, డిజిటల్ చెల్లింపుల విప్లవంతో భారత్ ప్రపంచ డిజిటల్ పేమెంట్ రంగంలో అగ్రగామిగా నిలిచిందన్నారు. పీఎం విశ్వకర్మ, పీఎం స్వనిధి, ముద్ర రుణాల ద్వారా చేతివృత్తిదారులు, వీధి వ్యాపారులు, చిన్న వ్యాపారులకు ఆర్థిక చేయూతనిస్తున్నామని గుర్తుచేశారు. ఈ క్రమంలోనే 'మేరే సప్నో కా భారత్', 'సేవా కీ కహానీ', 'సేవా జ్యోతి కలశ్ యాత్ర', 'సుశాసన్ సేవా సంవాద్' వంటి పలు సామాజిక కార్యక్రమాలు నిర్వహిస్తూ, మోదీ పథకాలను ప్రతి ఇంటికీ చేరవేస్తామని పేర్కొన్నారు.

తెలంగాణ రాజకీయాల్లో కీలక పరిణామం

మొదటిపేజీ తరువాయి..

చర్చను రేకెత్తిస్తోంది. ఈ ఫోన్ సంభాషణ సందర్భంగా రాష్ట్ర రాజకీయ పరిణామాలు, పార్టీలో జరుగుతున్న తాజా పరిణామాలపై ఇరువురి మధ్య చర్చ జరిగినట్లు తెలుస్తోంది. గతంలో తలెత్తిన కొన్ని వ్యక్తిగత అంశాలు మరియు అంతర్గత విభేదాలను పూర్తిగా పక్కనపెట్టి, భవిష్యత్తులో పార్టీ కార్యక్రమాల్లో తిరిగి ఉత్సాహంగా, చురుగ్గా పాల్గొనాలని మీనాక్షి నటరాజన్ ఆమెకు గట్టిగా సూచించినట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి. ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సిఫార్సు మేరకు గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా, కొండా సురేఖను మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేసిన విషయం విదితమే. ఆ తర్వాత జరుగుతున్న ప్రస్తుత అసెంబ్లీ సమావేశాలకు ఆమె హాజరుకాకపోవడం కాంగ్రెస్ పార్టీలో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఈ నేపథ్యంలోనే పార్టీ అధిష్ఠానం ఆదేశాల మేరకు ఇన్‌ఛార్జ్ స్వయంగా రంగంలోకి దిగి ఆమెతో మాట్లాడినట్లు తెలుస్తోంది.

CHANGE OF NAME

I, SHAIK AHMED S/O NAZEER AHMED (Old Name) born on 04-09-1962 at Adilabad earlier was holding passport no. A3972308 DT: 03-11-1997 hereby changing my name and henceforth in future I would be known as SHAIK AHMAD S/O NAZEER AHMED (New name) HNo. 4-5-13/2/401 Khursheed nagar, Adilabad 504001 Telangana.

Place: Adilabad
Date: 12-09-2026

DECLARANT
SHAIK AHMAD
S/O NAZEER AHMED

బొల్లారం ఆయుధాల చోరీ కేసు..

మొదటిపేజీ తరువాయి..

నలుగురు నిందితులను అరెస్ట్ చేసినట్లు ఆయన తెలిపారు. చోరీకి గురైన అత్యంత ప్రమాదకరమైన ఆయుధాలు, మ్యాగజైన్లు, బుల్లెట్లు, బైనాక్యులర్‌ను స్వాధీనం చేసుకున్నట్లు స్పష్టం చేశారు. ఆగస్టు 31న జరిగిన ఈ ఆయుధాల దొంగతనంలో బెల్ ఆఫ్ ఆర్మ్స్ ఇన్ ఛార్జ్, అమ్యునేషన్ సెక్షన్ ఇన్ ఛార్జ్ సహకారం ఉన్నట్లు విచారణలో తేలింది. మొదట బెల్ ఆఫ్ ఆర్మ్స్‌లోకి ప్రత్యక్షంగా ప్రవేశ అర్హత ఉన్న 16 మందిపై దృష్టి సారించిన అధికారులు, సుదీర్ఘ సాంకేతిక విచారణ చేపట్టారు. ఈ క్రమంలో హవాల్దార్లు టి.పి.ఎస్. రావు, మల్లేశ్ అలియాస్ రాజుల ప్రవర్తన అనుమానాస్పదంగా కనిపించడంతో వారిపై నిఘా పెట్టారు. విచారణ సమయంలో మల్లేశ్ అధికారులను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేసినప్పటికీ, సాంకేతిక ఆధారాలతో నిలదీయడం, అధికారులు అతడి భార్యకు పరిస్థితి వివరించడంతో అసలు నిజం బయటపడింది. భార్య గట్టిగా ప్రశ్నించడంతో మల్లేశ్ ఆయుధాల దొంగతనం ఒప్పుకున్నాడు.

మూసీ ప్రాజెక్టుకు అడ్డంకులు

మొదటిపేజీ తరువాయి..

రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన పర్యావరణ అనుమతులను సవాల్ చేస్తూ కొందరు రిటైర్డ్ ఇంజినీర్లు చెన్నైలోని 'నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్' (ఎన్జీటీ) దక్షిణాది బెంచ్‌ను ఆశ్రయించారు. ఈ అప్పీల్‌పై విచారణ జరిపిన ట్రిబ్యునల్, ప్రతివాదిగా ఉన్న తెలంగాణ ప్రభుత్వానికి అధికారికంగా నోటీసులు జారీ చేసింది.మూసీ ప్రక్షాళన పనులకు సంబంధించిన పర్యావరణ నిబంధనలు మరియు అనుమతుల్లో స్పష్టమైన లోపాలు ఉన్నాయని పిటిషనర్లు తమ పిటిషన్‌లో ఆరోపించారు. మూసీ పరివాహక ప్రాంతం మొత్తం 55 కిలోమీటర్ల మేర విస్తరించి ఉంటే, కేవలం 20 కిలోమీటర్ల పరిధిలో మాత్రమే అధ్యయనం చేయడం సరికాదని పేర్కొన్నారు. అంతేకాకుండా, ఇదే ప్రాంతంలో ప్రముఖ 'మృగవాణి జాతీయ పార్కు' కూడా ఉన్న విషయాన్ని వారు ట్రిబ్యునల్ దృష్టికి తీసుకువచ్చారు.ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్ జలాశయాల పరిసర ప్రాంతాల్లో భారీ నిర్మాణాలు చేపట్టాలన్న ప్రభుత్వ నిర్ణయంపై రిటైర్డ్ ఇంజినీర్లు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఆ ప్రాంతంలో వాణిజ్య సముదాయాల ఏర్పాటు నిర్ణయం పర్యావరణ సమతుల్యతను దెబ్బతీస్తుందని వాదించారు. ఈ ప్రాజెక్టు వల్ల భవిష్యత్తులో పర్యావరణంపై పడే దుష్ప్రభావాలను సమగ్రంగా విశ్లేషించాల్సిన అవసరం ఉందని పిటిషనర్లు స్పష్టం చేశారు.పిటిషన్‌ను పరిశీలించిన ఎన్జీటీ.. పర్యావరణ అనుమతుల జారీ, ప్రాజెక్టు అమలుకు సంబంధించిన పూర్తి వివరాలను తమ ముందుంచాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. మూసీ ప్రాజెక్టుపై గతంలోనూ కొద్దికాలం క్రితం న్యాయపరమైన వివాదాలు నడిచినా, ఇప్పుడు తాజా పిటిషన్ దాఖలు కావడంతో ఈ వ్యవహారం రాజకీయంగా కూడా తీవ్ర చర్చనీయాంశమైంది. ఈ అప్పీల్‌పై తదుపరి విచారణను ఎన్జీటీ అక్టోబర్ 16వ తేదీకి వాయిదా వేసింది.

పాలిటెక్నిక్ కళాశాలలను ప్రైవేటీకరించే ప్రసక్తేలేదు

మొదటిపేజీ తరువాయి..

వివేక్ వెంకటస్వామి శాసనసభ సాక్షిగా తేల్చి చెప్పారు. పాలిటెక్నిక్ విద్యారంగంలో మౌలిక సదుపాయాలను మరింత బలోపేతం చేసేందుకు గాను రూ. 8,000 కోట్లతో భారీ ఎత్తున కళాశాలలను అప్‌గ్రేడ్ చేయనున్నట్లు వెల్లడించారు. ప్రభుత్వం చేపడుతున్న ఈ మార్పుల వల్ల కళాశాలల ప్రైవేటీకరణ జరుగుతుందేమోనని విద్యార్థులు, అధ్యాపకులలో నెలకొన్న అనుమానాలు, అపోహలను తొలగించేందుకు ప్రభుత్వం తగిన చర్యలు తీసుకుంటుందని హామీ ఇచ్చారు. విద్యార్థుల భవిష్యత్తుకు ఎటువంటి భంగం వాటిల్లకుండా, సాంకేతిక విద్యను అందరికీ అందుబాటులో ఉంచడమే తమ ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని స్పష్టం చేశారు.ఈ సందర్భంగా బిఆర్ఎస్ పార్టీ చేస్తున్న విమర్శలపై మంత్రి తీవ్రస్థాయిలో మండిపడ్డారు. పాలిటెక్నిక్ కళాశాలల ప్రైవేటీకరణపై బిఆర్ఎస్ నాయకులు ఉద్దేశపూర్వకంగా విషప్రచారం చేస్తూ విద్యార్థులను, వారి తల్లిదండ్రులను గందరగోళానికి గురిచేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యా విధానంలో పారదర్శకత కోసం, విద్యార్థుల ప్రయోజనాలను కాపాడేందుకు అవసరమైతే జీవో 97 లో తగిన మార్పులు చేర్పులు చేయడానికి కూడా ప్రభుత్వం సిద్ధంగా ఉందని ప్రకటించారు. అంతేకాకుండా, కళాశాలల్లో ఎలాంటి ఫీజుల పెంపు ఉండదని, పేద విద్యార్థులకు నాణ్యమైన సాంకేతిక విద్యను నిరంతరం అందిస్తామని మంత్రి వివేక్ అసెంబ్లీలో స్పష్టం చేశారు.

ఉద్యోగులకు ప్రమాద బీమా

మొదటిపేజీ తరువాయి..

కుటుంబాలకు జీవితకాల భరోసా కల్పించాలనే ఆలోచనతోనే ఈ పథకాన్ని తీసుకొచ్చాం" అని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. ప్రభుత్వం ప్రతి నెలా బ్యాంకుల ద్వారా జీతాలు చెల్లిస్తుందని, బ్యాంకర్లతో చర్చించి వారి వ్యాపార అభివృద్ధికి అనుగుణంగా ఇన్సూరెన్స్ కంపెనీలతో ఒప్పందం కుదుర్చుకున్నామని వెల్లడించారు. అందుకోసమే ప్రభుత్వం 16 ప్రముఖ బ్యాంకులతో అవగాహన ఒప్పందం కుదుర్చుకుందని, ఈ మేరకు ఆర్థిక శాఖ జీవో నంబర్ 77ను జారీ చేసిందని వివరించారు.

ఉద్యోగికి అనుకోకుండా ఏదైనా ప్రమాదం జరిగి మరణిస్తే వారి కుటుంబం తీవ్ర ఆర్థిక సంక్షోభంలో పడుతుంది. అటువంటి కుటుంబాలకు జీవితకాల భరోసా కల్పించాలనే ఆలోచనతోనే ఈ పథకాన్ని తీసుకొచ్చాం" అని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. ప్రభుత్వం ప్రతి నెలా బ్యాంకుల ద్వారా జీతాలు చెల్లిస్తుందని, బ్యాంకర్లతో చర్చించి వారి వ్యాపార అభివృద్ధికి అనుగుణంగా ఇన్సూరెన్స్ కంపెనీలతో ఒప్పందం కుదుర్చుకున్నామని వెల్లడించారు. అందుకోసమే ప్రభుత్వం 16 ప్రముఖ బ్యాంకులతో అవగాహన ఒప్పందం కుదుర్చుకుందని, ఈ మేరకు ఆర్థిక శాఖ జీవో నంబర్ 77ను జారీ చేసిందని వివరించారు. ఈ పథకం ద్వారా ఇప్పటికే 89 ఉద్యోగ కుటుంబాలకు ప్రమాద బీమా పరిహారాన్ని అందించినట్లు డిప్యూటీ సీఎం భట్టి తెలిపారు.

తెలంగాణ ప్రభుత్వం

ఫారం-VII

(Declaration) రూఢీ ప్రకటన

భూసేకరణ, పునరావాస, పునఃస్థాపనలో పారదర్శకత మరియు సముచిత నష్టపరిహార హక్కు చట్టము 2013 (చట్టం 30/2013) సెక్షన్ 19(1) మరియు తెలంగాణ రాష్ట్ర భూసేకరణ, పునరావాస, పునఃస్థాపనలో పారదర్శకత మరియు సముచిత నష్టపరిహార నియమావళి 2014 రూల్ 25 ప్రకారము

NO. G2/806/2026 తేది: 08.09.2026.
Gaz. No. 157/2026

నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి మండలములోని వేపూర్ గ్రామము వద్ద మహాత్మాగాంధీ ఎత్తిపోతల పథకం డిస్ట్రిబ్యూటరీ కెనాల్-64 (Major-2/Minor-2R/Subminor-2) నిర్మాణ నిమిత్తము వేపూర్ గ్రామ పరిధి నందు ఈ క్రింది షెడ్యూల్‌లో ఉదహరించిన ఎ.4.10½ గుంటలు భూమి ప్రజా ప్రయోజనార్థం అనగా మహాత్మాగాంధీ ఎత్తిపోతల పథకం డిస్ట్రిబ్యూటరీ కెనాల్-64 (Major-2/Minor-2R/Subminor-2) నిమిత్తం సేకరించవలసిన అవసరం ఉన్నదని ప్రత్యేక ఉప కలెక్టరు (భూసేకరణ) యం.జి.ఎల్.ఐ.యస్.పి నాగర్‌కర్నూల్ గారు భావిస్తున్నారు. కాబట్టి ఎ.లు.4.10½ గుం॥ భూమి డిస్ట్రిబ్యూటరీ కెనాల్-64 (Major-2/Minor-2R/Subminor-2) నిమిత్తం భూసేకరణ ద్వారా సేకరించుటకు గాను రూఢీ ప్రకటన చేయడమైనది. సేకరించడానికి నిర్ధారించిన భూముల వివరాలు సంక్షిప్తంగా క్రింది ప్రకారం గలవు.

షెడ్యూల్

గ్రామము : వేపూర్ మండలం : కల్వకుర్తి జిల్లా : నాగర్‌కర్నూల్

క్ర. సం.	సర్వే నెం./ ఎస్. టి. నెం.	పట్టా/ ఖాతా etc.	భూవర్గీకరణ మెట్ట /మరియు /తరి	భూసేకరణకు ప్రతిపాదించిన విస్తీర్ణము ఎ.గుం టలు	పట్టాదారు పేరు అనుభవదారు పేరు మరియు ఏవైనా హక్కులు గల ఇతర వ్యక్తులు	సరిహద్దులు ఉ	ద	తూ	ప	రెట్లు మెట్ట పై క్ష	రెట్ల సంఖ్య	నిర్మాణములు వర్గము	విస్తీర్ణము
1	2	3	4	5	6	7	8	9	10	11	12	13	14
1	44	పట్టా	మెట్ట	0.28 1/2	సూరిసేని వెంకటేశ్వర్‌రావు తండ్రి లక్ష్మారావు (0.28½) సూరిసేని దినేష్ తండ్రి మురళీధర్‌రావు సూరిసేని భాస్కర్‌రావు తండ్రి లక్ష్మారావు సూరిసేని మురళీధర్‌రావు తండ్రి లక్ష్మారావు	28	48	45	43	లేవు	లేవు	లేవు	లేవు
2	45	పట్టా	మెట్ట	0.15 1/2	కొండూరు శ్రీనివాసులు తండ్రి లింగయ్య(0.15½) కొండూరు గోవర్ధన్ తండ్రి లింగయ్య కొండూరు చంద్రశేఖర్ తండ్రి లింగయ్య కొండూరు వెంకటరమణ తండ్రి సర్వియ్యామ్మ కొండూరు కోళారాణి భర్త శ్రీనివాసులు కొండూరు కవిత భర్త చంద్రశేఖర్ కొండూరు మాధవి భర్త గోవర్ధన్	27	48	46	44	లేవు	లేవు	లేవు	లేవు
3	48	పట్టా	మెట్ట	0.22 1/2	గుబ్బసాయిబాబు తండ్రి మల్లయ్య (0.12) జాలారి ఏజయ భర్త రవికుమార్(0.10½) గుబ్బ ఈశ్వరయ్య తండ్రి అంతయ్య గెబ్బ ఆశోక్ తండ్రి చంద్రయ్య గుబ్బ ఈశ్వరయ్య తండ్రి చంద్రయ్య గుబ్బ వెంకటేశ్వర్లు తండ్రి చంద్రయ్య గుబ్బ పరమేశ్వర్ తండ్రి సింహ్మయ్య గుబ్బ విద్యాసాగర్ తండ్రి సింహ్మయ్య గుబ్బ కృష్ణ తండ్రి అంతయ్య గుబ్బఈశ్వరయ్య తండ్రి సింహ్మయ్య కొండూరు గోవర్ధన్ తండ్రి లింగయ్య గుబ్బ శంకరయ్య తండ్రి సింహ్మయ్య గుబ్బ బాలలక్ష్మమ్మ భర్త చంద్రయ్య గుబ్బ రమేష్ తండ్రి అంతయ్య గుబ్బ స్వప్న భర్త ఆశోక్ ముచర్ల వమ్మ భర్త పరమేశ్వర్ గంపలయిష్‌కుమార్ తండ్రి శ్రీనివాస్ బాస కార్తీక్ తండ్రి రవికుమార్ కొంటం శ్రీనివాస్‌రెడ్డి తండ్రి బాలిరెడ్డి	45	66	47	44	లేవు	లేవు	లేవు	లేవు
4	47	పట్టా	మెట్ట	0.22	కొండూరు గోవర్ధన్ తండ్రి లింగయ్య(0.05) కొండూరుశ్రీనివాసులు తండ్రి లింగయ్య(0.05) కొండూరువంద్రశేఖర్ తండ్రి లింగయ్య(0.05) అయ్యదావు విజేత భర్త వనన్‌రెడ్డి(0.07) కె.అనిత భర్త బాలమల్లయ్య అంద్రె అంతయ్య తండ్రి చెన్నయ్య అంద్రె దెన్నయ్య తండ్రి రాములు అంద్రె శ్రీశైలం తండ్రి బాలయ్య అంద్రె నుమతమ్మ భర్త రమేష్ కేశ జంగమ్మ భర్త బాలయ్య కేశ నరేష్ తండ్రి బాలయ్య	46	69	VB	48	కొబ్బరి చెట్లు బోరు బావి శ్రీగంధం కొబ్బరి సర్వి చెట్లు	15 15 8 5 7	గేటు పిల్లర్స్	0.15
5	69	పట్టా	మెట్ట	1.03 1/2	అయ్యదవు విజేత భర్త వనన్ రెడ్డి (1.03½)	47	70	VB	68	కొబ్బరి చెట్లు బోరు బావి శ్రీగంధం కొబ్బరి సర్వి చెట్లు	95 95 14 90	బోరు పైప్ లైన్	1.03 1/2
6	70	పట్టా	మెట్ట	0.15 1/2	అంద్రె రాములమ్మ భర్త దిన్న లింగయ్య(0.05) అంద్రె లక్ష్మయ్య తండ్రి హనయ్య(0.05½) అయ్యదవు విజేత భర్త వనన్‌రెడ్డి(

మండల కాంగ్రెస్ పార్టీ అధ్వర్యంలో ఆర్థిక సహాయం అందజేత

దండేపల్లి, సెప్టెంబర్ 11(ప్రజాజ్యోతి) : మండలం లింగాపూర్ గ్రామానికి చెందిన రజిత తన ఆరెళ్ల కుమార్తెతో సహా ఇటివల బావిలో దూకి ఆత్మహత్య చేసుకోగా, మూడు సంవత్సరాల బాబు అనాథ అయినాడు. వృద్ధులు అయిన అమ్మమ్మ, తాతయ్య గోట్ల లచన్న వద్ద ఉన్న బాబు సంరక్షణ కోసం 10000 రూపాయలు మరియు తాళ్లపేట్ గ్రామనికి చెందిన బతిని మహేష్ కు లివర్ చెడిపోయి అనారోగ్యం చెంధగా,నిరుపేద అయిన మహేష్ చికిత్స కోసం అతడి కుటుంబ సబ్యులకు 10000 రూపాయలు దండేపల్లి మండల కాంగ్రెస్ పార్టీ తరపున అందించటం జరిగింది. ఈ సందర్భంగ నాయకులు మట్లాడుచు ఆపదలో ఉన్న ప్రతీ ఒక్కరికి మండల కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుంద న్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర GCC చైర్మన్ కొట్నాక తిరుపతి, డిసిసి ఉపాధ్యక్షులు ముద్దసాని వేణు,మాజి ఎంపిపి జాబు కాంతారావు, సర్పంచ్ ఎల్తపు శ్రీనివాస్, ఉప సర్పంచ్‌లు మలవత్ రాజు, బానావత్ తిరుపతి, కారుకూరి తిరుపతి, బొడ్డు చరణ్, మాజి ఎంపిటిసిలు ఇప్ప సురేందర్, బొడ్డు కమలాకర్, శివలాల్ మండల నాయకులు వనపర్తి రవి,కంది సతీష్పూజూరు సబ్బుడు అడ్డె కంథారావు నాయకులూ ప్రభాకర్, గెల్లు శ్రీనివాస్, సాదిక్, సల్లు, మదవి శ్రీనివాస్, థాజిమ్, డి.శంకర్, మన్సూర్, జాహిద్, వజీద్, కెసిఆర్, లక్ష్మయ్య, అంజన్న, సతీష్, కె.అంజి, ఎస్.అంజి, రవీందర్, రాజన్న, వెంకటేష్ తధితరులు పాల్గొన్నారు.

దండేపల్లి ఎస్సీ సెల్ జిల్లా కార్యదర్శిగా జాడి ప్రేమ్ సాగర్ నేత

దండేపల్లి, సెప్టెంబర్ 11 (ప్రజాజ్యోతి) : దండేపల్లి మండల కేంద్రానికి చెందిన జాడి ప్రేమ్ సాగర్ నేత కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ మంచిర్యాల జిల్లా కార్యదర్శిగా నియమితులయ్యారు. టిపిసిసి ఎస్సీ సెల్ చైర్‌పర్సన్ కవ్వంపల్లి సత్యనారాయణ ఆదేశాల మేరకు, మంచిర్యాల జిల్లా చైర్‌పర్సన్ పైడిమల్లు నర్సింగ్ ఆయనకు నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సంద ర్భంగా ప్రేమ్ సాగర్ నేత మాట్లాడుతూ... తనపై నమ్మకంతో ఈ బాధ్యతను అప్పగించిన పార్టీ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవే శపెడుతున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లేందుకు శ్రమిస్తానని, ఎస్సీ సెల్ బలోపేతానికి తనవంతు కృషి చేస్తానని ఆయన వెల్లడించారు.

అక్టోబర్ 3--4న కోల్ ఇండియా ఉద్యోగుల పీఎల్ఆర్ పై కీలక నిర్ణయం....??

- అపెక్స్ జేసీసీ సమావేశంలో చర్చకు అవకాశం.. మూడు ప్రత్యామ్నాయాలపై సమాలోచనలు

- 11వ జేబీసీసీ కాలపరిమితి ముగిసిన నేపథ్యంలో స్టాండర్డైజేషన్ కమిటీ చట్టబద్ధతపై ప్రశ్నలు

మంచిర్యాల, 11, సెప్టెంబర్ (ప్రజాజ్యోతి): కోల్ ఇండియా నాన్-ఎగ్జిక్యూటివ్ ఉద్యోగులకు 2025--26 ఆర్థిక సంవత్సరానికి చెల్లించాల్సిన పీఎల్ఆర్ (పెర్ఫార్మెన్స్ లింక్డ్ రివార్డ్)/ఎక్స్‌గ్రేషియా నిర్ణయంపై ఉత్కంఠ నెలకొంది. అక్టోబర్ 3--4 తేదీల్లో ప్రతిపాదిత కోల్ ఇండియా అపెక్స్ జేసీసీ సభ్యుల సమావేశంలో పీఎల్ఆర్‌పై కీలక నిర్ణయం తీసుకునే అవకాశం ఉందని సమాచారం . ఆగస్టు 3న జరిగిన అపెక్స్ జేసీసీ సమావేశంలో ఇద్దరు యూనియన్ ప్రతినిధులు పీఎల్ఆర్ నిర్ణయాన్ని స్టాండర్డైజేషన్ కమిటీకి బదులుగా అపెక్స్ కమిటీలోనే తీసుకోవాలని పట్టుబట్టినట్లు సమాచారం. ఈ అంశంపై సమావేశంలో సుదీర్ఘంగా చర్చ జరిగినట్లు తెలుస్తోంది. సాంప్రదాయకంగా పీఎల్ఆర్ నిర్ణయం జేబీసీసీఐకి చెందిన స్టాండర్డైజేషన్ కమిటీలో ద్వైపాక్షిక చర్చల ద్వారా జరుగుతూ వచ్చింది. అయితే పారిశ్రామిక సంబంధాల కోడ్--2020 అమల్లోకి రావడం, దాని సెక్షన్--14 కింద కొత్త చర్చల వ్యవస్థ ఏర్పడటంతో పీఎల్ఆర్ నిర్ణయానికి సరైన వేదిక ఏదన్న అంశంపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో సమావేశంలో మూడు ప్రత్యామ్నాయాలపై చర్చ జరిగినట్లు సమాచారం. మొదటి ప్రత్యామ్నాయం -- స్టాండర్డైజేషన్ కమిటీ: ఇప్పటివరకు పీఎల్ఆర్ నిర్ణయాలు ఈ కమిటీ ద్వారానే జరుగుతూ వచ్చాయి. అయితే 11 వ ఎన్‌సీడబ్ల్యూఏ కాలపరిమితి ముగియడం, పీఎల్ఆర్ ఎన్‌సీడబ్ల్యూఏ--11 లో భాగం కాకపోవడంతో ఈ కమిటీకి ప్రస్తుతం ఉన్న అధికారాలు, నిర్ణయం తీసుకునే చట్టబద్ధమైన హోదాపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి. రెండో ప్రత్యామ్నాయం -- సీఐఎల్ అపెక్స్ జేసీసీ: పీఎల్ఆర్ అంశాన్ని సీఐఎల్ అపెక్స్ జేసీసీ ముందు సంప్రదింపుల కోసం ఉంచి, కేంద్ర ట్రేడ్ యూనియన్ల ప్రతినిధుల అభిప్రాయాలను తీసుకున్న అనంతరం తగిన స్థాయిలో నిర్ణయం తీసుకోవడం. అయితే ఈ విధానాన్ని పారిశ్రామిక సంబంధాల కోడ్ సెక్షన్--14 కింద చర్చల యూనియన్‌కు ప్రత్యామ్నాయంగా కాకుండా, నిర్ణయానికి ముందు సంప్రదింపుల వేదికగానే ఉపయోగించనున్నట్లు స్పష్టమైనట్లు తెలుస్తోంది. 2016--17లో కూడా పీఎల్ఆర్ అంశంపై అపెక్స్ జేసీసీలో చర్చ జరిగినట్లు సమాచారం. మూడో ప్రత్యామ్నాయం -- కేంద్ర ట్రేడ్ యూనియన్ల ప్రత్యేక సమావేశం: జేబీసీసీఐలో సాంప్రదాయకంగా నిర్వహించే కేంద్ర ట్రేడ్ యూనియన్ల ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేసి, కేవలం 2025--26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన పీఎల్ఆర్ కోసం మధ్యంతర ఏర్పాటుగా నిర్ణయం తీసుకోవడం. గతంలో 2021--22, 2022--23 సంవత్సరాల పీఎల్ఆర్ విషయంలోనూ ఇదే తరహా విధానాన్ని అనుసరించినట్లు తెలుస్తోంది. ఇదిలా ఉండగా, 11వ జేబీసీసీఐ కాలపరిమితి ముగిసినందున పీఎల్ఆర్ నిర్ణయం కోసం స్టాండర్డైజేషన్ కమిటీ సమావేశాన్ని నిర్వహించలేమని కొందరు కమిటీ సభ్యులు, నిపుణులు అభిప్రాయపడుతున్నారు. అయితే ఇదే అంశంపై మరో కీలక ప్రశ్న కూడా ఉత్పన్నమవుతోంది. 11వ జేబీసీసీఐ కాలపరిమితి ముగిసినందున స్టాండర్డైజేషన్ కమిటీకి చట్టబద్ధత లేదని భావిస్తే, అదే కమిటీ పరిధిలోని 'మిగులు క్వార్టర్ల ఉపయోగం'పై ఏర్పాటైన సబ్-కమిటీ సమావేశం సెప్టెంబర్ 10న ఏ ప్రాతిపదికన జరిగిందన్న ప్రశ్న తలెత్తుతోంది. ఏ3ఏ కమిటీకి చట్టబద్ధత లేదన్న వాదన పీఎల్ఆర్ అంశానికే పరిమితమా? లేక అదే పరిధిలోని ఇతర సబ్-కమిటీలు నిర్వహించిన సమావేశాలు, తీసుకున్న నిర్ణయాలపైనా ప్రభావం ఉంటుందా? అనే చర్చ ఉద్యోగ, కార్మిక వర్గాల్లో మొదలు అయింది .ఈ నేపథ్యంలో కోల్ ఇండియా యాజమాన్యం సాంప్రదాయక స్టాండర్డైజేషన్ కమిటీ విధానాన్నే కొనసాగిస్తుందా? సీఐఎల్ అపెక్స్ జేసీసీని కేవలం సంప్రదింపుల వేదికగా ఉపయోగిస్తుందా? లేక కేంద్ర ట్రేడ్ యూనియన్ల ప్రత్యేక సమావేశం ద్వారా 2025--26 పీఎల్ఆర్‌కు మధ్యంతర పరిష్కారం చూపుతుందా? అన్నది అక్టోబర్ 3--4 తేదీల్లో జరిగే ప్రతిపాదిత సమావేశంపై ఆసక్తిని రేకెత్తిస్తున్నది .

ట్రాక్టర్‌పై అసెంబ్లీకి వెళ్లిన ఎమ్మెల్యే రామరావ్ పటేల్

రైతుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్

బాసర సెప్టెంబర్ 11 (ప్రజా జ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం రైతాంగ సమస్యలను పట్టించుకోవడంలేదని బిజెపి డిప్యూటీ ఫ్లోర్ లీడర్ పాయల శంకర్ నేతృత్వంలో ముధోల్ ఎమ్మెల్యే రామరావ్ పటేల్ తో పాటు పలువురు ఎమ్మెల్యేలు ట్రాక్టర్ పై అసెంబ్లీకి వెళ్లి నిరసన తెలిపారు. వర్ష పరిస్థితులతో పంటలు ఎండుతున్న తీరును వివరిస్తూ నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రామరావ్ పటేల్ మట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పసల్ బీమాను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఫసల్ బీమా లేకపోవడం మూలంగా వర్షాభావ పరిస్థితులతో రైతుకు నష్టం జరుగుతున్న, బీమా పరిహారం అందడం లేదన్నారు.

పాలకులు మారారే తప్ప, పాలన ఏమాత్రం మారలేదు అన్నారు. గత ప్రభుత్వం నిర్వాహకం ములంగా రైతులు నష్టపోయారని, కాంగ్రెస్ ప్రభుత్వం ఇదే వైఖరి అవలంబిస్తుంద న్నారు. ఇచ్చిన హామీ ప్రకారం రెండు లక్షల రూపాయల రుణమాఫీ చేయాలన్నారు. గన్ పార్క్ నుండి ఎమ్మెల్యేలంతా ట్రాక్టర్ పై అసెంబ్లీకి వెళ్తుండగా గేటు వద్ద పోలీసులు అడ్డుకున్నారు. దీంతో అసెంబ్లీలో తమ గళాన్ని వినిపిస్తామని ఈ సందర్భంగా బిజెపి ఎమ్మెల్యేలు తెలియజేశారు.

ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య సేవలు మరింత మెరుగుపరచాలి

- జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా

నిర్మల్ జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 11, (ప్రజాజ్యోతి) : జిల్లా ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రికి వైద్యం కోసం వచ్చే ప్రజలకు మెరుగైన, నాణ్యమైన వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆసుపత్రి సూపరింటెండెంట్ కార్యాలయంలో వైద్యాధికారులు, వివిధ విభాగాల అధిపతులతో కలెక్టర్ సమావేశమై ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవలపై సమీక్షించారు. రోజువారీగా నమోదవుతున్న ఓపీ వివరాలతో పాటు వివిధ విభాగాల్లో అందుతున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. జనరల్ మెడిసిన్, గైనకాలజీ, ఆర్థోపెడిక్, కార్డియాలజీ, రేడియాలజీ, ఈఎన్‌టీ తదితర విభాగాల్లో వైద్య సేవల మెరుగుదలకు అవసరమైన పరికరాలు, శస్త్రచికిత్సలకు అవసరమైన యంత్రాల వివరాలను ఆయా విభాగాల అధిపతుల నుంచి సేకరించారు. అవసరమైన పరికరాలను ప్రాధాన్యత క్రమంలో సమకూర్చేందుకు చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు.

ఆసుపత్రికి వచ్చే రోగులకు సౌకర్యవంతంగా వైద్య సేవలు అందేలా అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పిస్తామని కలెక్టర్ పేర్కొన్నారు. సదుపాయాలు మెరుగుపడితే మరింత మంది రోగులకు ఆసుపత్రిలోనే మెరుగైన చికిత్స అందించే అవకాశం ఉంటుందని అన్నారు. ఆసుపత్రి ప్రాంగణంలో పార్కింగ్ సమస్యలు తలెత్తకుండా తగిన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. అనంతరం పార్కింగ్ స్థలాన్ని కలెక్టర్ స్వయంగా పరిశీలించారు. ఈ సమావేశంలో ఆసుపత్రి పర్యవేక్షకులు గోపాల్ సింగ్, అధికారులు రమేష్, సరోజ, వైద్యులు, అధికారులు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వినాయక విగ్రహాల ఏర్పాటుకు
పోలీసుల అనుమతి తప్పనిసరి

- విగ్రహాల ఏర్పాటుకు ఆన్‌లైన్‌లో సమాచారం అందించాలి

- నిబంధనలకు లోబడి ఉత్సవాలు నిర్వహించాలి: పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా

మంచిర్యాల, 11, సెప్టెంబర్ (ప్రజా జ్యోతి) : ఈ నెల 14వ తేదీ సోమవారం వినాయక చవితి పండుగ సందర్భంగా రామగుండము పోలీస్ కమిషనరేట్ పరిధిలోని పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాల్లో మండపాలు ఏర్పాటు చేసి వినాయక విగ్రహాలను ప్రతిష్ఠించి ఉత్సవాలు నిర్వహించాలనుకునే వారు తప్పనిసరిగా పోలీస్ శాఖ అనుమతి పొందాలని రామగుండము పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా శుక్రవారం తెలిపారు.

వినాయక విగ్రహాల ఏర్పాటుకు సంబంధించిన పూర్తి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. ఇందుకోసం https://police-portal.tspolice.gov.in వెబ్‌సైట్‌ను సందర్శించి దరఖాస్తుదారుని వివరాలు, విగ్రహం ఏర్పాటు చేసే ప్రదేశం, ఆ ప్రదేశం ఏ పోలీస్ స్టేషన్ పరిధిలోకి వస్తుందో, విగ్రహం ఎత్తు, మండపం ఎత్తు, కమిటీ సభ్యుల పేర్లు, వారి ఫోన్ నంబర్లు, విగ్రహాన్ని ప్రతిష్ఠించే తేదీ, నిమజ్జనం చేసే తేదీ, సమయం, ప్రదేశం, నిమజ్జనం చేసే ప్రదేశానికి చేరుకునే వాహనం వివరాలను నమోదు చేయాలని తెలిపారు. అదేవిధంగా మండప నిర్వాహకులు, గణపతి ఉత్సవ కమిటీ సభ్యులు, వాలంటీర్ల పేర్లు, ఫోన్ నంబర్లు, చిరునామా తదితర వివరాలను కూడా పూర్తిగా నమోదు చేయాలని సూచించారు. పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాల్లోని పట్టణాలు, గ్రామాల్లో ఏర్పాటు చేసే గణపతి మండపాల నిర్వాహకులు తప్పనిసరిగా వెబ్‌సైట్‌లో తమ వివరా లను నమోదు చేయాలని కమిషనర్ కోరారు. ఆన్‌లైన్‌లో వివరాలను నమోదు చేయడంలో ఇబ్బందులు ఎదురైతే సమీపంలోని పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలని తెలిపారు. పర్యావరణ పరిరక్షణను దృష్టిలో ఉంచుకుని ఉత్సవ కమిటీ సభ్యులు మట్టి వినాయక విగ్రహాల ప్రతిష్ఠాపనకు ప్రాధాన్యత ఇవ్వాలని కమిషనర్ సూచించారు. ఎలాంటి అత్యవసర పరిస్థితి ఎదురైనా కమిషనరేట్ పోలీస్ యంత్రాంగం 24 గంటలు అందుబాటులో ఉండి అప్రమత్తంగా ఉంటుందని, అత్యవసర సమయంలో వెంటనే డయల్ 112కు సమాచారం అందించాలని తెలిపారు. మండపాల్లో వినాయక విగ్రహాలను ఏర్పాటు చేసి ఉత్సవాలు నిర్వహించే నిర్వాహకులు తప్పనిసరిగా పోలీస్ శాఖ నిబంధనలకు లోబడి ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించాలని పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా సూచించారు.

పెన్షనర్ల సమస్యల పరిష్కారంలో ఏఐటీయూసీ విఫలం

- యాజమాన్యంతో జరిగిన చర్చల్లో ప్రధాన సమస్యలను ప్రస్తావించలేదు

- అఖిల భారతీయ కోల్ మైన్స్ పెన్షనర్స్ మహాసంఘ్ అధ్యక్షుడు పులి రాజారెడ్డి

మంచిర్యాల, 11, సెప్టెంబర్ (ప్రజాజ్యోతి): సింగరేణి పెన్షనర్ల సమస్యల పరిష్కారంలో గుర్తింపు పొందిన కార్మిక సంఘం ఏఐటీయూసీ పూర్తిగా విఫలమైందని అఖిల భారతీయ కోల్ మైన్స్ పెన్షనర్స్ మహాసంఘ్ అధ్యక్షుడు పులి రాజారెడ్డి శుక్రవారం విమర్శించారు. సింగరేణి ప్రధాన కార్యాలయంలో యాజమాన్యంతో గుర్తింపు పొందిన కార్మిక సంఘం ప్రతినిధులు నిర్వహించిన చర్చల్లో పెన్షనర్లకు సంబంధించిన ప్రధాన సమస్యలపై ఎలాంటి స్పష్టమైన నిర్ణయం తీసుకోలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. గత కొన్ని సంవత్సరాలుగా పెన్షనర్ల సమస్యలపై సమావేశాలు నిర్వహిస్తున్నప్పటికీ, ఒక్క ప్రధాన సమస్యనైనా పరిష్కరించినట్లు ప్రకటించలేదని తెలిపారు. గుర్తింపు పొందిన కార్మిక సంఘం పదవీకాలం ముగిసే దశకు చేరుకున్నప్పటికీ, పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి తగిన ప్రాధాన్యం ఇవ్వకపోవడం బాధాకరమని అన్నారు.

- ప్రధాన సమస్యలను ఎందుకు ప్రస్తావించలేదు?

పెన్షనర్లకు సంబంధించిన అనేక సమస్యలు సంవత్సరాలుగా పరిష్కారం కాకుండా పెండింగ్‌లో ఉన్నాయని పులి రాజారెడ్డి తెలిపారు. ముఖ్యంగా పెన్షనర్ల వైద్య బిల్లులు నెలల తరబడి పెండింగ్‌లో ఉండటం, ఫ్రిస్క్రిప్షన్ పేరుతో ఆసుపత్రుల్లో పెన్షనర్ల నుంచి వేలాది రూపాయలు వసూలు చేస్తున్న పరిస్థితి, సీపీఆర్ఎంఎస్ కార్డు లేని పెన్షనర్లకు కూడా ఉచిత వైద్య సదుపాయం కల్పించడం వంటి సమస్యలు ఉన్నాయని తెలిపారు .వైద్య ఖర్చుల పరిమితిని రూ.8 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచేందుకు రాష్ట్ర ప్రభుత్వం అంగీకరించినప్పటికీ, ఆ నిర్ణయాన్ని అమలు చేయకపోవడం, ప్రతి సంవత్సరం వైద్య ఖర్చుల కోసం రూ.25,000 అందించే విధానాన్ని అమలు చేయడం, సీపీఆర్ఎంఎస్ కార్డు పొందలేకపోయిన పెన్షనర్లకు మరోసారి అవకాశం కల్పించడం వంటి అంశాలను కూడా ఆయన ప్రస్తావించారు. ఇలాంటి కీలకమైన సమస్యలను యాజమాన్యంతో జరిగిన చర్చల్లో ప్రధానంగా ప్రస్తావించకపోవడం పట్ల పెన్షనర్లు తీవ్ర అసంతృప్తితో ఉన్నారని పులి రాజారెడ్డి తెలిపారు. పెన్షనర్లకు సంబంధించిన పై సమస్యలతో పాటు ఇతర సమస్యలను కూడా భారతీయ మజ్దూర్ సంఘ్ (బీఎంఎస్) యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు.

రాజ్యాంగ నిర్మాతపై అనుచిత వ్యాఖ్యలు తగవు!

హమారా ప్రసాద్‌పై చర్యలు తీసుకోవాలంటూ బీసీ సంఘాల ఫిర్యాదు

మంచిర్యాల, 11, సెప్టెంబర్ (ప్రజా జ్యోతి): రాజ్యాంగ నిర్మాత, భారతరత్న డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్‌పై సోషల్ మీడియాలో అనుచిత వ్యాఖ్యలు చేస్తున్న హైదరాబాద్‌కు చెందిన నాగులారపు అలియాస్ హమారా ప్రసాద్‌పై కేసు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని మంచిర్యాల జిల్లా బీసీ, బహుజన సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం మంచిర్యాల అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ ప్రకాశ్‌కు రాతపూర్వకంగా ఫిర్యాదు అందజేశారు. బీఎన్ఎస్ఎస్ సెక్షన్ ప్రకారం నిందితుడిపై కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని వారు కోరారు. 1950 కాలంలో రాజ్యాంగ రచన సాగుతున్న సమయంలోనే మనువాదులు అడ్డుకుని, మనుస్మృతే ఈ దేశపు రాజ్యాంగమని, కొత్త రాజ్యాంగం అవసరం లేదని వాదించారని వారు తెలిపారు. నాడు రాజ్యాంగాన్ని వ్యతిరేకించిన వారే నేడు రాజ్యాంగం అమలులోకి వచ్చి బీసీ, ఎస్సీ, ఎస్టీ ప్రజలకు హక్కులు దఖలు కావడంతో రాజ్యాంగ నిర్మాతలను అవమానించే విధంగా వ్యాఖ్యలు చేస్తున్నారని ఆరోపించారు. అంబేద్కర్‌పై అవాకులు చవాకులు మాట్లాడుతున్న వారు మనువాదులు విసిరే బిచ్చపు మెతుకులకు ఆశపడుతున్న కిరాయి మనుషులేనని వారు తీవ్రంగా విమర్శించారు. తెలంగాణ రాష్ట్ర హోంమంత్రిగా రేవంత్‌రెడ్డి తన బాధ్యతలను పట్టించుకోవడం లేదని ఆరోపించారు. అంబేద్కర్ రచించిన రాజ్యాంగంపై ప్రమాణం చేసి పదవులు అనుభవిస్తున్న వారు రాజ్యాంగ నిర్మాతకు అవమానం జరుగుతున్నా మౌనం వహించడం ఏమిటని ప్రశ్నించారు. జరుగుతున్న అవమానం అంబేద్కర్‌కు మాత్రమే కాదని,

దేశంలోని మెజార్టీ వర్గాలైన బీసీ, ఎస్సీ, ఎస్టీ ప్రజలను మనువాదులు అవమానిస్తున్నారని వారు పేర్కొన్నారు. భావవ్యక్తీకరణ స్వేచ్ఛ పేరుతో దివంగత నేతలను కించపరిచే హక్కు ఎవరికీ లేదని స్పష్టం చేశారు. సదరు నిందితుడిని తక్షణమే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని, భవిష్యత్తులో ఇలాంటి విపరీత ధోరణులు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో బీసీ ఐక్య వేదిక జిల్లా అధ్యక్షులు కనుకుంట్ల మల్లయ్య, సామాజిక న్యాయ వేదిక కన్వీనర్ రంగు రాజేశం, దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర నాయకులు దేవి పోచయ్య, సామాజిక ఉద్యమకారులు మోతె రామదాసు, కైలాసం, షబ్బీర్ పాషా, పాటి రాజు, బుస్స యాదగిరి, అన్నం రమేష్, సముద్రాల బుచ్చన్న, మొగిలి తిరుపతి, శ్రీమన్నారాయణ, సమ్ము రాజయ్య, ప్రేమ్ రావు తదితరులు పాల్గొన్నారు.

బిఆర్ఎస్ నాయకులు బుద్ధి మార్చుకోవాలి

మండల కన్వీనర్ గాజుల పోతున్న

సోనాల, సెప్టెంబర్ 11 (ప్రజాజ్యోతి) : సోనాల మండల కేంద్రంలో స్థానిక బస్టాండ్ చౌరస్తాలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బిఆర్ఎస్ పార్టీ అహంకారపూరిత వ్యవహారాల వల్ల బిఆర్ఎస్ పార్టీ దిష్టిబొమ్మను దహనం చేయడం జరిగింది. సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు మాట్లాడుతూ బిఆర్ఎస్ పార్టీ నాయకులు అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ గారిని తీవ్ర పదజాలంతో ద్వేషించ డం, శాసనసభ వ్యవహారాలకు విరుద్ధంగా అసెంబ్లీ ముందు నల్ల టీ షర్టు ధరించి మహిళా పోలీస్లకు అవమానపరచడం, కెసిఆర్ ఎర్రవెల్లి ఫామ్ హౌస్ రోడ్డు లో దళితులు నడిచారని రోడ్డును పసుపు నీళ్లతో శుద్ధిచేసి దళితులను అవమానించ డం దొరహంకారానికి నిదర్శనం అన్నారు. ఈ కార్యక్రమం లో సోనాల కాంగ్రెస్ పార్టీ మండల కన్వీనర్ గాజుల పోతన్న, బోథ్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ జుంగల భోజన్న, ఎస్సీ విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి భీంరావు పాటిల్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు నరోత్తం రెడ్డి, కసరే పోతున్న, మాజీ సర్పంచ్ రాందాస్ ,మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ అమృత్ రావు పాటిల్, మునేశ్వర్ చంద్రకాంత్, సోయం. రమేష్, కాదర్ల. శ్రీనివాస్, సలిగంటి శ్రీనివాస్, గాండ్ల సాయన్న, చరణ్ తదితరులు పాల్గొన్నారు.

లక్కంపూర్ (జి)లో వెదురు మొక్కల పంపిణీ

నేరడిగొండ సెప్టెంబర్ (ప్రజా జ్యోతి) : పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా కృషి చేయాలని గ్రామ సర్పంచ్ సేడమకి సుజాత గంగాధర్ మరియు పంచాయతీ కార్యదర్శి సునీల్ కుమార్ పిలుపునిచ్చారు.

బుధవారం మండలంలోని లక్కంపూర్ (జి) గ్రామంలో గ్రామ ప్రజలతో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గ్రామస్థులకు వెదురు సాగు యాజమాన్య పద్ధతులు, దాని ద్వారా కలిగే పర్యావరణ, ఆర్థిక ప్రయోజ నాలపై అవగాహన కల్పించారు. అనంతరం రైతులకు, గ్రామ ప్రజలకు ఉచితంగా వెదురు మొక్కలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ... వెదురు చెట్ల పెంపకం వల్ల వాతావరణంలో ఆక్సిజన్ స్థాయిలు పెరగడమే కాకుండా, భూసార పరిరక్షణకు ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. ప్రతి ఒక్కరూ ఈ మొక్కలను నాటి, బాధ్యతగా కాపాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, వార్డు సభ్యులు, పంచాయతీ సిబ్బంది, గ్రామ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

పర్యావరణ హితం మట్టి వినాయకుడే మనకిష్టం

బేల ప్రభుత్వ పాఠశాలలో

మట్టి విగ్రహాల తయారీపై ప్రత్యక్ష అవగాహన

అదిలాబాద్ టౌన్, సెప్టెంబర్ 11 (ప్రజాజ్యోతి) : భావిత రాలకు పచ్చని పర్యావరణాన్ని అందించాలనే సంకల్పంతో బేల మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మట్టి వినాయక విగ్రహాల తయారీపై ప్రత్యేక అవగాహన మరియు శిక్షణ కార్యక్రమాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు.

ఈ కార్యక్రమానికి ఇంగ్లీష్ ఉపాధ్యాయులు బి.వినోద్ కుమార్ (ఎస్.ఎ) నాయకత్వం వహించారు. ఆయన విద్యార్థులకు మట్టి విగ్రహాల ప్రాముఖ్యతను వివరించడమే కాకుండా, స్వయంగా మట్టితో అందమైన వినాయక విగ్రహా లను ఎలా తయారు చేయాలో క్షుణ్ణంగా నేర్పించారు. ఉపాధ్యాయుడి మార్గదర్శకత్వంలో విద్యార్థులు సైతం ఎంతో ఉత్సాహంగా పాల్గొని సొంతంగా మట్టి వినాయక ప్రతిమలను రూపొందించారు.

పిఓపి విగ్రహాలతో ముప్పు-మట్టి వినాయకుడే శ్రీరామ రక్షణ : ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యా యులు కృష్ణ కుమార్ మాట్లాడుతూ.. రాబోయే వినాయక చవితి పండుగ సందర్భంగా ప్రతి ఒక్కరూ ప్లాస్టర్ ఆఫ్ పారిస్ (పిఓపి) రసాయన రంగులతో చేసిన విగ్రహాలను పూర్తిగా పక్కన పెట్టాలని పిలుపునిచ్చారు. పిఓపి విగ్రహాలను నీటిలో నిమజ్జనం చేయడం వల్ల నదులు, చెరువులు తీవ్రంగా కలుషితమై జలచరాలు నశిస్తాయని ఆందోళన వ్యక్తం చేశారు. మట్టి విగ్రహాలు సులభంగా నీటిలో కరిగిపోయి, పర్యావరణానికి ఎలాంటి హాని కలిగించవని స్పష్టం చేశారు. పిల్లల్లో చిన్నతనం నుంచే పర్యావరణ పరిరక్షణ పట్ల బాధ్యతను పెంపొందించడమే ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశమని ప్రధానోపాధ్యాయులు తెలిపారు. విద్యార్థులంతా "మట్టి వినాయకుడు-పర్యావరణానికి రక్షణ" అనే నినాదాన్ని తమ కుటుంబ సభ్యులకు, గ్రామంలోని ప్రజలకు తెలియజేస

పెద్దచెరువు పనులకు 15 రోజుల డెడ్‌లైన్!

- పెండింగ్ పనులు పూర్తి చేయాలి.. అక్టోబర్ 1 నాటికి శిల్పారామం స్టాళ్లు అందుబాటులోకి రావాలి: కలెక్టర్ ఖుష్బూ గుప్తా

మహబూబ్‌నగర్, సెప్టెంబర్ 11 (ప్రజా జ్యోతి బ్యూరో): మహబూబ్‌నగర్ పెద్దచెరువు మినీ ట్యాంక్‌బండ్ అభివృద్ధి పనుల్లో మిగిలిన పనులను మరో 15 రోజుల్లోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా అధికారులను ఆదేశించారు. అభివృద్ధి పనుల్లో జాప్యానికి తావులేకుండా నిర్ణీత గడువులో పనులను పూర్తి చేయాలని స్పష్టం చేశారు. శుక్రవారం పెద్దచెరువు మినీ ట్యాంక్‌బండ్‌తో పాటు పక్కనే ఉన్న శిల్పారామాన్ని కలెక్టర్ సందర్శించి అక్కడ కొనసాగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. పెద్దచెరువులో చేపట్టిన పనుల పురోగతిని సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఇరిగేషన్ శాఖ, మున్సిపల్ అర్బన్ డెవలప్‌మెంట్ విభాగం ఆధ్వర్యంలో చేపట్టాల్సిన పెండింగ్ పనుల వివరాలను పరిశీలించిన కలెక్టర్.. ఇప్పటికే

పూర్తయిన పనులను కూడా పరిశీలించారు. అవసరమైన ప్రాంతాల్లో మార్పులు, అదనపు అభివృద్ధి పనులు చేపట్టాలని సూచించారు. మిగిలిన అన్ని పనులను 15 రోజుల్లోగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

అక్టోబర్ 1 నుంచి శిల్పారామం కళకళలాడాలి :

అనంతరం శిల్పారామాన్ని సందర్శించిన కలెక్టర్ అక్కడ ఏర్పాటు చేసిన స్టాళ్లను పరిశీలించారు. స్టాళ్లను ఎవరెవరికి కేటాయించారు, ప్రస్తుతం వాటి పరిస్థితి ఏమిటనే వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. కేటాయించిన స్టాళ్లను త్వరితగతిన ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించిన కలెక్టర్, అక్టోబర్ 1వ తేదీ నుంచి శిల్పారామంలోని అన్ని స్టాళ్లు పూర్తిస్థాయిలో కార్యకలాపాలు నిర్వహించేలా అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులకు స్పష్టం చేశారు. పెద్దచెరువు ట్యాంక్‌బండ్ అభివృద్ధి పనులు, శిల్పారామం కార్యకలాపాలు పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తే ఈ ప్రాంతం ప్రజలకు మరింత ఆకర్షణీయంగా మారడంతో పాటు పర్యాటక, వినోద వాతావరణానికి ఊతమిచ్చే అవకాశం ఉంది. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ అండర్ ట్రైనీ సాయి శివాని, మున్సిపల్ కమిషనర్ రామానుజుల రెడ్డి, ఇరిగేషన్ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

నేడు వైభవంగా శ్రీ బండ తిరుమలయ్య స్వామి ఆలయ సంప్రోక్షణ పూజ

-మంత్రి సోదరుడు వాకిటి శేషగిరి సహకారంతో ఆలయ పునర్నిర్మానం

మఖ్తల్ నియోజకవర్గ ప్రతినిధి, సెప్టెంబర్ 11 (ప్రజా జ్యోతి): నారాయణపేట జిల్లా మఖ్తల్ పట్టణంలోని ఖానాపురం రోడ్డు తిరుమలయ్య చెరువు సమీపంలో కొలువైన అతి పురాతనమైన సంతాన,వివాహ కారకుడైన భక్తుల కొంగుబంగారంగా పేరొందిన స్వయంభూ శ్రీ బండ తిరుమలయ్య స్వామి దివ్య క్షేత్రంలో

దేవాలయంలో ఆలయ సంప్రోక్షణ పూజ, హోమం జరుగును. అతి పురాతనమైన శ్రీ బండ తిరుమలయ్య స్వామి ఆలయం అత్యంత శిథిలావస్థకు చేరిన విషయాన్ని మంత్రి వాకిటి శ్రీహరి సోదరుడు వాకిటి శేషగిరి దృష్టికి తీసుకు వెళ్లడంతో సానుకూలంగా స్పందించిన మంత్రి సోదరుడు అతి తక్కువ సమయంలో విశేష సహాయ సహకారాలతో పునర్నిర్మాణం జరిగిన శుభ సందర్భంగా ఈరోజు ఉదయం ఏడు గంటలకు శ్రీ బండ తిరుమలయ్య స్వామివారి దేవాలయంలో ఆలయ సంప్రోక్షణ పూజ, స్వామివారికి ప్రత్యేక అభిషేకం, హోమం అన్నదాన కార్యక్రమాలు వైభవంగా నిర్వహించడం జరుగుతుందని, ఈ కార్యక్రమంలో భక్తులందరూ పాల్గొని స్వామివారి విశేష అనుగ్రహానికి పాత్రులు కావాలని ఉడుపి పేజావర మఠం తెలంగాణ & ఆంధ్రప్రదేశ్ ధర్మ ప్రచార కార్యదర్శి విద్వాన్ కె.రాఘవేంద్ర చార్యులు తెలిపారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు ఘన సన్మానం

రేవల్లి, సెప్టెంబర్ 11 (ప్రజాజ్యోతి): మండల స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన కేశంపేట యూపీఎస్ ఉపాధ్యాయులు ఎస్.కృష్ణయ్య, పి.శ్రీశైలంను గ్రామ సర్పంచ్ బాదేపల్లి రేవతి సురేష్‌గౌడ్ ఘనంగా సన్మానించారు. కేశంపేట యూపీఎస్ పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో ఉపాధ్యాయులకు శాలువాలు కప్పి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచ్ రేవతి మాట్లాడుతూ.. విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమన్నారు. మండల స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపిక కావడం కేశంపేట పాఠశాలకు, గ్రామానికి గర్వకారణమన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు యు.వెంకటేష్, ఉపాధ్యాయులు, వార్డు సభ్యుడు బి.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

భక్తులతో కిక్కిరిసిన పెద్ద చింతరేవుల ఆంజనేయస్వామి ఆలయం

చాతుర్మాస దీక్షలో ఉడిపి పలిమారు పీఠాధిపతులు.. 10 వేల మందికి అన్నప్రసాద పంపిణీ

గద్వాల సెప్టెంబర్ 11(ప్రజా జ్యోతి ప్రతినిధి): గద్వాల జిల్లా ధరూర్ మండలం పెద్ద చింతరేవుల

శ్రీ ఆంజనేయస్వామి దేవాలయం శ్రావణ అమావాస్య సందర్భంగా శుక్రవారం వేలాది మంది భక్తులతో కిక్కిరిసింది.తెలంగాణ,కర్ణాటక,ఆంధ్రప్రదేశ్ తదితర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ పరిసరాలు భక్తుల సందడితో పండుగ వాతావరణాన్ని తలపించాయి.భక్తులు క్యూ పద్ధతిలో స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.ఆలయ ఈవో రాజేశ్వర శర్మ, ప్రధాన అర్చకులు ఆద్య చక్రవర్తి కేశవాచార్యుల ఆధ్వర్యంలో భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. పలువురు భక్తులు స్వామివారికి దాసంగం ప్రసాదాన్ని సమర్పించగా,వాహనాలకు ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు.

ఉడిపి పలిమారు పీఠాధిపతుల ప్రత్యేక పూజలు:

పెద్ద చింతరేవుల శ్రీ ఆంజనేయస్వామి ఆలయ ప్రాంగణంలో ఉడిపి పలిమారు పీఠాధిపతులు 1008 శ్రీ విద్యాధీశ తీర్థ శ్రీపాదుల వారు,శ్రీ 1008 విద్యారాజేశ్వర తీర్థ శ్రీపాదుల ఆధ్వర్యంలో మూలరాముల సంస్థాన పూజ నిర్వహించి దశవిధ హారతులు సమర్పించారు.అనంతరం శ్రీ ఆంజనేయస్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా పీఠాధిపతులు భాగవతం,రామాయణ ప్రవచనాలు నిర్వహించి భక్తులకు మంత్రాక్షతలు,తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు.తమ చాతుర్మాస్య దీక్షలు ఈ నెల 25వ తేదీ వరకు కొనసాగుతాయని తెలిపారు.

10 వేల మందికి అన్నప్రసాదం:

శ్రావణ అమావాస్య సందర్భంగా పెద్ద చింతరేవుల శ్రీ ఆంజనేయ అన్నదాన ట్రస్ట్ ఆధ్వర్యంలో సుమారు 10 వేల మంది భక్తులకు అన్నప్రసాదాన్ని పంపిణీ చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు.ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ గిరిరావు,అర్చకులు ఆద్య వామనాచారి,ఆద్య కిష్టాచారి, ఆద్య మద్వాచారి తదితరులతో పాటు వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమిలో అక్రమ డబ్బాలను తొలగించండి

–చట్టం కొందరికి చుట్టమా కోర్టుఆర్డర్ ను ఎందుకు అధికారులు అమలు చేయడం లేదు

–మాజీ ఎమ్మెల్యే చిట్టెం రాంమోహన్ రెడ్డి

మఖ్తల్ నియోజకవర్గ ప్రతినిధి, సెప్టెంబర్ 11 (ప్రజా జ్యోతి): మఖ్తల్ మున్సిపాలిటీ కేంద్రంలో ప్రభుత్వ భూమి సర్వే నెంబరు 7లో బోగస్ సర్టిఫికెట్స్ సృష్టించుకుని కోట్ల విలువ చేసే భూమిలో అక్రమంగా డబ్బాలను వేసిన రెవెన్యూ మున్సిపల్ కమిషనర్ అధికారులు ఎందుకు ఆక్రమ డబ్బాలను తొలగించడం లేదో వెనుకడుగు వేయడం జరుగుతుందో సమాధానం చెప్పాల్సిన అవసరం ఉందన్నారు. కోట్ల విలువచేసే ప్రభుత్వ స్థలంలో ఇప్పటి వరకు అధికారికంగా ఇచ్చిన సర్టిఫికెట్లను సమగ్రంగా పరిశీలించి బోగస్ సర్టిఫికెట్స్ ఏవి ఉన్నవో వాటిపైన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆయన సూచించారు. సర్వే నెంబర్ 7

స్పష్టం చేయాలని మాజీ ఎమ్మెల్యే చిట్టెం రాంమోహన్ రెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం మాజీ ఎమ్మెల్యే నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరు సమావేశంలో ఆయన మాట్లాడుతూ 15 రోజుల కిందట సర్వే నెంబర్ 7 లో ఎలాంటి అనుమతులు లేకుండా బోగస్ సర్టిఫికెట్లులతో వేసిన డబ్బాలను తొలగించిన అధికారులు మిగతా డబ్బాల విషయంలో ఎందుకు వెనుకడుగు వేస్తున్నారు రెవిన్యూ అధికారులు సమాధానం చెప్పాలన్నారు. ఈ వ్యవహారం పరిశీలిస్తే చట్టము కొందరికి చుట్టంగా మారిందని చెప్పక తప్పడం లేదన్నారు. రాష్ట్ర న్యాయస్థానం సైతము సర్వే నెంబర్ లో 7 లో వేసిన అక్రమ డబ్బాలను తొలగించాలని 2003లో అప్పటి తాసిల్దారు ఇచ్చిన భోగస్ సర్టిఫికెట్లను ఏవి చెల్లవని ఆర్డర్ నెంబర్ 1606/2013 ఇచ్చినప్పటికీ రెవెన్యూ అధికారులు ఆ డబ్బాలను తొలగించడంలో ఎందుకు అలసత్యం వహిస్తున్నారో సమాధానం చెప్పకుండా కాలయాపన చేయడం వెనుక ఏ రాజకీయ పార్టీ నాయకుల వోత్తిడి ఉందో వెల్లడించాలని ఆయన డిమాండ్ చేశారు. ఒకవైపు జిల్లా కలెక్టర్ మరోవైపు ఆర్డీవో అక్రమంగా వేసిన డబ్బాలను వెంటనే తొలగించాలని ఆదేశాలు జారీ చేసిన ఎందుకు లో ప్రభుత్వము వాస్తవంగా ఇచ్చిన సర్టిఫికెట్లు స్థలము విస్తీర్ణ పై నా విచారణ జరపాల్సిన అవసరం ఉంది అన్నారు. కొందరు సర్టిఫికెట్ లో 100 గజాలు ఉంటే దాదాపు 200,300, 400 గజాల స్థలాన్ని ఆక్రమించుకొని నిర్మాణాలు చేసుకోవడం జరిగిందని వీటి పైన సైతం చర్యలు తీసుకోవాల్సిందిగా ఆయన డిమాండ్ చేశారు సర్వే 7 లో ఎంత మందికి వాస్తవంగా సర్టిఫికెట్లు ఇవ్వడం జరిగిందో ఎవరివి బోగస్సో వాటిని స్థానిక తాసిల్దారు బహిరంగం చేయాల్సిందిగా ఆయన కోరారు. ఇప్పటికైనా ఆ సర్వే నెంబర్లు వేసిన అక్రమ డబ్బాలను మరియు అక్రమ నిర్మాణాలను వెంటనే తొలగించకపోతే తమ పార్టీ పరంగా స్థానిక తహసిల్దార్ కార్యాలయం ముందు పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని ఆయన స్పష్టం చేశారు. ఈ సమావేశంలో మాజీ మార్కెట్ చైర్మన్ లు కొత్త శ్రీనివాస్ గుప్తా,పి.నరసింహ గౌడ్,మండల పార్టీ మాజీ అధ్యక్షుడు మహిపాల్ రెడ్డి, పట్టణ పార్టీ మాజీ అధ్యక్షుడు చిన్న హనుమంతు,అన్వర్ హుస్సేన్,జుట్ల శంకర్,మన్నన్,జుట్ల సాగర్,శివారెడ్డి,సాదిక్, బండారి ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

వినాయక నిమజ్జనానికి పకడ్బందీ ఏర్పాట్లు

– చెరువులు, బేబీ పాండ్లను పరిశీలించిన కలెక్టర్ ఖుష్బూ గుప్తా, ఎస్పీ జానకి

మహబూబ్‌నగర్, సెప్టెంబర్ 11(ప్రజా జ్యోతి బ్యూరో): వినాయక చవితి ఉత్సవాల సందర్భంగా నిర్వహించనున్న విగ్రహాల నిమజ్జన కార్యక్రమం ప్రశాంతంగా, సురక్షితంగా జరిగేలా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా, జిల్లా ఎస్పీ దరావత్ జానకి అధికారులను ఆదేశించారు. జిల్లాలో వర్షాభావ పరిస్థితుల కారణంగా పలు నిమజ్జన కేంద్రాల వివరాలను ప్రజలకు ముందుగానే తెలియజేయాలి అని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. మీడియా, సోషల్ మీడియా ద్వారా విస్తృత ప్రచారం నిర్వహించి ప్రజలు తమ సమీపంలోని నిర్దేశిత కేంద్రాల్లోనే విగ్రహాలను నిమజ్జనం చేసేలా అవగాహన కల్పించాలని సూచించారు. మరోవైపు పెద్ద విగ్రహాల నిమజ్జనానికి అవసరమైన నీటి లభ్యతను పరిశీలించి, అవసరమైతే

చెరువులు, నీటి వనరుల్లో నీటి లభ్యత తక్కువగా ఉండటంతో చిన్న, మధ్య తరహా విగ్రహాల నిమజ్జనం కోసం ఏర్పాటు చేస్తున్న కృత్రిమ బేబీ పాండ్లను, పెద్ద విగ్రహాల నిమజ్జనానికి అనువైన చెరువులను కలెక్టర్, ఎస్పీ శుక్రవారం సంయుక్తంగా పరిశీలించారు. క్రిస్టియన్‌పల్లి పంచవటి పాఠశాల సమీపంలోని కృత్రిమ బేబీ పాండ్‌తో పాటు పాలకొండ, శ్రీనివాస్ కాలనీ, అప్పన్నపల్లి, చిన్నదర్పల్లి చెరువులను వారు పరిశీలించారు. నిమజ్జన ఏర్పాట్లపై మున్సిపల్, రెవెన్యూ, పోలీసు అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అప్పన్నపల్లి చెరువు వద్ద పెద్ద సంఖ్యలో విగ్రహాలు వచ్చే అవకాశం ఉన్నందున రెండు పెద్ద బేబీ పాండ్లను నిర్మించాలని కలెక్టర్ ఆదేశించారు. నిమజ్జన కేంద్రాల వద్ద విద్యుత్ దీపాలు, బారికేడ్లు, తాగునీరు, పారిశుద్ధ్య సౌకర్యాలు, ప్రవేశ–నిష్క్రమణ మార్గాలు, పార్కింగ్ తదితర మౌలిక వసతులను ముందుగానే సిద్ధం చేయాలని కలెక్టర్ సూచించారు. నిమజ్జనం అనంతరం విగ్రహాల అవశేషాలు, పూజా సామగ్రి, ప్లాస్టిక్ తదితర వ్యర్థాలను వెంటనే తొలగించి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. బేబీ పాండ్ల వద్ద నిరంతరం పారిశుద్ధ్య సిబ్బందిని అందుబాటులో ఉంచడంతో పాటు నీటి నాణ్యతను పర్యవేక్షించాలని సూచించారు. నిమజ్జనం పూర్తయిన అనంతరం పాండ్లను శుభ్రపరిచి, అవసరమైన మేరకు నీటిని తొలగించి ప్రాంతాలను యథావిధిగా పునరుద్ధరించాలని తెలిపారు. ప్రత్యామ్నాయ ప్రాంతాలను గుర్తించాలని కలెక్టర్ సూచించారు. మహబూబ్‌నగర్ జిల్లా నుంచి వచ్చే పెద్ద విగ్రహాల నిమజ్జనానికి బీచుపల్లి వద్ద అవసరమైన ఏర్పాట్లు చేయాలని గద్వాల జిల్లా కలెక్టర్‌ను కోరినట్లు తెలిపారు. దీనిపై గద్వాల జిల్లా కలెక్టర్ సానుకూలంగా స్పందించినట్లు వెల్లడించారు. నిమజ్జన సమయంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసు బందోబస్తును పటిష్టం చేయాలని ఎస్పీ డి.జానకి ఆదేశించారు. ట్రాఫిక్ నియంత్రణ, వాహనాల రాకపోకలు, ప్రజల భద్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. విగ్రహాలను తీసుకువచ్చే వాహనాలకు అనుకూలంగా ప్రవేశ మార్గాలు, పార్కింగ్ ప్రాంతాలు, నిమజ్జనం అనంతరం తిరుగు మార్గాలను ముందుగానే సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు.

అనంతరం పాతపల్లి పెద్ద చెరువు మినీ ట్యాంక్‌బండ్, దాని పక్కనే ఉన్న శిల్పారామాన్ని కలెక్టర్, ఎస్పీ సందర్శించారు. పెద్ద చెరువులో జరుగుతున్న పనుల పురోగతిని, శిల్పారామంలోని స్టాళ్ల కేటాయింపుల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ అండర్ ట్రైనీ సాయి శివాని, డిప్యూటీ మేయర్ సురేందర్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ రామానుజుల రెడ్డి, డీఆర్‌డీఓ నరసింహులు, జిల్లా వీఎచ్‌పీ అధ్యక్షులు యాది రెడ్డి, గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

గణపతి ఆగమనంలో ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు:ట్రాఫిక్ ఎస్సై బాలచంద్రుడు

గద్వాల సెప్టెంబర్ 11(ప్రజా జ్యోతి ప్రతినిధి): వినాయక చవితి ఉత్సవాల సందర్భంగా గద్వాల పట్టణంలో 'గణపతి ఆగమనం' పేరుతో విగ్రహాలను తరలించే సమయంలో సాధారణ ప్రజలకు,వాహనదారులకు ట్రాఫిక్ ఇబ్బందులు కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ట్రాఫిక్ ఎస్సై బాలచంద్రుడు హెచ్చరించారు.ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో, ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని,ప్రజా భద్రత,శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా వ్యవహరించరాదని సూచించారు.ఈ మేరకు శుక్రవారం ట్రాఫిక్ పోలీస్ కార్యాలయం నుంచి ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు.విగ్రహాల తరలింపు సమయంలో రహదారులను పూర్తిగా దిగ్బంధించడం,వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగించడం చేయరాదన్నారు.ముఖ్యంగా

అంబేద్కర్ చౌక్,కృష్ణవేణి చౌక్, సుంకులమ్మ మెట్టు,మెయిన్ రోడ్,నల్లకుంట–రాజీవ్ మార్గ్,బస్టాండ్ రోడ్డు ప్రాంతాల్లో విగ్రహాల వాహనాలను నిలిపి డ్యాన్సులు చేస్తూ ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

డీజేలపై ఆంక్షలు:

విగ్రహాల ఆగమనం,నిమజ్జనం సందర్భంగా అధిక శబ్దంతో డీజేలు,సౌండ్ వాల్స్ వినియోగించరాదన్నారు. రోగులు,వృద్ధులు, విద్యార్థులకు ఇబ్బంది కలగకుండా నిర్ణీత శబ్ద పరిమితులను తప్పనిసరిగా పాటించాలని సూచించారు.

మండపాలకు ముందస్తు అనుమతులు:

రహదారుల వెడల్పును తగ్గించేలా,వాహనాల రాకపోకలకు

ఆటంకం కలిగించే విధంగా ఇష్టానుసారంగా మండపాలు ఏర్పాటు చేయరాదన్నారు.మండపాల ఏర్పాటుకు ముందస్తుగా తెలంగాణ పోలీస్ పోర్టల్ వంటి అధికారిక మార్గాల ద్వారా అనుమతులు పొందాలని సూచించారు.

డ్రంక్ అండ్ డ్రైవ్‌పై కఠిన చర్యలు:

విగ్రహాల ఊరేగింపుల్లో పాల్గొనే వారు మద్యం సేవించి వాహనాలు నడపడం,హంగామా చేయడం వంటివి చేస్తే డ్రంక్ అండ్ డ్రైవ్ కింద కఠిన కేసులు నమోదు చేస్తామని స్పష్టం చేశారు.

భద్రతకు ప్రాధాన్యం:

విగ్రహాలు విద్యుత్ వైర్లకు తగలకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని,మండపాల వద్ద సీసీటీవీ కెమెరాలు,అగ్నిమాపక పరికరాలు ఏర్పాటు చేసుకోవాలని ఎస్సై సూచించారు.నిబంధనలు ఉల్లంఘించే వారిపై మోటారు వాహనాల చట్టం (ఎంవీ యాక్ట్)తో పాటు ఇతర శాంతిభద్రతల చట్టాల కింద కేసులు నమోదు చేసి,భారీ జరిమానాలతో పాటు చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు."పండుగను భక్తిశ్రద్ధలతో జరుపుకోండి..ప్రజలకు ఇబ్బంది కలిగించవద్దు. ముఖ్యంగా 108, అంబులెన్స్ వంటి అత్యవసర వాహనాలకు ఎలాంటి ఆటంకం లేకుండా దారి ఇవ్వాలి.ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమిస్తే జరిమానాలు,కేసులు తప్పవు" అని ట్రాఫిక్ ఎస్సై బాలచంద్రుడు పేర్కొన్నారు.ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించే వారిపై ప్రజలు 112 నంబర్‌కు లేదా గద్వాల ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని ఆయన కోరారు.

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు కంటి పరీక్షలు

సెప్టెంబర్ 15 నుంచి 6-10 తరగతుల విద్యార్థులకు స్క్రీనింగ్

మహబూబ్‌నగర్, సెప్టెంబర్ 11 (ప్రజా జ్యోతి బ్యూరో): జిల్లాలోని ప్రభుత్వ, ప్రభుత్వ ఎయిడెడ్ పాఠశాలల్లో 6 నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులందరికీ ఈ నెల 15వ తేదీ నుంచి కంటి పరీక్షలు నిర్వహించనున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా. ఏ. శ్రీనివాసులు తెలిపారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి ఛాంబర్‌లో శుక్రవారం పారామెడికల్ ఆప్తాలమిక్ అధికారులు, రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమం వైద్యులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన కార్యక్రమంపై అధికారులకు దిశానిర్దేశం చేశారు.

విద్యార్థులందరికీ కంటి పరీక్షలు సమగ్రంగా నిర్వహించి, దృష్టి లోపాలు గుర్తించిన వారికి అవసరమైన కంటి అద్దాలు, చికిత్స, రిఫరల్ సేవలు అందించాలని ఆదేశించారు. ఏ విద్యార్థి కూడా కంటి సమస్యతో ఇబ్బంది పడకుండా అవసరమైన వైద్య సేవలను అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. కంటి పరీక్షల కార్యక్రమం జిల్లాలో నిర్దేశిత ప్రణాళిక ప్రకారం సమర్థవంతంగా జరిగేలా సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేయాలని డీఎంహెచ్ఓ సూచించారు. ప్రతిరోజూ నిర్వహించిన పరీక్షలు, గుర్తించిన దృష్టి లోపాలు, అందించిన సేవల వివరాలతో రోజువారీ ప్రగతి నివేదికలు సమర్పించాలని ఆదేశించారు. పాఠశాల స్థాయిలోనే విద్యార్థుల కంటి సమస్యలను గుర్తించి సకాలంలో చికిత్స అందించడం ద్వారా వారి చదువుపై దృష్టి లోపాల ప్రభావాన్ని తగ్గించవచ్చని అధికారులు తెలిపారు. సమీక్ష సమావేశంలో డిప్యూటీ డీఎంహెచ్ఓ డా. శశికాంత్, జిల్లా అంధత్వ నియంత్రణ అధికారి డా. సునీత, డా. శైలజ, ఆర్‌బీఎస్‌కే వైద్యులు, పారామెడికల్ ఆప్తాలమిక్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఝాన్సీ రెడ్డికి ఘన స్వాగతం పలికిన కాంగ్రెస్ శ్రేణులు

- విదేశీ పర్యటన విజయవంతం
- ప్రజా సేవే లక్ష్యమన్న టీపీసీసీ ఉపాధ్యక్షురాలు ఝాన్సీ రెడ్డి

దేవరుప్పుల, సెప్టెంబరు 11 (ప్రజాజ్యోతి): అమెరికా పర్యటనను విజయవంతంగా ముగించుకుని స్వదేశానికి చేరుకున్న తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ ఉపాధ్యక్షురాలు, వెటా ఇండియా, హెచ్‌జీఆర్ ట్రస్ట్ వ్యవస్థాపకురాలు హనుమాండ్ల ఝాన్సీ రాజేందర్ రెడ్డికి శుక్రవారం శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో పాలకుర్తి నియోజకవర్గ, దేవరుప్పుల మండల కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఝాన్సీ రెడ్డి మాట్లాడుతూ ప్రవాస భారతీయులు చూపిన ప్రేమాభిమానాలు మరువలేనివన్నారు. ప్రవాసుల సహకారంతో రాష్ట్రంలో మహిళా సాధికారత, విద్య, యువతకు ఉపాధి, వైద్య సేవలను మరింత విస్తృతం చేస్తామన్నారు. ప్రజా సేవే తన లక్ష్యమని, ప్రజల కోసం అంకితభావంతో పనిచేస్తానని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు దావెర అనిల్ కుమార్, బీసీ, ఎస్సీ, ఎస్టీ విభాగ అధ్యక్షులు కాశబోయిన గణేష్, ఇనుముల నాగరాజు, భూక్య సజ్జన్, యువజన అధ్యక్షుడు పులిగిల్ల వెంకన్న యాదవ్, సీనియర్ నాయకులు తోటకూరి పాండుకృష్ణ, రుద్రోజు భాస్కరాచారి, రెడ్డిరాజుల రమేష్, భాస్కర్ నాయక్, మహేందర్, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

హోంమంత్రిగా సీఎం రేవంత్ రెడ్డి విఫలం

- ముందస్తు అరెస్టులు అప్రజాస్వామికం
- బీఆర్ఎస్వీ మండల అధ్యక్షుడు మధు

దేవరుప్పుల, సెప్టెంబరు 11 (ప్రజాజ్యోతి): రాష్ట్రంలో విద్యార్థి సంఘాలు ఎలాంటి ఆందోళనలకు పిలుపునివ్వకపోయినా నిఘా వైఫల్యంతో భారత రాష్ట్ర సమితి విద్యార్థి విభాగం నాయకులను ముందస్తుగా అరెస్టు చేయడం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పిరికిపంద చర్యకు నిదర్శనమని భారత రాష్ట్ర సమితి విద్యార్థి విభాగం మండల అధ్యక్షుడు పందెనబోయిన మధు ముదిరాజ్ మండిపడ్డారు. శుక్రవారం పందెనబోయిన మధును పోలీసులు ముందస్తుగా అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హోం, విద్యా శాఖల బాధ్యతలు చూస్తున్న ముఖ్యమంత్రి ఆ రెండు స్థానాల్లో పూర్తిగా విఫలమయ్యారని విమర్శించారు. నిరుద్యోగుల ఓట్లతో గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాదిలోగా రెండు లక్షల ఉద్యోగాలు, నెలకు నాలుగు వేల రూపాయల నిరుద్యోగ భృతి, ఐదు లక్షల రూపాయల విద్యా భరోసా కార్డు, విద్యార్థినులకు స్కూటీలు వంటి హామీలను గాలికొదిలేసిందని దుయ్యబట్టారు. పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని విద్యార్థులు ఆందోళన చేస్తున్నా విద్యా శాఖ మంత్రిగా ఉన్న ముఖ్యమంత్రి కనీసం పట్టించుకోవడం లేదన్నారు. యువ వికాసం పేరిట విద్యార్థులను మోసం చేయడం మానుకుని తక్షణమే ఎన్నికల హామీలను నెరవేర్చాలని ఆయన డిమాండ్ చేశారు.

ఆరు గ్యారంటీలు కాదు.. అవి ఆరు అబద్ధాలు!

- ప్రశ్నిస్తే అక్రమ అరెస్టులు, కేసులు
- కక్ష సాధింపు రాజకీయాలపై బీఆర్ఎస్ నేత పల్లా ఫైర్

దేవరుప్పుల, సెప్టెంబరు 11 (ప్రజాజ్యోతి) : ఆరు గ్యారంటీల పేరిట అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం వాటిని ఆరు అబద్ధాలుగా మార్చి ప్రజలను దారుణంగా వంచిస్తోందని బీఆర్ఎస్ జిల్లా నాయకులు పల్లా సుందర్ రాంరెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ మహాలక్ష్మి పథకం కింద మహిళలకు నెలకు రెండు వేల ఐదు వందల రూపాయలు, రైతు భరోసా కింద ఎకరాకు పదిహేను వేల రూపాయలు, వరికి ఐదు వందల రూపాయల బోనస్, గృహజ్యోతిలో రెండు వందల యూనిట్ల ఉచిత విద్యుత్, యువ వికాసంలో ఐదు లక్షల రూపాయల విద్యా భరోసా, చేయూత కింద నాలుగు వేల రూపాయల పింఛను హామీలు ఏమయ్యాయని ఆయన నిలదీశారు. ప్రజా సమస్యలను గాలికొదిలేసిన ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చాలని ప్రశ్నిస్తే అక్రమ అరెస్టులకు దిగుతోందని మండిపడ్డారు. బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలే లక్ష్యంగా అక్రమ కేసులు బనాయిస్తూ కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. అభివృద్ధిని గాలికి వదిలేసి పోలీసులతో ప్రతిపక్షాల గొంతు నొక్కాలని చూస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి త్వరలోనే ప్రజలు తగిన బుద్ధి చెబుతారని సుందర్ రాంరెడ్డి హెచ్చరించారు.

సంపూర్ణ ఆరోగ్యానికి సమతుల్య ఆహారమే కీలకం

- ఐసీడీఎస్ సూపర్‌వైజర్స్ సావిత్రి, శ్రీదేవి
- దేవరుప్పుల, చిన్నమాడూర్ లో ఘనంగా పోషణ్ మాసం కార్యక్రమం

దేవరుప్పుల సెప్టెంబరు 11(ప్రజాజ్యోతి): మహిళల్లో రక్తహీనత నివారణకు, సంపూర్ణ ఆరోగ్యానికి సమతుల్య ఆహారం ఎంతో అవసరమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్స్ సావిత్రి, శ్రీదేవి అన్నారు. శుక్రవారం దేవరుప్పుల, చిన్నమాడూర్ గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాల,జూనియర్ కళాశాల విద్యార్థులు, మహిళలకు పోషకాహారంపై అవగాహన కల్పించారు. మునగాకు, కరివేపాకు, పాలకూరతో పాటు తాజా కూరగాయలు,పండ్లు తీసుకోవాలని సూచించారు. పల్లీలు, బెల్లం,నువ్వుల పట్టీలు వంటి ఐరన్ అధికంగా ఉండే ఆహారాన్ని తీసుకోవాలని తెలిపారు. గర్భిణులు, బాలింతలు పోషకాహారంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. కార్యక్రమంలో చిన్నమడూర్ సర్పంచ్ జోగేశ్వర్ ఎంఈఓ శ్రీనివాస్ హెచ్ఎం కళావతి దేవరుప్పుల ఉప సర్పంచ్ కోమలత, అధ్యాపకులు,విద్యార్థులు, గర్భిణులు,బాలింతలు, అంగన్వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

సన్న రకం వరి బోనస్ పొందడానికి రైతులు తమ వివరాలను 17 లోపు నమోదు చేసుకోవాలి

మండల వ్యవసాయ అధికారి కె.శ్రీనివాస్ రెడ్డి

కొడకండ్ల, సెప్టెంబర్ 11 (ప్రజాజ్యోతి) : ప్రభుత్వం అందిస్తున్న సన్న రకం వరి బోనస్ ప్రయోజనం పొందడానికి కొడకండ్ల మండలంలోని రైతులందరూ తమ రైతు వివరాలు, విత్తనం వివరాలను ఈ నెల 17 లోపు తప్పనిసరిగా నమోదు చేయించుకోవాలని కొడకండ్ల మండల వ్యవసాయ అధికారి కె. శ్రీనివాస్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ?ప్రభుత్వం ప్రోత్సహిస్తున్న 7 రకాల ప్రాధాన్యత కలిగిన సన్న రకం వరి సాగు చేస్తున్న రైతులు తమ వివరాలను నమోదు చేసుకోవాలని తెలిపారు. డీలర్ వద్ద విత్తనాలు కొనుగోలు చేసిన ప్రతి రైతు, విత్తనం కొనుగోలు వివరాలను తప్పనిసరిగా సంబంధిత డీలర్ ద్వారానే నమోదు చేయించుకోవాలని, డీలర్ వద్ద వివరాలు నమోదు కాకపోతే బోనస్ ప్రయోజనం పొందడంలో ఇబ్బందులు ఎదురవుతాయని, ?తమ సొంత విత్తనాలు, ఇతర రైతుల వద్ద నుండి విత్తనాలు తీసుకున్న వారు వెంటనే సంబంధిత వ్యవసాయ విస్తరణ అధికారిని సంప్రదించి రైతు డిక్లరేషన్ ఫారమ్‌ను తప్పనిసరిగా సమర్పించాలని తెలిపారు. బోనస్ పొందడానికి ఇప్పటివరకు వివరాలు నమోదు చేసుకోని రైతులు వెంటనే తమ పరిధిలోని ఏ ఈ ఓ లేదా వ్యవసాయ అధికారిని సంప్రదించి, నిర్ణీత గడువులోగా వివర నమోదు ప్రక్రియను పూర్తి చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి కె.శ్రీనివాస్ రెడ్డి కోరారు.

హనుమకొండ జిల్లా 'తాపస్' ప్రధాన కార్యదర్శిగా మూల 'రామకృష్ణ గౌడ్' ఏకగ్రీవ ఎన్నిక

హనుమకొండ, సెప్టెంబర్ 11 (ప్రజాజ్యోతి) : తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (తాపస్) హనుమకొండ జిల్లా నూతన కమిటీ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా మూల రామకృష్ణ గౌడ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఎన్నికల పరిశీలకులుగా రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ మునిగుంట్ల శ్రీనివాస్ వ్యవహరించారు. రాష్ట్ర బాధ్యులు సుధాకర్ బత్తిని, వెంకటరమణ, జిల్లా అధ్యక్షుడు బత్తిని వీరస్వామి గౌడ్, కోశాధికారి బాబురావు, జనగామ జిల్లా ప్రధాన కార్యదర్శి అంకం సతీష్ తదితరుల సమక్షంలో హనుమకొండ జిల్లాలోని వివిధ మండలాల అధ్యక్ష, కార్యదర్శులు, సంఘం కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మూల రామకృష్ణ గౌడ్‌ను జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం సమావేశాన్ని ఉద్దేశించి మూల రామకృష్ణ గౌడ్ మాట్లాడుతూ.. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి సంఘం తరఫున నిరంతరం కృషి చేస్తానన్నారు. ఉపాధ్యాయుల హక్కులు, సంక్షేమం కోసం ఐక్యంగా పనిచేస్తామని, విద్యారంగ అభివృద్ధికి తమ వంతు సహకారం అందిస్తామని తెలిపారు. తనపై నమ్మకం ఉంచి జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఎన్నుకున్న సంఘం నాయకులు, ఉపాధ్యాయులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా పలువురు సంఘం నాయకులు, ఉపాధ్యాయులు మూల రామకృష్ణ గౌడ్‌కు శుభాకాంక్షలు తెలిపారు. సమావేశంలో వివిధ మండలాల సంఘం ప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

హియరింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలి

- ఓటర్లు సమర్పించిన ధ్రువీకరణ పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించాలి
- జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

జనగామ జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 11 (ప్రజాజ్యోతి) : ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ--2026 ప్రక్రియలో మ్యాపింగ్ కాని, అనామలీస్ జాబితాలో ఉన్న ఓటర్లకు జారీ చేసిన నోటీసులకు సంబంధించి హియరింగ్‌కు హాజరైన ఓటర్లు సమర్పిస్తున్న ధ్రువీకరణ పత్రాల పరిశీలన ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అధికారులను ఆదేశించారు. శుక్రవారం, జిల్లాలోని దేవరుప్పుల మండలంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో జరుగుతున్న ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియను జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా పరిశీలించారు. నోటీసుల జారీ, ఓటర్ల హియరింగ్, ఫారాల స్వీకరణ, అప్‌లోడింగ్ ప్రక్రియలను పర్యవేక్షించి, అధికారులకు పలు సూచనలు చేశారు. ఓటర్లు సమర్పించే ధ్రువీకరణ పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించాలని, వాటిపై తప్పనిసరిగా సంబంధిత ఓటర్ల సంతకాలు తీసుకోవాలని సూచించారు. అవసరమైతే 2002 సంవత్సరానికి చెందిన ఓటర్ల పేర్ల జాబితాను పరిశీలించి, సరిపోల్చుకోవాలని తెలిపారు. ఓటర్లు సమర్పించిన ఫారాలను పరిశీలించిన కలెక్టర్, అప్‌లోడింగ్ ప్రక్రియను కూడా తనిఖీ చేశారు. ప్రతిరోజు ఎంత మంది ఓటర్లు హియరింగ్‌కు వస్తున్నారు. ఎన్ని దరఖాస్తులు ధ్రువీకరిస్తున్నారు అనే వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. నోటీసులు జారీ చేసిన ప్రతి వ్యక్తి హియరింగ్‌కు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని, ఓటర్ల జాబితాలో ఎలాంటి తప్పులు దొర్లకుండా అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాలని ఆదేశించారు. ఖచ్చితమైన ఓటరు జాబితాను సిద్ధం చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. అర్హత కలిగిన ప్రతి ఒక్క ఓటరు వివరాలు ఓటరు జాబితాలో ఉండేలా అధికారులు ప్రక్రియను నిర్వహించాలని, విధులు కేటాయించిన సిబ్బంది పరస్పర సమన్వయంతో పనిచేసి నిర్దేశించిన గడువులోగా ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా దేవరుప్పుల మండలంలోని రోడ్లకు ఇరువైపులా ఉన్న చెత్తాచెదారం, పిచ్చి మొక్కలను వెంటనే తొలగించి, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని గ్రామ పంచాయతీ కార్యదర్శిని ఆదేశించారు. పరిశుభ్రతపై క్రమం తప్పకుండా పర్యవేక్షించాలని ఎంపీడీఓకు సూచించారు. ఈ పరిశీలనలో ఎంపీడీఓ మేనక, ఆర్ఐ కె. రాజు, గ్రామ పంచాయతీ కార్యదర్శి సతీష్ రెడ్డి, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

దేవరుప్పులలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులు, ఆధునిక వ్యవసాయ మార్కెట్ గోదాము పరిశీలించిన జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

జనగామ జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 11 (ప్రజాజ్యోతి) : జిల్లాలోని దేవరుప్పుల మండలంలోని దేవరుప్పుల గ్రామ పంచాయతీలో మంజూరైన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను, గ్రామ శివారులో గల ఆధునిక వ్యవసాయ మార్కెట్ గోదాము ను జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులతో మాట్లాడిన కలెక్టర్, ఇప్పటి వరకు ఎన్ని బిల్లులు వచ్చాయని ఆరా తీశారు. దీనికి లబ్ధిదారులు ఇప్పటి వరకు మూడు విడతలుగా బిల్లులు వచ్చాయని తెలిపారు. అలాగే ఇంటి నిర్మాణానికి ఎంత ఖర్చు అయిందనే విషయాన్ని కూడా కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఇంకా రెండు, మూడు రోజుల్లో ఇంటికి తలుపులు బిగించి, సున్నం కూడా వేయించాలని లబ్ధిదారులకు కలెక్టర్ సూచించారు. పనులను త్వరగా పూర్తి చేస్తే మరో బిల్లు మంజూరవుతుందని వెల్లడించారు. దీనికి స్పందించిన లబ్ధిదారులు పనులను వేగంగా పూర్తి చేస్తామని కలెక్టర్‌కు వివరించారు. ఈ క్రమంలో బండిపల్లి పద్మ, తోటకూర శారద నిర్మిస్తున్న ఇళ్లను కలెక్టర్ పర్యవేక్షించారు. వివిధ దశల్లో పురోగతిలో ఉన్న ఇళ్ల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని స్పష్టం చేశారు. గ్రామంలోని నివాస పరిసరాలు పరిశుభ్రంగా ఉండే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. తద్వారా దోమలను నివారించి, వ్యాధులను అరికట్టవచ్చని పంచాయతీ కార్యదర్శిని ఆదేశించారు. ఈ పరిశీలనలో పంచాయతీ కార్యదర్శి సతీష్ రెడ్డి, ఇతర సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు. అనంతరం మండలంలోని గ్రామ శివారులో గల ఆధునిక వ్యవసాయ మార్కెట్ గోదామును జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా పరిశీలించారు.

గోదామును కలియ తిరిగి పరిశీలిస్తూ, అక్కడ నిల్వ సామర్థ్యం ఎంత వరకు ఉందని అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. గోదాములో నిల్వ ఉంచే బియ్యం ఎక్కడి నుంచి సరఫరా అవుతుందని కలెక్టర్ ఆరా తీయగా, జిల్లాలోని రైస్ మిల్లుల నుంచి బియ్యం గోదాముకు వస్తుందని అధికారులు తెలిపారు. గోదాములోని ఏర్పాట్లు, నిల్వ విధానాలను పరిశీలించిన కలెక్టర్ గోదామును జాగ్రత్తగా నిర్వహించాలని సూచించారు. గోదాము వద్ద నిరంతరం అప్రమత్తంగా ఉండాలని స్పష్టం చేశారు. గోదాములకు అనుమతి లేని వ్యక్తులను ఎవ్వరినీ లోనికి అనుమతించవద్దని సిబ్బందిని ఆదేశించారు. ఈ గోదాము నుంచి బియ్యం ఎక్కడికి సరఫరా చేస్తారని కలెక్టర్ అడగగా, ఎంఎల్ఎస్ పాయింట్‌కు సరఫరా చేస్తున్నామని అధికారులు వివరించారు. ఈ పరిశీలనలో సంబంధిత అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయ చైర్మన్ మారుజోడు రాంబాబును కలిసిన కోడూరు కాంగ్రెస్ నాయకులు గ్రామ అభివృద్ధి కోసం

రఘునాథపల్లి సెప్టెంబర్ 11 (ప్రజాజ్యోతి) : రఘునాథపల్లి మండల కేంద్రంలోని జిల్లా గ్రంథాలయ చైర్మన్ మారుజోడు రాంబాబు నివాసంలో కోడూరు గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కోడూరు గ్రామ అభివృద్ధికి సంబంధించిన పలు సమస్యలను చైర్మన్ దృష్టికి తీసుకువచ్చారు. కోడూరు గ్రామం పెద్ద గ్రామం కావడంతో ప్రజల అవసరాలకు అనుగుణంగా అధిక సంఖ్యలో ఇందిరమ్మ ఇళ్ల మంజూరు, సీసీ రోడ్లు, మురుగు కాలువల నిర్మాణం వంటి అభివృద్ధి పనులు చేపట్టాల్సిన అవసరం ఉందని నాయకులు వివరించారు. గ్రామంలో నెలకొన్న పలు సమస్యలను ఎమ్మెల్యే కడియం శ్రీహరి దృష్టికి తీసుకెళ్లి, పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. ఈ సందర్భంగా జిల్లా గ్రంథాలయ చైర్మన్ మారుజోడు రాంబాబు మాట్లాడుతూ.. కోడూరు గ్రామ అభివృద్ధికి అవసరమైన సమస్యలను ఎమ్మెల్యే కడియం శ్రీహరి దృష్టికి తీసుకెళ్లి, ప్రజలకు అవసరమైన అభివృద్ధి పనులు మంజూరయ్యేలా తన వంతు కృషి చేస్తానని తెలిపారు.

ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గాదే మహేందర్ రెడ్డి, జిల్లా కార్యదర్శి నామాల బుచ్చయ్య, ఓబీసీ సెల్ మండల అధ్యక్షుడు వడ్లకొండ శివప్రసాద్, కోడూరు గ్రామ సీనియర్ నాయకులు పూజారి మదన్ మోహన్, సానిక చంద్రయ్య, భాషపాక మణి, దాసరి తిరుపతి, హరీష్, శాగంటి యాదగిరి, బండ దేవదానం, సట్ల యాకయ్య తదితరులు పాల్గొన్నారు.

బెజగం ఐలయ్యకు దావెర అనిల్ కుమార్ ఘన నివాళి

దేవరుప్పుల సెప్టెంబరు 11 (ప్రజాజ్యోతి): మండలంలోని చిన్నమడూర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు బెజగం ఐలయ్య మృతిచెందడంతో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు దావెర అనిల్ కుమార్ శుక్రవారం ఆయన పార్థివదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ పార్టీ అధ్యక్షుడు ముసిగుంపుల నరేష్, మాజీ సర్పంచ్ వంగ దశరథ,మండల నాయకులు మొటిక చంద్రశేఖర్,వార్డు సభ్యులు లక్ష్మీనర్సు,రాంపల్లి పరమేష్,అప్పిరెడ్డిపల్లి సర్పంచ్ అనూష నర్సింగరావు,కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ఐలయ్య పార్థివదేహానికి సర్పంచ్ జోగేశ్వర్ నివాళి

దేవరుప్పుల, సెప్టెంబరు 11 (ప్రజాజ్యోతి): మండలంలోని చిన్నమడూరు గ్రామానికి చెందిన బెజగం ఐలయ్య మృతి చెందగా విషయం తెలుసుకున్న గ్రామ సర్పంచ్ మైదం జోగేశ్వర్ శుక్రవారం వారి పార్థివదేహాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఐలయ్య కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. బాధిత కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

బాధిత కుటుంబానికి బీఆర్ఎస్ నాయకుల పరామర్శ

దేవరుప్పుల, సెప్టెంబరు 11 (ప్రజాజ్యోతి): దేవరుప్పుల మండలం మన్ ఫహాడ్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు బస్వ సోమ నరసయ్య తండ్రి మల్లయ్య మృతి చెందగా శుక్రవారం బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు తీగల దయాకర్ గౌడ్,మాజీ మండల అధ్యక్షుడు బస్వ మల్లేష్ గౌడ్ మృతుని ఇంటికి వెళ్లి ఆయన మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల సీనియర్ నాయకులు కారుపోతుల బిక్షపతి,సుడిగేలా హనుమంతు,బస్వ వెంకన్న,గొడిశాల మల్లేష్,వర్రె ఎర్రయ్య,బూడిద ప్రశాంత్,చీకటి ఎల్లేష్,కోల సోమయ్య తదితరులు ఉన్నారు.

మల్లయ్య మరణం కుటుంబానికి తీరని లోటు

భౌతికదేహానికి నివాళులర్పించిన సుందర్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఏల సుందర్

దేవరుప్పుల, సెప్టెంబరు 11 (ప్రజాజ్యోతి): మండలంలోని మన్ ఫహాడ్ గ్రామానికి చెందిన బస్వ సోమ నరసయ్య తండ్రి మల్లయ్య మరణం కుటుంబానికి, పార్టీకి తీరని లోటని బీఆర్ఎస్ పార్టీ నాయకులు, సుందర్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఏల సుందర్ అన్నారు. శుక్రవారం బస్వ మల్లయ్య పార్థివదేహాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల నాయకులు తోటకూరి కిష్టయ్య, నర్ర సోమశేఖర్, శీల తిరుమలేష్, పల్సం నర్సింహ, వర్రె ఎర్రయ్య, కోల సోమయ్య, జోగు కిరణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మేనిఫెస్టోలో పెట్టిన హామీలు అడుగుతే అరెస్టులా

- అక్రమ అరెస్టులను ఖండించండి
- బిఆర్టీయు జిల్లా అధ్యక్షుడు గోనె యువరాజు

నర్సంపేట సెప్టెంబర్ 11 (ప్రజా జ్యోతి) : ఆశా వర్కర్లకు తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని ఎన్నికల మేనిఫెస్టో లో పెట్టిన డిమాండ్లను 1000 రోజులు గడిచినా నేటికీ పరిష్కారం కాలేదు అని ప్రస్తుతం జరుగుతున్న అసెంబ్లీ సమావేశాల లో చర్చించి ఎన్నికల మేనిఫెస్టో లో పెట్టిన ఆశా లకు నెలకు 18 వేల రూపాయలు వేతనం,సామాజిక భద్రత,అమలు చేయాలని ప్రజాస్వామ్యబద్ధంగా ప్రశ్నించా డానికి హైదరాబాద్ కు వెళుతుంటే ఆశా వర్కర్లు ను బి ఆర్ టీ యు వరంగల్ జిల్లా అధ్యక్షుడు గోనె యువరాజు ను అక్రమంగా అరెస్టు చేయడం దారుణమని ప్రజాస్వామిక వాదులు,మేధావులు తీవ్రంగా ఖండించాలని అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం లో ప్రజా పాలన లేదని పోలీస్ ఆధ్వర్యంలో నిర్బంధం కొనసాగుతోంది ఇది ప్రజాస్వామ్యానికి గొడ్డలి పెట్టు అని ఆవేదన వ్యక్తం చేశారు.

ఆశా వర్కర్లు కొత్త డిమాండ్స్ కోరడం లేదని జాబ్ చార్ట్ లో ఉన్న విధులు నిర్వర్తిస్తామని పారితోషికాలు కాకుండా ఫిక్స్ వేతనాలు ఇస్తామని చెప్పినవె అమలు చేయమని అడుగుతున్నారు అని అన్నారు. ఇలానే నిర్బందలు కొనసాగుతె రాబోయే ఎన్నికల్లో తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బి ఆర్ ఎస్ వి నాయకులు నల్ల రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

సెప్టెంబర్ 17ను తెలంగాణ విమోచన దినోత్సవంగా అధికారికంగా నిర్వహించాలి

కేతేపల్లి, సెప్టెంబర్ 11 ప్రజా జ్యోతి : సెప్టెంబర్ 17ను తెలంగాణ విమోచన దినోత్సవంగా రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని కేతేపల్లి మండల బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం కేతేపల్లి తహసీల్దార్ (ఎమ్మార్వో)కు వినతిపత్రం అందజేశారు.

ఈ సందర్భంగా బీజేపీ కేతేపల్లి మండల అధ్యక్షుడు పిట్టల వెంకట్ మాట్లాడుతూ.. నిజాం పాలన నుంచి తెలంగాణ ప్రజలకు విముక్తి కల్పించడంలో సర్దార్ వల్లభభాయ్ పటేల్ కీలక పాత్ర పోషించారని పేర్కొన్నారు. సెప్టెంబర్ 17న తెలంగాణ విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించాలని, ఈ చారిత్రక ఘట్టం గురించి తెలంగాణ సమాజానికి అవగాహన కల్పించాలని కోరారు. విమోచన దినోత్సవాన్ని ఇతర పేర్లతో నిర్వహించకుండా, తెలంగాణ విమోచన దినోత్సవంగానే నిర్వహించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకురాలు అయితగోని అనిత, యానాల శంకర్ రెడ్డి, జిల్లా నాయకులు తాడోజు నరసింహాచారి, యానాల శ్రీనివాస్ రెడ్డి, సమ్మెట విజయలక్ష్మి, మండల ఉపాధ్యక్షుడు వీరబోయిన పాల నాగయ్య, మండల ప్రధాన కార్యదర్శులు ఇరగదిండ్ల పద్మ, తోవిటి అఖిల్ తదితరులు పాల్గొన్నారు.

గురజాల గ్రామంలో గ్రామ సభ

శాలిగౌరారం, సెప్టెంబర్ 11 ప్రజా జ్యోతి : నల్గొండ జిల్లా శాలిగౌరారం మండలం గురజాల గ్రామంలో గ్రామ సర్పంచ్ ఎర్ర రోజా సుధాకర్ ఆధ్వర్యంలో గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులు, ప్రజా సమస్యలు, వివిధ ప్రభుత్వ కార్యక్రమాల వివరాలను గ్రామ వార్డు సభ్యులు, ప్రజలకు వివరించారు.

సర్పంచ్‌గా ఎన్నికైనప్పటి నుంచి గ్రామంలో జరిగిన ఆదాయ, వ్యయ వివరాలను గ్రామ సభలో ప్రజలకు వెల్లడించారు. అలాగే గ్రామంలో ఇంకా చేపట్టాల్సిన అభివృద్ధి పనులు, ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుని, వాటిపై చర్చించారు. గ్రామాభివృద్ధికి ప్రజల సహకారం అవసరమని సర్పంచ్ తెలిపారు.

ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి వెంకన్న, ఉప సర్పంచ్ ముత్యాల ఉపేందర్, వార్డు సభ్యులు, మాజీ ప్రజాప్రతినిధులు, గ్రామస్థాయి వివిధ హోదాల్లో ఉన్న ఉద్యోగులు, గ్రామ పెద్దలు, రైతులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

మట్టి వినాయక విగ్రహాల తయారీలో ఏవీఎం విద్యార్థులు

పర్యావరణ పరిరక్షణకు మట్టి వినాయకుడే శ్రేష్ఠం

నల్లగొండ సెప్టెంబర్ 11 (ప్రజా జ్యోతి ప్రతినిధి) : నకిరేకల్ పట్టణంలోని ఏవీఎం ఇంగ్లీష్ హైస్కూల్‌లో విద్యార్థులు ఈకో క్లబ్ ఫర్ మిషన్ లైఫ్ కమిటీగా ఏర్పడి వినాయక చవితి సందర్భంగా మట్టి వినాయక విగ్రహాలను తయారు చేశారు.

విద్యార్థులు తయారు చేసిన మట్టి విగ్రహాలను పట్టణంలోని వివిధ ప్రభుత్వ కార్యాలయాలకు పంపిణీ చేశారు. మట్టి విగ్రహాలతో పర్యావరణాన్ని పరిరక్షించవచ్చని, ప్రకృతిని కాపాడేందుకు ప్రతి ఒక్కరూ మట్టి వినాయక విగ్రహాలనే వినియోగించాలని విద్యార్థులు సూచించారు.

పర్యావరణ పరిరక్షణలో భాగంగా మట్టి వినాయక విగ్రహాలు ఎంతో శ్రేష్ఠమైనవని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ కందాల స్వప్న శ్రీకాంత్ రెడ్డి, విద్యార్థులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు

స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేసిన గ్రామ సర్పంచ్

తుంగతుర్తి, సెప్టెంబర్ 11,(ప్రజా జ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వ హయాం లోనే పేదలకు సంక్షేమం, అభివృద్ధి ఫలాలు అందుతున్నాయని దేవుని గుట్ట తండా గ్రామ సర్పంచ్ గుగులోతు స్వాతి భాస్కర్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని దేవుని గుట్ట తండా గ్రామంలో లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ... ప్రభుత్వ పథకాలు, సేవలను ప్రజలకు మరింత వేగంగా, పారదర్శకంగా అందించేందుకు స్మార్ట్ రేషన్ కార్డులు ఎంతగానో ఉపయోగపడతాయని తెలిపారు. స్మార్ట్ రేషన్ కార్డులు అందుకున్న లబ్దిదారులు ప్రభుత్వ సేవ పట్ల హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి, గ్రామపంచాయతీ సిబ్బంది, రేషన్ డీలర్, వార్డు సభ్యులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

దోమల నివారణకు బ్లీచింగ్ చల్లింపు...

అనంతగిరి (ప్రజాజ్యోతి) సెప్టెంబర్ 11 : అనంతగిరి మండలంలోని పాలవరం గ్రామంలో దోమల నివారణ, పారిశుధ్య పరిరక్షణలో భాగంగా బ్లీచింగ్ చల్లింపు కార్యక్రమాన్ని చేపట్టారు. గ్రామంలోని ప్రధాన వీధులు, మురుగు కాలువలు, నీరు నిలిచే ప్రాంతాల్లో బ్లీచింగ్ పౌడర్‌ను చల్లారు. ఈ సందర్భంగా సర్పంచ్ మట్టపల్లి నరేష్‌గౌడ్ మాట్లాడుతూ.. వర్షాల నేపథ్యంలో దోమల వ్యాప్తిని అరికట్టేందుకు ముందస్తు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ప్రజలు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ఇళ్ల చుట్టూ నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. గ్రామంలో పారిశుధ్య కార్యక్రమాలను నిరంతరం కొనసాగిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎన్ఆర్ఐ బెల్లంకొండ రవి, గ్రామపంచాయతీ సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

నిరాశ్రయ తల్లిబిడ్డకు సొంతింటి నీడ

గరిడేపల్లి,సెప్టెంబర్ 11(ప్రజా జ్యోతి) : మండలంలోని కల్మలచెరువు గ్రామంలో సత్రంలో జీవనం సాగిస్తున్న అనాథ తల్లిబిడ్డకు దాత ఏవీ రెడ్డి అండగా నిలిచా రు.తన సహకారంతో నూతన గృహాన్ని నిర్మించి శుక్రవారం తల్లిబిడ్డకు అందజేశారు. ఇన్నాళ్లు నిరాశ్రయులుగా జీవించిన వారికి సొంతింటి కలను సాకారం చేసి,ఆ కుటుంబానికి భరోసా కల్పించారు.పేదల కష్టాలను గుర్తించి వారికి అండగా నిలుస్తున్న ఏవీ రెడ్డి సేవాభావాన్ని గ్రామస్తులు అభినందించారు.ఆర్థికంగా వెనుకబడిన కుటుంబానికి ఇంటిని నిర్మించి ఇవ్వడం ఎంతో గొప్ప మానవతా కార్యక్రమమని గ్రామ సర్పంచ్ బచ్చలకూరి శ్రీను పేర్కొన్నారు.సమాజంలో అవసరంలో ఉన్న వారిని గుర్తించి సహాయం చేయడం ఆదర్శనీయమని కొనియాడు తూ ఏవీ రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ గుత్తికొండ ప్రమీల వెంకటరమణారెడ్డి,మాజీ సర్పంచ్ కుక్కునూరు అంజయ్య మాజీ కో-ఆప్షన్ సభ్యుడు షేక్ దస్తగిరి,వార్డు సభ్యులు అమరవరపు నాగయ్య,కందుల త్రివేణి నవీన్,బొల్లగాని వెంకన్న, గ్రామ పెద్దలు సపిడి లచ్చిరెడ్డి, కమ్మలపల్లి వెంకటనారాయణ, నాయకులు సపిడి శంభిరెడ్డి, ధనమూర్తి లక్ష్మయ్య,షేక్ రఫీ, మీసాల సైదులు,అనంత కోటయ్య,అమరవరపు శ్రీను, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి 'ప్రేరణ'కు శ్రీరామ్ ఎంపిక

గరిడేపల్లి,సెప్టెంబర్ 11, (ప్రజా జ్యోతి) : సూర్యాపేట జిల్లా విద్యారంగం లో కల్మల్ చెరువు విద్యార్థి అరు దైన ఘనత సాధించాడు.గరిడే పల్లి మండలం కల్మల్ చెరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కు చెందిన 10వ తరగతి విద్యా ర్థి గుండెబోయిన శ్రీరామ్ కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ నిర్వహి స్తున్న ప్రతిష్టాత్మక జాతీయ స్థాయి 'ప్రేరణ' అనుభవాత్మక విద్యా కార్యక్రమానికి ఎంపిక య్యాడు.2025 నవంబర్ లో జవహర్ నవోదయ విద్యాలయం లో నిర్వహించిన జిల్లా స్థాయి 'ప్రేరణ ఉత్సవ్'లో శ్రీరామ్ తన సృజనాత్మకత,నాయకత్వ లక్షణాలు,ప్రతిభతో అత్యుత్తమ ప్రదర్శన కనబరిచి జాతీయ స్థాయి కార్యక్రమానికి అర్హత సాధించినట్లు జిల్లా నో డల్ నవోదయ ప్రిన్సిపల్ ఆదినారా యణ ప్రకటించారు.జాతీయ స్థాయిలో గుజరాత్ లోని వాద్ నగర్ లోని (మోడీ చదివిన పాఠశాల) ది వెర్నాక్యులర్ స్కూల్ 2026 నవంబర్ 15 నుండి నవంబర్ 21వరకు రెసిడెన్షియల్ శిక్షణ కార్యక్రమం లో పాల్గొననున్నాడు.కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ఉచిత వసతి,ప్రయాణ సౌకర్యాలతో జరిగే ఈ కార్యక్రమంలో విలువ దారిత కరికులం,రోబోటిక్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, భారతీయ సంస్కృతి,యోగా, నాయకత్వ నైపుణ్యాలపై ప్రత్యేక శిక్షణ పొందనున్నాడు.గ్రామీణ ప్రాంతంలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థి జాతీయ స్థాయికి ఎంపి క కావడం పట్ల పాఠశాల ప్రధానో పాధ్యాయులు పిడమర్తి వీరబా బు,ఉపాధ్యాయులు,గ్రామ సర్పంచ్ బచ్చలకూరి శ్రీను,గ్రామ స్తులు హర్షం వ్యక్తం చేశారు. శ్రీరామ్ విజయం తోటి విద్యార్థులకు స్ఫూర్తిగా నిలుస్తుందని,భవిష్యత్తులో దేశానికి గర్వకారణంగా ఎదగాలని ఎంఈఓ ఛత్రు నాయక్ ఆకాంక్షించారు.

విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలి

- సింగిల్ విండో చైర్మన్ గుడిపాటి సైదులు - అన్నారం గ్రామంలో ఘనంగా ఎస్జిఎఫ్ మండల స్థాయి క్రీడా పోటీలు - ఖోఖో క్రీడలను ప్రారంభించిన అతిథులు

తుంగతుర్తి, సెప్టెంబర్ 11, (ప్రజాజ్యోతి) : చదువుతోపాటు క్రీడల్లోనూ విద్యార్థులు రాణించాలని, చదువుకు అవసరమైన జ్ఞానం, ఆలోచన శక్తి నీ క్రీడలు పెంపొందిస్తాయని తుంగతుర్తి సింగిల్ విండో చైర్మన్ గుడిపాటి సైదులు అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని అన్నారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గ్రామ సర్పంచ్ కుంచాల శ్రీనివాసరెడ్డి,మలిపెద్ది శ్రీనివాస్ రెడ్డి, కార్తీక్ రెడ్డి దాతల సహకారంతో నిర్వహించిన ఎస్జిఎఫ్ మండల స్థాయి ఖోఖో క్రీడలకు సింగిల్ విండో చైర్మన్ గుడిపాటి సైదులు ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించి మాట్లాడారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ మండల స్థాయి టోర్నమెంట్స్ అనేవి గ్రామీణ మరియు పట్టణ ప్రాంతాల్లోని విద్యార్థుల్లో దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికి తీయడానికి ప్రాథమిక పునాదిగా నిలుస్తాయన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో నిర్వహించే క్రీడల్లో ప్రతిభ కనబరిచి జిల్లా, రాష్ట్రస్థాయిలో రాణిస్తూ జాతీయ స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. మండల స్థాయిలో నిర్వహించే క్రీడలు క్రీడాకారులకు పునాది లాంటిదన్నారు. క్రీడల్లో గెలుపోటములు సహజమని క్రీడా స్ఫూర్తితో ముందుకు వెళ్లాలన్నారు. మండలంలోని వివిధ ప్రభుత్వ ప్రైవేట్ పాఠశాలల నుండి సుమారు 200 మంది క్రీడాకారులు హాజరు కాగా అండర్-14, అండర్-17 బాల బాలికల విభాగంలో ఖోఖో టోర్నమెంటులో ఎంపిక పోటీలు నిర్వహించారు. ముందుగా క్రీడల దిగ్గజం ధ్యాన్ చంద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సునీత రాణి జ్యోతి ప్రజ్వలన చేయగా జాతీయ జెండాను మండల విద్యాధికారి బోయిని లింగయ్య, కామన్వెల్త్ గేమ్స్ జెండాను గ్రామ సర్పంచ్ కుంచాల శ్రీనివాస్ రెడ్డి, ఎస్జిఎఫ్ జెండాను ప్రధానోపాధ్యాయురాలు సునీత రాణి ఆవిష్కరించగా క్రీడా జ్యోతిని అతిథులు వెలిగించి క్రీడలను ప్రారంభించారు. అనంతరం వివిధ పాఠశాల విద్యార్థిని విద్యార్థులు చేసిన మార్చి ఫాస్ట్ ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో చలపతి,తుంగతుర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ చింతకుంట్ల వెంకన్న, ఎస్జిఎఫ్ జిల్లా సెక్రటరీ మంద కిరణ్ కుమార్, నియోజకవర్గ సెక్రటరీ యాదగిరి,తుంగతుర్తి మండల కన్వీనర్ కొండగడుపుల యాకయ్య, గ్రామ ఉపసర్పంచ్ వెలిశాల సునీత, గ్రామ పాలకవర్గం సభ్యులు,మండల పరిధిలోని వివిధ ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఫిజికల్ డైరెక్టర్లు,వ్యాయామ ఉపాధ్యాయులు, విద్యార్థిని విద్యార్థులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

18, 19 తేదీల్లో జర్నలిస్టుల రిలే నిరాహార దీక్షలు

నల్గొండ సెప్టెంబర్ 11 (ప్రజా జ్యోతి ప్రతినిధి) : జర్నలిస్టుల ఇండ్ల స్థలాల కోసం రిలే నిరాహార దీక్షలు నిర్వహించనున్నట్లు తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం ఐజెయు నల్గొండ జిల్లా కమిటీ అధ్యక్షుడు గార్లపాటి కృష్ణా రెడ్డి, ప్రధాన కార్యదర్శి పులిమామిడి మహేందర్ రెడ్డి తెలిపారు. ఈ నెల 18, 19 తేదీలలో నిర్వహించే ఈ రిలే దీక్షలను విజయవంతం చేయాలని పిలుపు నిచ్చారు.

జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు కేటాయించాలనే డిమాండ్‌తో ఈ నెల 18, 19 తేదీల్లో నల్గొండ కలెక్టరేట్ ఎదుట రెండు రోజుల పాటు రిలే నిరాహార దీక్షలు చేపట్టనున్నట్లు తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం ఐజెయునల్గొండ జిల్లా కమిటీ

హామీలు కాదు.. ఇండ్ల స్థలాలు కేటాయించాలి : జర్నలిస్టులు

ప్రకటించింది.ఈ దీక్షల నిర్వహణకు అనుమతి ఇవ్వాలని కోరుతూ సంఘం జిల్లా అధ్యక్షులు గార్లపాటి కృష్ణారెడ్డి, ప్రధాన కార్యదర్శి పులిమామిడి మహేందర్ రెడ్డిలు జర్నలిస్ట్ లతో కలిసి నల్గొండ డీఎస్పీ కె. శివరాంరెడ్డికి శుక్రవారం ఒక అధికారిక వినతిపత్రాన్ని సమర్పించారు.జర్నలిస్టుల చిరకాల ఆకాంక్ష అయిన ఇండ్ల స్థలాల సాధన కోసం శాంతియుత పద్ధతిలో ఈ నిరసన కార్యక్రమాన్ని చేపడుతున్నామని, కాబట్టి ఈ రెండు రోజుల దీక్షలకు తగిన అనుమతులు మంజూరు చేయాలని వారు తమ లేఖలో కోరారు. ఈ సందర్భంగా టి.యు.డబ్ల్యు.జె. - ఐజెయు నల్గొండ జిల్లా కమిటీ అధ్యక్షుడు గార్లపాటి కృష్ణా రెడ్డి మాట్లాడుతూ జర్నలిస్ట్ ఇళ్లు, ఇళ్ల స్థలాల కోసం ఎన్ని సార్లు ధర్నాలు, ఆందోళనా కార్యక్రమాలు నిర్వహించిన అధికారులు, ప్రజా ప్రతినిధులు తాత్కాలిక హామీ లు తప్ప తమ సమస్య పరిష్కారం కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. జర్నలిస్టుల ఇండ్ల స్థలాల కోసం రిలే నిరాహార దీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ

నెల 18, 19 తేదీలలో నిర్వహించే ఈ రిలే దీక్షలను విజయవంతం చేయాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టుల సంఘం అధ్యక్షుడు పరమేష్, ప్రధాన కార్యదర్శి దోటి శ్రీనివాస్, చిన్న పత్రికల సంఘం జిల్లా అధ్యక్షులు అబ్బోజు మదనాచారి, కోశాధికారి. అశోక్. వీడియో జర్నలిస్ట్‌ల సంఘం అధ్యక్షులు సలీం మరియు నాయకులు జిల్లా యాదయ్య,పి. అశోక్ కుమార్, వంగాల శ్రీనివాస్ రెడ్డి, సయ్యద్, కె.జగదీశ్వర చారి,చింత యాదయ్య, రామ్ ప్రసాద్, రెడ్డి పల్లి యాదగిరి, రెమిడాల మధు, ముచ్చర్ల విజయ్, కారింగు శ్రీనివాస్, దశరథ, సాగర్, లింగయ్య, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్ఎస్‌యూఐ తెలంగాణ రాష్ట్ర జాయింట్ సెక్రటరీగా బానోతు సాగర్ నాయక్

విద్యార్థుల సమస్యల పరిష్కారమే లక్ష్యం.. హక్కుల పరిరక్షణకు కృషి చేస్తా

తుంగతుర్తి, సెప్టెంబర్ 11,(ప్రజా జ్యోతి) : నేషనల్ స్టూడెంట్స్ యూనియన్ ఆఫ్ ఇండియా (ఎన్ ఎస్ యు ఐ) తెలంగాణ రాష్ట్ర జాయింట్ సెక్రటరీగా అడ్వకేట్ బానోతు సాగర్ నాయక్ నియమితులయ్యారు. ఈ మేరకు ఎన్ఎస్‌యూఐ జాతీయ, రాష్ట్ర నాయకత్వం ఆయనకు కీలక బాధ్యతలు అప్పగించింది.ప్రస్తుతం న్యాయవాదిగా కొనసాగుతున్న బానోతు సాగర్ నాయక్ గతంలో నిజామాబాద్‌లోని తెలంగాణ యూనివర్సిటీ అధ్యక్షుడిగా పనిచేశారు. విద్యార్థుల సమస్యలు, విద్యా రంగానికి సంబంధించిన అంశాలు, విద్యార్థుల హక్కుల పరిరక్షణ కోసం ఆయన విద్యార్థి నాయకుడిగా చురుకైన పాత్ర పోషించారు.విద్యార్థి నాయకుడిగా ఆయన అందించిన సేవలు, నాయకత్వ అనుభవాన్ని గుర్తించిన ఎన్ఎస్‌యూఐ జాతీయ, రాష్ట్ర నాయకత్వం రాష్ట్ర జాయింట్ సెక్రటరీగా నియమించింది. దీంతో తెలంగాణ వ్యాప్తంగా విద్యార్థి సమస్యలపై మరింత విస్తృతంగా పనిచేసే అవకాశం ఆయనకు లభించింది.ఈ సందర్భంగా బానోతు సాగర్ నాయక్ మాట్లాడుతూ.. తనపై నమ్మకం ఉంచి రాష్ట్ర జాయింట్ సెక్రటరీగా బాధ్యతలు అప్పగించిన ఎన్ఎస్‌యూఐ జాతీయ అధ్యక్షులు వినోద్ జకార్, తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు వెంకట్ స్వామితో పాటు జాతీయ, రాష్ట్ర నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.తనకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ తెలంగాణ రాష్ట్రంలోని విద్యార్థుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు. విద్యార్థుల హక్కుల పరిరక్షణ, విద్యా రంగంలో ఎదురవుతున్న సమస్యలపై నిరంతరం పోరాడుతూ విద్యార్థులకు అండగా నిలుస్తానని బానోతు సాగర్ నాయక్ పేర్కొన్నారు.సాగర్ నాయక్ నియామకంపై పలువురు విద్యార్థి నాయకులు, కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ నాయకులు, న్యాయవాదులు, ఆయన

సన్నిహితులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు. రాష్ట్రస్థాయి బాధ్యతలు చేపట్టిన నేపథ్యంలో విద్యార్థి సమస్యలపై మరింత చురుకైన కార్యక్రమాలు చేపట్టాలని వారు ఆకాంక్షించారు.

ఉపాధి కూలీలకోసం 5 ఏళ్లకు గాను

పనుల ప్రణాళికలు సిద్ధం చేయండి..!

దామరచర్ల, సెప్టెంబర్ 11, (ప్రజాజ్యోతి) : వచ్చే ఐదేళ్లకు గాను ఉపాధి కూలీలకు చేతినిండా పనులు కల్పించేలా 318 రకాల పనుల కోసం ప్రణాళికలు సిద్ధం చేయాలని మండల పరిషత్ అభివృద్ధి అధికారి కె.వెంకటయ్య కోరారు.మండల పరిధిలో వికసిత్ గ్రామీణ్ ప్రిపరేషన్ ప్లాన్ సంబంధించి మండల స్థాయి అవగాహన కార్యక్రమం శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించారు. ఈ

- ఎంపిడిఓ వెంకటయ్య
- వికసిత్ గ్రామీణ్ ప్రిపరేషన్‌పై అవగాహనా సదస్సు

కార్యక్రమానికి మండలంలో అన్ని గ్రామాల సర్పంచులు, కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్స్ పాల్గొనగా రాబోయే నాలుగు,ఐదు సంవత్సరాలకు సంబంధించి సంవత్సరం వారిగా వి బి జి రామ్ జి పథకంలో వి జి పి పి గ్రామ్ పంచాయతీ ప్రిపరేషన్ ప్లాన్ సంబంధించి 318 రకాల పనులను గ్రామసభల ద్వారా గుర్తించి ప్లాన్ లో పొందుపరచవలసిందిగా వారిని కోరారు. ప్రణాళికలో భాగంగా కూలి లకు సరిపడా మెటీరియల్,సరిపడా పనులను గుర్తించి, చేపట్టె పనుల ప్రణాళిక

చేపట్టవలసిందిగా వారిని ఆదేశించారు. ప్రభుత్వ లక్ష్యం నెరవేర్చడంతోపాటు, గ్రామాలు అభివృద్ధి జరిగేలా, కూలీలకు ఉపాధి లభించేలా పనుల ఎంపిక విధానం చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల సూపరింటిండెంట్ జి.ఎస్.మూర్తి, ఎంఇఓ సైదా నాయక్, ఎంఏఓ, ఎఇపిఆర్, ఏఇఆర్‌డబ్ల్యుఎస్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ సాయుధ పోరాటం ఆదర్శం

సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గన్నా చంద్రశేఖర్

గరిడేపల్లి,సెప్టెంబర్ 11,(ప్రజా జ్యోతి): తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం నేటి తరానికి ఆదర్శ మని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గన్నా చంద్రశేఖర్ అన్నారు.పొనుగోడులో సీపీఐ మండల సమితి ఆధ్వర్యంలో తెలంగాణ సాయుధ పోరాట 80వ వార్షికోత్సవ సభను నిర్వహించారు.ఈ సందర్భంగా అనుమాల లింగయ్య స్తూపం వద్ద నివాళులర్పించారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ భూమి,భుక్తి కోసం,వెట్టిచాకిరీ విముక్తి కోసం 1946--51 మధ్య నైజాం నిరం కుశ పాలనకు వ్యతిరేకంగా కమ్యూనిస్టుల నాయకత్వంలో మహత్తర పోరాటం సాగిందన్నారు. ఈ పోరాట చరిత్రను పాఠ్యాంశాల్లో చేర్చి భవిష్యత్ తరాలకు అందించాలని కోరారు. అమరజీవి అనుమాల లింగ య్య పార్టీకి చేసిన సేవలు మరువలేనివని కొనియాడారు. అనంతరం

అమరవీరుల స్తూపాలు,పార్టీ దిమ్మెల వద్ద ఎర్రజెండాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు యల్లావుల రాములు,గుండు వెంకటేశ్వర్లు, పోకల వెంకటేశ్వర్లు,కడియాల అప్పయ్య,త్రిపురం సుధాకర్‌రెడ్డి, బిల్లా కనకయ్య తదితరులు పాల్గొన్నారు.

బీసీల ధర్మ పోరాట దీక్ష విజయవంతం

నిజామాబాద్ ప్రతినిధి, సెప్టెంబర్ 10 (ప్రజాజ్యోతి) : కేంద్రం చేపడుతున్న జాతీయ జనగణనలో బీసీ కులగణన అంశం లేకపోవడాన్ని నిరసిస్తూ జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా బీసీల ధర్మ పోరాట దీక్షకు పిలుపులో భాగంగా నిజామాబాద్ జిల్లా బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం పులాంగ్ చౌరస్తా వద్దగల అంబేద్కర్ విగ్రహం వద్ద బీసీ ప్రజలు బీసీల ధర్మ పోరాట దీక్షను చేపట్టారు. ఈ సందర్భంగా బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు నరాల సుధాకర్ మాట్లాడుతూ బీసీ కులగణనను చేపడతామని కేంద్ర ప్రభుత్వం ఏదైతే క్యాబినెట్లో తీర్మానించి ఈరోజు వెనుకడుగు వేయడం సమంజసం కాదని, వెంటనే కేంద్ర ప్రభుత్వం జాతీయ జనగణనలో బిసి కుల గణన అంశాన్ని చేపట్టాలని డిమాండ్ చేశారు. ఎప్పుడో వంద సంవత్సరాల క్రిందట బ్రిటిష్ ప్రభుత్వ హయాంలో చేపట్టిన బీసీ కులగణన తర్వాత ఇప్పటి వరకు బీసీల కుల గణన చేపట్టకపోవడం శోచనీయమని అన్నారు. ఈ దేశంలో ఉన్న ప్రతి ఒక్క జంతువు లెక్క ప్రభుత్వం దగ్గర ఉంది కానీ బీసీల లెక్క లేకపోవడం విచారకరమన్నారు. బీసీలు ఎంతమంది ఉన్నారు అనే అంశం తెలిస్తే ఎక్కడ తమ పీఠాలు కదిలిపోతాయోనని బీసీల కులగణనను ప్రభుత్వాలు చేయడం లేదన్నారు. బిసి కుల జరిగిన రోజే బీసీలకు న్యాయం జరుగుతుందని అన్నారు. వెంటనే బీసీ కులగణన అంశాన్ని చేర్చాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు బుస్సా ఆంజనేయులు, కొయ్యాడ శంకర్, శ్రీలత, బగ్గలి అజయ్, కొట్టూర్ చంద్రకాంత్, సాయి బసవ, అపర్ణ, సురేందర్, సదానంద్, గంగాధర్, ఆర్టీసీ శ్రీనివాస్, నరసయ్య, అనిల్, జయ, రుక్మిణి, నరేందర్, దారం భూమన్న, సత్యనారాయణ, అంకంరావు తదితర బీసీ నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ఐదు రోజుల బ్యాంకింగ్ విధానాన్ని వెంటనే అమలు చేయాలి

- ధర్నాచౌక్‌లో బ్యాంకు ఉద్యోగుల భారీ సమ్మె

నిజామాబాద్ ప్రతినిధి, సెప్టెంబర్ 10 (ప్రజాజ్యోతి) : ఐదు రోజుల పని విధానాన్ని తక్షణమే అమలు చేయాలని ప్రధాన డిమాండ్‌తో పాటు బ్యాంకు ఉద్యోగులు, అధికారులు గత 11 సంవత్సరాలనుండి ఎదుర్కొంటున్న ఇతర సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంక్ యూనియన్స్ (యూఎఫ్ బియూ) ఇచ్చిన దేశవ్యాప్త సమ్మె పిలుపు మేరకు నిజామాబాద్ జిల్లాలో భారీ ధర్నా ని4ర్వహించారు. ఈ సందర్భంగా నిజామాబాదు యూనిట్ కన్వీనర్ రమేష్, గురునాథ్ లు మాట్లాడుతూకేంద్ర ప్రభుత్వ కార్యాలయాలు,ఆర్ బిఐ, ఎన్ఏబీఏఆర్ డీ, ఎస్ ఈబీఐ, ఎల్ఐసి వంటి సంస్థలకు ఇప్పటికే 5 రోజుల పని విధానం అమలులో ఉందని,బ్యాంకులకి కూడా ఇప్పటికే సానుకూల పరిణామాలు చోటుచేసుకున్నప్పటికీ, అమలులో జరుగుతున్న జాప్యాన్ని ఉద్యోగ సంఘాలు తీవ్రంగా వ్యతిరేకించాయన్నారు. "బ్యాంకు ఉద్యోగులు పని వేళలు ముగిసిన తర్వాత కూడా పెండింగ్ పనులను పూర్తి చేస్తున్నారు. సెలవు రోజుల్లో సైతం విధులు నిర్వహించాల్సిన పరిస్థితులు ఉన్నాయి. సాంకేతికత పెరిగినా పని భారం మాత్రం తగ్గలేదు. ఉద్యోగుల పని-- జీవిత సమతుల్యత కోసం 5 రోజుల పని దినాలను వెంటనే అమలు చేయాలని నాయకులన్నారు. బ్యాంకుల లాభాల్లో ఉద్యోగుల కృషి కీలకమని పేర్కొంటూ న్యాయమైన పీఎల్ఐని అందరికీ సమానంగా, పారదర్శకంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే బ్యాంకుల్లో ఖాళీగా ఉన్న పోస్టులను వెంటనే భర్తీ చేసి ఉద్యోగులపై పెరుగుతున్న పని భారాన్ని తగ్గించాలని కోరారు. ఎన్ పీఎస్ స్థానంలో ఎపీఎస్ పునరుద్ధరణ, పెన్షన్ సమస్యల పరిష్కారం, రిటైర్డ్ ఉద్యోగుల వైద్య బీమా భారాన్ని తగ్గించడం తదితర సమస్యలను కూడా పరిష్కరించాలని నాయకులు డిమాండ్ చేశారు. "5 రోజుల పని దినాలు,తగినంత సిబ్బంది, గ్రాట్యుటీ పెంపు, ఎన్ పీఎస్ లో అదనంగా జమ చేసే 4% చందాపై ఆదాయపు పన్ను మినహాయింపు, పెన్షన్ అప్డేషన్ వంటి న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం, ఐబీఏ సానుకూలంగా పరిగణించి వెంటనే పరిష్కరించాలి, లేనియెడల ఇదివరకే ప్రకటించిన విధంగా నెల చివరన జరిగే మూడు రోజుల సమ్మెకు అక్టోబర్ లో నిరవధిక సమ్మెకు కూడా వెనకాడబొమని హెచ్చరించారు. సమ్మెను విజయవంతం చేసిన బ్యాంకు ఉద్యోగులకు , అధికారులకు , ఈ సమ్మెకు సంఘీభావం తెలిపిన ఇతర ట్రేడ్ యూనియన్లకు యూఎఫ్ బీయూ నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. సమ్మెలో నిజామాబాద్ జిల్లాలోని వివిధ బ్యాంకులకు చెందిన సుమారు 1000 మంది ఉద్యోగులు, అధికారులు పాల్గొని సమ్మెను విజయవంతం చేశారన్నారు. ఈ సమ్మెలో యూఎఫ్ బీయూ నాయకులు రాజు, మనోజ్ సింగ్ , వంశీ, సందీప్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రెండు పడక గదుల ఇళ్ల పంపిణీలో గందరగోళం

బీర్కూర్, ప్రజా జ్యోతి సెప్టెంబర్ 11: కామారెడ్డి జిల్లా బీర్కూర్ మండల కేంద్రంలో ఐదేళ్ల క్రితం నిర్మించిన రెండు పడక గదుల ఇళ్ల పంపిణీ కార్యక్రమం తీవ్ర గందరగోళానికి దారితీసింది. ఇళ్ల కేటాయింపులో అర్హులను పక్కనబెట్టి అనర్హులకు ప్రాధాన్యం ఇస్తున్నారంటూ గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామ సర్పంచ్ అరిగే ధర్మతేజ ఆధ్వర్యంలో బీర్కూర్-- బాన్సువాడ ప్రధాన రహదారిపై బైఠాయించి రాస్తారోకో నిర్వహించారు. శుక్రవారం ఉదయం బీర్కూర్ రైతు వేదికలో ఆర్డీఓ రవీందర్ రెడ్డి, తహసీల్దార్ సవాయిసింగ్ ఆధ్వర్యంలో డ్రా పద్ధతిలో ఇళ్ల కేటాయింపు కార్యక్రమం చేపట్టారు. ఈ విషయం తెలుసుకున్న పెద్ద సంఖ్యలో గ్రామస్తులు రైతు వేదికకు చేరుకునేందుకు ప్రయత్నించగా పోలీసులు వారిని అడ్డుకున్నారు. ధ్రువీకరణ పత్రాలు ఉన్న లబ్ధిదారులను మాత్రమే రైతు వేదికలోకి అనుమతించడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. ఈ సందర్భంగా గ్రామస్తులు అధికారుల తీరును నిరసిస్తూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. అధికార పార్టీకి చెందిన వారికే ఇళ్లు కేటాయిస్తున్నారంటూ ఆరోపిస్తూ, రాజకీయాలకు అతీతంగా నిజమైన నిరుపేదలను గుర్తించి ఇళ్లు కేటాయించాలని డిమాండ్ చేశారు.

డ్రా పద్ధతి వద్దు.. అర్హత ఆధారంగానే కేటాయించాలి

గ్రామ సర్పంచ్ ధర్మతేజ మాట్లాడుతూ.. గ్రామంలో ఇల్లు లేని ప్రతి నిరుపేద కుటుంబాన్ని గుర్తించి అర్హత ఆధారంగా ఇళ్లను కేటాయించాలని డిమాండ్ చేశారు. ఏ పార్టీకి చెందిన వారైనా సరే అర్హులైతే వారికి ఇల్లు దక్కేలా చర్యలు తీసుకోవాలని కోరారు. డ్రా పద్ధతిని తక్షణమే నిలిపివేసి పారదర్శకంగా లబ్ధిదారులను ఎంపిక చేయాలని ప్రభుత్వాన్ని, అధికారులను డిమాండ్ చేశారు.

ఐదేళ్లుగా నిరుపయోగంగా ఇళ్లు

బీర్కూర్ పోలీస్ స్టేషన్ సమీపంలో సుమారు ఐదేళ్ల క్రితం నిర్మించిన ఇళ్లు ఇంతకాలం పంపిణీకి నోచుకోకపోవడంతో పలుచోట్ల ఫర్నిచర్, మంచినీటి కుళాయిలు, విద్యుత్ సామగ్రి, తలుపులు, కిటికీలు ధ్వంసమైనట్లు గ్రామస్తులు తెలిపారు. ఇళ్లను సకాలంలో పంపిణీ చేసి ఉంటే ఈ నష్టం జరిగేది కాదని వారు పేర్కొన్నారు.

- అధికార పార్టీ వారికే ఇళ్లు కేటాయిస్తున్నారంటూ గ్రామస్తుల ఆగ్రహం
- డ్రా పద్ధతి రద్దు చేసి అర్హులైన నిరుపేదలకు ఇళ్లు ఇవ్వాలని డిమాండ్
- సర్పంచ్ ధర్మతేజ ఆధ్వర్యంలో రాస్తారోకో.. భారీ పోలీస్ బందోబస్తు

భారీ పోలీస్ బందోబస్తు

పంపిణీ కార్యక్రమంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. నలుగురు సీఐలు, ఎస్సైలు, పెద్ద సంఖ్యలో పోలీసు సిబ్బంది రైతు వేదిక వద్ద మోహరించారు. ధ్రువీకరణ పత్రాలు ఉన్నవారిని మాత్రమే లోపలికి అనుమతిస్తూ మిగతా గ్రామస్తులను అడ్డుకున్నారు. చివరకు ఆర్డీఓ రవీందర్ రెడ్డి, తహసీల్దార్ సవాయిసింగ్ ఆధ్వర్యంలో డ్రా పద్ధతిలో ఇళ్ల కేటాయింపు ప్రక్రియ కొనసాగింది. అయితే ఈ పంపిణీపై గ్రామస్తుల అసంతృప్తి కొనసాగుతుండటంతో బీర్కూర్‌లో రాజకీయంగా, సామాజికంగా ఈ అంశం చర్చనీయాంశంగా మారింది.

ఘనంగా ఇంటిగ్రేటెడ్
పాస్టర్ అసోసియేషన్ 8వ వార్షికోత్సవం

- మల్కాపూర్‌లో దేవునికి మహిమకరంగా స్తుతి కూడిక
- నూతన కమిటీ ఎన్నిక

కొండాపూర్ ప్రజా జ్యోతి సంగారెడ్డి జిల్లా ఇంటిగ్రేటెడ్ పాస్టర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 8వ వార్షికోత్సవ స్తుతి కూడిక గురువారం కొండాపూర్ మండలం మల్కాపూర్ గ్రామంలోని సీసీడీఎల్ మినిస్ట్రీలో ఘనంగా, దేవునికి మహిమకరంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాస్టర్లు, క్రైస్తవ సోదరులు, సోదరీమణులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు, స్తుతి ఆరాధనలు నిర్వహించారు. అనంతరం ఇంటిగ్రేటెడ్ పాస్టర్ అసోసియేషన్ సంగారెడ్డి జిల్లా నూతన కమిటీ కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన కమిటీగా అధ్యక్షులుగా పాస్టర్ పి. భాస్కర్, ఉపాధ్యక్షులుగా పాస్టర్ ఎం. జోసెఫ్, కార్యదర్శిగా పాస్టర్ బి. ఏలియా కుమార్, ఉప కార్యదర్శిగా పాస్టర్ టి. అనిల్, కోశాధికారిగా పాస్టర్ ఎ. ప్రసన్న కుమార్ ఎన్నికయ్యారు. ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా పాస్టర్ సిహెచ్. షడ్రక్, పాస్టర్ జి. కిషన్లను ఎన్నుకున్నారు. సలహాదారులుగా పాస్టర్ జి. దావీదు, పాస్టర్ సి. డానియల్, పాస్టర్ జి .సునీల్లను నియమించారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులకు పలువురు పాస్టర్లు, క్రైస్తవ సంఘాల ప్రతినిధులు శుభాకాంక్షలు తెలిపారు. సంఘ బలోపేతానికి, క్రైస్తవుల ఆధ్యాత్మిక అభివృద్ధికి నూతన కమిటీ సమిష్టిగా కృషి చేయాలని ఆకాంక్షించారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు ఘన సన్మానం: సురేష్ యం ఈఓ

కల్హేర్, సెప్టెంబర్ 11 (ప్రజాజ్యోతి): మండల విద్యాశాఖ కల్హేర్ ఆధ్వర్యంలో మండలంలోని 13 మంది ఉత్తమ ఉపాధ్యాయులను ఎంపిక చేసి ఘనంగా సన్మానించారు. కల్హేర్ మండల వనరుల కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో ఉత్తమ ఉపాధ్యాయులను శాలువాలతో సత్కరించి అభినందించారు. మండల విద్యాధికారి బి. సురేశ్ ఒక ప్రకటనలో ఈ విషయాన్ని తెలిపారు. కార్యక్రమానికి కల్హేర్ ఎంపీడీవో హరి నందన్ రావు ముఖ్య అతిథిగా హాజరై ఉత్తమ ఉపాధ్యాయులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘాల నాయకులు గోవర్ధన్, వంశీకృష్ణ, వినయ్, కృష్ణకుమారి, సంతోష్ కుమార్, కాంప్లెక్స్ హెచ్ఎం సంజీవ్ కుమార్. పలువురు మండల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ అరాచకానికి ప్రజలే బుద్ధి చెబుతారు

- దళితులను అవమానిస్తే భారీ మూల్యం తప్పదు
- బీఆర్ఎస్ అరాచకంపై సంగారెడ్డిలో కాంగ్రెస్ శ్రేణుల నిరసన కార్యక్రమంలో డిసిసి అధ్యక్షురాలు నిర్మలా జగ్గారెడ్డి

సంగారెడ్డి ప్రజా జ్యోతి ప్రతినిధి: అసెంబ్లీ సమావేశాల సందర్భంగా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు వ్యవహరించిన తీరును నిరసిస్తూ సంగారెడ్డి డీసీసీ అధ్యక్షురాలు నిర్మలా జగ్గారెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ శ్రేణులు సంగారెడ్డి పట్టణంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. రామ్‌నగర్‌లోని జగ్గారెడ్డి నివాసం నుంచి పాతబస్టాండ్‌లోని అంబేద్కర్ చౌరస్తా వరకు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ర్యాలీ నిర్వహించారు. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి నిర్మలా జగ్గారెడ్డి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా నిర్మలా జగ్గారెడ్డి మాట్లాడుతూ.. అసెంబ్లీ సమావేశాల సందర్భంగా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు అరాచకం, గూండాయిజానికి పాల్పడ్డారని ఆరోపించారు. అసెంబ్లీలో ప్రజా సమస్యలపై మాట్లాడాల్సిన ప్రజాప్రతినిధులు అందుకు భిన్నంగా వ్యవహరించడం దారుణమన్నారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ఇలాంటి ఘటనలు ఎక్కడా జరగలేదని విమర్శించారు. బీఆర్ఎస్ నేతలు తమకు తామే నెట్టుకుని, పోలీసులపై దాడి చేసి, తిరిగి తామే బాధితులమన్నట్లుగా వ్యవహరించడం సిగ్గుచేటని అన్నారు. దళిత వర్గాన్ని అవమానించేలా బీఆర్ఎస్ నేతలు చేసిన వ్యాఖ్యలు, చర్యలను రాష్ట్ర ప్రజలంతా గమనించారని పేర్కొన్నారు. దళితులు నడిచిన నేలను పసుపు నీళ్లతో శుద్ధి చేయడం బీఆర్ఎస్ పార్టీ కుసంస్కారానికి, అనాగరిక చర్యలకు నిదర్శనమని నిర్మలా జగ్గారెడ్డి మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ప్రజలకు సంక్షేమ పథకాలు అందుతున్న తీరును జీర్ణించుకోలేకే బీఆర్ఎస్ నేతలు అరాచకాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. దళితులను అవమానించే విధంగా వ్యవహరిస్తున్న బీఆర్ఎస్ పార్టీ ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకతను ఎదుర్కోక తప్పదని, ఇందుకు భారీ మూల్యం చెల్లించాల్సి వస్తుందని నిర్మలా జగ్గారెడ్డి హెచ్చరించారు. ఈ నిరసన కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి తోపాజీ అనంత్ కిషన్, మున్సిపల్ చైర్మెన్ కూన వనితా సంతోష్,సిడిసి ఛైర్మెన్ రామ్ రెడ్డి, నాయకులు జార్జ్ ,కిరణ్ గౌడ్, సంతోష్ , శ్రీకాంత్ , రామ్ చందర్ నాయక్ , శ్రీకాంత్ రెడ్డి, సందీప్ రెడ్డి,భూమేష్, తదితరులు పాల్గొన్నారు.

18-55 ఏళ్ల బీసీ మహిళలకు ఉచిత కుట్టు మిషన్ల పంపిణీ

- ఈ నెల 15లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి

సంగారెడ్డి ప్రజా జ్యోతి సెప్టెంబర్ 11:- జిల్లాలోని బీసీ మహిళల ఆర్థిక స్వావలంబనకు ప్రోత్సాహం అందించేందుకు ఇంటింటికి ఇందిరమ్మ కుట్టు మిషన్ల పంపిణీ పథకం కింద ఉచిత కుట్టు మిషన్ల పంపిణీకి అర్హులైన మహిళలు సెప్టెంబర్ 15లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన మహిళలు http://tgobmms.cgg.gov.in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. దరఖాస్తు చేసుకొనుటకు ఈ నెల 15 చివరి తేదీ అని తెలిపారు. దరఖాస్తుదారుల వయస్సు 18 నిండి 55 సంవత్సరాల లోపు ఉండాలని, నిరుద్యోగ మహిళలు, నిరుపేదలు, నిరాధారణకు గురైన వితంతు, ఒంటరి, వికలాంగులు, అనాథ మహిళలకు, టైలరింగ్ ట్రైనింగ్ సర్టిఫికెట్ ఉన్నవారికి ప్రాధాన్యత ఉంటుందని తెలిపారు. నివాసం, కులం, ఆదాయం, ఆధార్, విద్యార్హత, టైలరింగ్ శిక్షణకు సంబంధించిన ధ్రువపత్రాలు, తెల్ల రేషన్ కార్డ్ లేదా ఆహార భద్రత కార్డు కలిగి ఉండాలని, కనీస అక్షరాస్యత తప్పనిసరి అని, ఎక్కువ దరఖాస్తులు వస్తే కనీస విద్యార్హత ఐదవ తరగతి పాసైన వారికి ప్రాధాన్యత ఉంటుందని పేర్కొన్నారు. కుటుంబంలో ఒకరికి మాత్రమే అవకాశం ఉంటుందని, కుటుంబ వార్షిక ఆదాయం గ్రామీణులకు 1.50 లక్షలు, పట్టణ వాసులకు రెండు లక్షల లోపు ఉన్నవారు అర్హులని తెలిపారు. 2023-24 ఆర్థిక సంవత్సరంలో బీసీ స్వయం ఉపాధి పథకం కింద ఆర్థిక లబ్ధి పొందిన వారు అర్హులు కాదని స్పష్టం చేశారు. దరఖాస్తుదారులు దరఖాస్తులను సంబంధిత వెబ్సైట్ నుండి డౌన్లోడ్ చేసుకుని కుల, ఆదాయ, నివాస, ఆధార్ కార్డు, రేషన్ కార్డ్, విద్యార్హతలు, టైలరింగ్ శిక్షణ, అనుభవం తదితర ధ్రువీకరణ పత్రాలతో గ్రామీణులు సంబంధిత మండల పరిషత్ అభివృద్ధి అధికారికి, పట్టణ ప్రాంతవాసులు సంబంధిత మున్సిపల్ కమిషనర్లకు ఈ నెల 15లోగా దరఖాస్తులు సమర్పించాలని కలెక్టర్ సూచించారు.

చలో అసెంబ్లీకి ముందే

లంబాడీ నాయకుల అరెస్టు

- హక్కుల సాధన కోసం పిలుపు..
- తూప్రాన్‌లో పోలీసుల ముందస్తు చర్యలు
- లంబాడి ఐక్యవేదిక మెదక్ జిల్లా అధ్యక్షుడు జైపాల్ నాయక్

తూప్రాన్ (ప్రజాజ్యోతి) సెప్టెంబర్ 11: లంబాడీల హక్కుల కోసం చేపట్టనున్న చలో అసెంబ్లీ కార్యక్రమం నేపథ్యంలో తూప్రాన్ పోలీసులు ముందస్తు చర్యలు చేపట్టారు. కార్యక్రమంలో పాల్గొనే అవకాశం ఉన్న లంబాడీ నాయకులను శుక్రవారం ఉదయం అదుపులోకి తీసుకున్నారు. గిరిజన విద్యార్థి సంఘం ఇచ్చిన పిలుపు మేరకు హైదరాబాద్‌లో నిర్వహించనున్న చలో అసెంబ్లీ కార్యక్రమంలో లంబాడీల ప్రధాన డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు లంబాడి ఐక్యవేదిక మెదక్ జిల్లా అధ్యక్షుడు నాలుగో వార్డ్ కౌన్సిలర్ జైపాల్ నాయక్, నాయకులు సిద్ధమయ్యారు. ఈ నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ పరిస్థితులు తలెత్తకుండా పోలీసులు ముందస్తు అరెస్టులు చేపట్టారు. సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ మందిరాన్ని అడవుల్లో కాకుండా హైదరాబాద్‌లో ఏర్పాటు చేయాలని, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులను విడుదల చేయాలని, గిరిజన విద్యార్థుల స్కాలర్‌షిప్‌లపై అసెంబ్లీలో తీర్మానం చేయాలని డిమాండ్లతో చలో అసెంబ్లీకి పిలుపునిచ్చినట్లు నాయకులు తెలిపారు. ముందస్తు అరెస్టుల్లో తూప్రాన్ మున్సిపల్ నాలుగో వార్డు కౌన్సిలర్, లంబాడీ ఐక్యవేదిక మెదక్ జిల్లా అధ్యక్షుడు రాథోడ్ జైపాల్ నాయక్, దిగావత్ శివ నాయక్ తదితరులు ఉన్నారు.

హైదరాబాద్ జూలాజికల్ పార్క్ యాత్ర

మెదక్ (ప్రజాజ్యోతి) ఎక్స్‌పోజర్ విజిట్ మెదక్ జిల్లాలోని ప్రత్యేక అవసరాలు గల విద్యార్థుల కోసం కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్. రాజు ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని నెహ్రూ జూలాజికల్ పార్క్‌కు ఎక్స్‌పోజర్ విజిట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 63 మంది సిడబ్ల్యూఎస్ఎన్ విద్యార్థులు, 63 మంది తల్లిదండ్రులు, 18 మంది ఐ ఈ ఆర్ పి ఎస్ , 13 మంది కేర్‌గివర్లు, 4 మంది విద్యాశాఖ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు. మొత్తం 148 మంది మూడు బస్సుల్లో హైదరాబాద్‌కు వెళ్లారు. ఈ సందర్భంగా జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్. రాజు మాట్లాడుతూ, ప్రత్యేక అవసరాలు గల పిల్లలు ఇంటి పరిసరాలకే పరిమితం కాకుండా బయట ప్రపంచాన్ని కూడా చూడాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఇలాంటి ఎక్స్‌పోజర్ విజిట్ల ద్వారా పిల్లల్లోని భయం, సంకోచం తగ్గి ఆత్మవిశ్వాసం పెరుగుతుందని చెప్పారు. కొత్త ప్రదేశాలను సందర్శించడం, ఇతర వ్యక్తులను కలవడం ద్వారా వారి సామాజిక నైపుణ్యాలు, ఇతర సామర్థ్యాలు మెరుగుపడతాయని పేర్కొన్నారు. తద్వారా భవిష్యత్తులో పిల్లలు మరింత ధైర్యంగా ముందుకు సాగేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇంక్లూజివ్ ఎడ్యుకేషన్ కోఆర్డినేటర్ కె. రాజు, ఐపిఆర్పిఎస్ కేర్‌గివర్లు, విద్యాశాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అక్కెనపల్లి ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయురాలి డిప్యూటేషన్ రద్దు చేయాలి

- మండల స్పెషల్ ఆఫీసర్ శివరంజనికి వినతిపత్రం అందించిన గ్రామస్తులు

నంగునూరు, సెప్టెంబరు 11 (ప్రజా జ్యోతి):- మండల పరిధిలో ని అక్కినపల్లి గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయురాలిని ఇటీవల ఇతర ప్రాంతానికి బదిలీ చేయడంతో తమ పిల్లల చదువు దెబ్బతింటోందని గ్రామానికి చెందిన తల్లిదండ్రులు, గ్రామ ప్రజలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు శుక్రవారం రోజున మండల స్పెషల్ ఆఫీసర్ శివరంజని కి వినతిపత్రం సమర్పించారు. గతంలో ఉపాధ్యాయులు సెలవులో ఉన్న సమయంలో పాఠశాల నడవడానికి తామే సొంతంగా వాలంటీర్లను ఏర్పాటు చేసుకుని ప్రభుత్వ విద్యను కాపాడుకున్నామని గ్రామస్థులు తెలిపారు. 1వ తరగతి నుండి 5వ తరగతి వరకు ఉన్న విద్యార్థులకు తగిన సంఖ్యలో ఉపాధ్యాయులు లేకపోవడంతో చదువు నిలిచిపోయే పరిస్థితి ఏర్పడిందని వాపోయారు. బదిలీ పై వెళ్లిన ఉపాధ్యాయురాలిని వెంటనే తిరిగి అక్కినపల్లి ప్రాథమిక పాఠశాలకే కేటాయించాలి. ఒకవేళ అది సాధ్యం కాని పక్షంలో, తక్షణమే మరొక అర్హత కలిగిన ఉపాధ్యాయుడిని,ఉపాధ్యాయురాలిని నియమించి విద్యార్థుల చదువుకు ఎలాంటి అంతరాయం కలగకుండా చూడాలి. పాఠశాలను అధికారులు స్వయంగా పరిశీలించి, తగిన చర్యలు తీసుకుని విద్యార్థుల భవిష్యత్తును కాపాడాలని తల్లిదండ్రులు, గ్రామ ప్రజలు , విద్యార్థుల తల్లిదండ్రులు విజ్ఞప్తి చేశారు.

మల్లన్నసాగర్ నిర్వాసితులకు పూర్తిస్థాయి ప్యాకేజీలు అందించాలి

- టీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కొట్టాల యాదగిరి

గజ్వేల్, సెప్టెంబర్ 11 (ప్రజా జ్యోతి): ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం కోసం పోరాడిన నిరుద్యోగులు, సబ్బండ వర్గాల ఆకాంక్షలు నేటికీ పూర్తిస్థాయిలో నెరవేరలేదని టీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు, గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జి కొట్టాల యాదగిరి అన్నారు. గజ్వేల్ మున్సిపాలిటీ పరిధిలోని ఆర్అండ్ఆర్ కాలనీ వేములఘాట్‌లో తెలంగాణ రక్షణ సేన పార్టీ జెండాను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కొట్టాల యాదగిరి మాట్లాడుతూ.. మల్లన్నసాగర్ భూనిర్వాసితుల త్యాగాల ఫలితంగానే రాష్ట్ర ప్రజలకు తాగునీరు అందుతోందన్నారు. అయితే, తమ పుట్టిన ఊరు, సొంత భూములను వదిలి పునరావాస కాలనీల్లో జీవిస్తున్న భూనిర్వాసితుల కన్నీళ్లు తుడిచే పాలకులు లేకపోవడం దురదృష్టకరమని ఆవేదన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం నమ్మించి మోసం చేసిందని, ప్రస్తుత ప్రభుత్వం హామీలు ఇచ్చి మోసం చేస్తోందని ఆయన విమర్శించారు. భూనిర్వాసితులకు ఉపాధి అవకాశాలు లేక ఇబ్బందులు పడుతున్నారని, తమకు రావాల్సిన పునరావాస ప్యాకేజీలను పూర్తిస్థాయిలో అందక అవస్థలు ఎదుర్కొంటున్నారని ఆరోపించారు. అధికారులు కూడా తమ సమస్యలను పరిష్కరించడంలో నిర్లక్ష్యం చేస్తున్నారని పేర్కొన్నారు. తెలంగాణ ఉద్యమ ఆకాంక్షల నుంచి పుట్టిన టీఆర్ఎస్ పార్టీ.. కల్వకుంట్ల కవిత ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ప్రజల పక్షాన పోరాటానికి సిద్ధమవుతోందని కొట్టాల యాదగిరి తెలిపారు. ఉద్యమకారులు, నిరుద్యోగులు, ప్రజలు టీఆర్ఎస్‌కు మద్దతుగా నిలిచి ఉద్యమ ఆకాంక్షల సాధనలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. టీఆర్ఎస్ పార్టీలో ఉద్యమకారులకు ఎల్లప్పుడూ మొదటి ప్రాధాన్యం ఉంటుందని అన్నారు. కార్యక్రమానికి హాజరైన నాయకులు, కార్యకర్తలకు ఆర్అండ్ఆర్ కాలనీలో స్థానిక నేతలు, కార్యకర్తలు డప్పు చప్పుళ్లతో ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో టీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు శ్రావణి, పి. లక్ష్మి, ఎంపీటీసీ నర్సింలు, కూరాకుల శ్రీకాంత్, లింగని రాజు, కనకరాజు, నాంపల్లి, స్వామి, మధు, కుమార్ తదితరులతో పాటు పెద్ద సంఖ్యలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బీజీ-3 పత్తితో ప్రతికూల ప్రభావాలు

- రైతులు మోతాదుకు మించి ఎరువులు వాడొద్దు: శాస్త్రవేత్త డాక్టర్ పల్లవి

కొండపాక, సెప్టెంబర్ 11(ప్రజా జ్యోతి): - బీజీ-3 పత్తి వినియోగంతో ప్రతికూల ప్రభావాలు ఉండే అవకాశం ఉందని తోర్నాల శాస్త్రవేత్త డాక్టర్ పల్లవి తెలిపారు. శుక్రవారం కొండపాక మండలం రవీంద్రనగర్ గ్రామపంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన రైతుల అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. బీజీ-3 పత్తిని అధికంగా, అనుమతి లేకుండా వినియోగిస్తే ఆరోగ్యంపై ప్రభావం పడే అవకాశం ఉందన్నారు. పర్యావరణంపై ప్రభావంతో పాటు నేల, నీరు కలుషితమయ్యే ప్రమాదం ఉందని తెలిపారు. అలాగే మొక్కలు, ఇతర జీవులపై కూడా ప్రతికూల ప్రభావాలు చూపే అవకాశం ఉందన్నారు. అనుమతి లేకుండా బీజీ-3 పత్తిని అధికంగా వినియోగిస్తే చట్టపరమైన చర్యలు తీసుకునే అవకాశం ఉంటుందని హెచ్చరించారు. రైతులు ఎరువులను సిఫారసు చేసిన మోతాదులోనే వినియోగించాలని సూచించారు. ప్రస్తుత వర్షాభావ పరిస్థితుల్లో వివిధ పంటల్లో చేపట్టాల్సిన సస్యరక్షణ చర్యలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు అవగాహన కల్పించి, వారి సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో ఏడీఏ బాబు నాయక్, ఎంఏఓ శివరామకృష్ణ, సర్పంచ్ కోడెల కవిత, వ్యవసాయ విస్తరణ అధికారులు రమ్యశ్రీ, సుస్మిత, మౌనిక, సాత్విక, ఉపసర్పంచ్ కిరణ్‌తో పాటు పలువురు రైతులు పాల్గొన్నారు.

మట్టి గణపతుల సేవలో

రామకోటి రామరాజు కృషి అభినందనీయం

- 22 ఏళ్లుగా మట్టి గణపతుల తయారీ, ఉచిత పంపిణీ
- అదనపు జూనియర్ సివిల్ జడ్జి మన్వీర్

గజ్వేల్, సెప్టెంబర్ 11 (ప్రజా జ్యోతి): మట్టి గణపతుల వినియోగంపై ప్రజల్లో అవగాహన కల్పిస్తూ, పర్యావరణ పరిరక్షణకు శ్రీరామకోటి భక్త సమాజం సంస్థ చేస్తున్న కృషి అభినందనీయమని అదనపు జూనియర్ సివిల్ జడ్జి మన్వీర్ అన్నారు. శుక్రవారం గజ్వేల్‌లోని సరస్వతీ శిశు మందిర్‌లో శ్రీరామకోటి భక్త సమాజం ఆధ్వర్యంలో మట్టి గణపతుల వినియోగంపై అవగాహన కల్పించే కరపత్రాలను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జడ్జి మన్వీర్ మాట్లాడుతూ, శ్రీరామకోటి భక్త సమాజం సంస్థ వ్యవస్థాపకులు రామకోటి రామరాజు గత 22 ఏళ్లుగా మట్టి గణపతులను తయారు చేసి ఉచితంగా పంపిణీ చేయడం ద్వారా పర్యావరణ పరిరక్షణకు విశేష కృషి చేస్తున్నారని కొనియాడారు. ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్‌తో తయారు చేసిన విగ్రహాల వల్ల పర్యావరణానికి కలిగే నష్టాలపై ప్రజలకు అవగాహన కల్పించడం అవసరమన్నారు. ఆర్థిక ఇబ్బందులు ఎదురైనా సేవా సంకల్పాన్ని కొనసాగిస్తూ భక్తితో పాటు పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యత ఇవ్వడం స్ఫూర్తిదాయకమన్నారు. రామకోటి రామరాజు 30 ఏళ్లుగా రామనామ లిఖిత సేవను కొనసాగిస్తూ రామభక్తిని ప్రజల్లోకి తీసుకెళుతున్నారని ప్రశంసించారు. ఆధ్యాత్మిక సేవను సామాజిక బాధ్యతతో మేళవిస్తూ ఆయన చేస్తున్న కృషి ప్రత్యేకంగా అభినందనీయమన్నారు. రామనామ సేవలో అచంచల భక్తిని, మట్టి గణపతుల సేవలో పర్యావరణ స్పృహను చాటుతూ రామకోటి రామరాజు సాగిస్తున్న సేవా ప్రస్థానం సమాజానికి ఆదర్శంగా నిలుస్తుందని జడ్జి మన్వీర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ రాజమౌళి, సామాజిక సమరసత రాష్ట్ర అధ్యక్షులు ఆకుల నరేష్ బాబు, బార్ అసోసియేషన్ అధ్యక్షులు కిరణ్ సాగర్ రావు, సరస్వతీ శిశు మందిర్ ప్రిన్సిపాల్ హరిణి పవన్, నంగునూరి సత్యనారాయణ, సోమేశ్ పంతులు, గాడిపల్లి విజయ్ కుమార్, నర్సింహ చారి తదితరులు పాల్గొన్నారు.

ఎరువులు, విత్తనాల దుకాణాల్లో డీఏఓ తనిఖీలు

- అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు: డీఏఓ స్వరూపరాణి

కొండపాక సెప్టెంబర్ 11(ప్రజా జ్యోతి):- మండలంలోని ఎరువులు, విత్తనాల దుకాణాలను జిల్లా వ్యవసాయ శాఖ అధికారి స్వరూపరాణి శుక్రవారం తనిఖీ చేశారు. ఆయా దుకాణాల్లో ఎరువుల నిల్వలు, విత్తనాల విక్రయాలు, రికార్డులు, రసీదులు, బిల్లులను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా డీఏఓ స్వరూపరాణి మాట్లాడుతూ ఎరువులు, విత్తనాల వ్యాపారులు తప్పనిసరిగా అన్ని రికార్డులను సక్రమంగా నిర్వహించాలని సూచించారు. విత్తనాలు, ఎరువుల నిల్వలు, విక్రయ వివరాలను ఎప్పటికప్పుడు దుకాణాల్లో ఏర్పాటు చేసిన బోర్డులో నమోదు చేయాలన్నారు. ఎరువుల విక్రయాలను ఈ-పాస్ విధానం ద్వారానే చేపట్టాలని స్పష్టం చేశారు. ఎరువులను అధిక ధరలకు విక్రయించినా, ఒక ఎరువుతో పాటు ఇతర ఎరువులను తప్పనిసరిగా కొనుగోలు చేయాలని లింక్ చేసి విక్రయించినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నిబంధనల ప్రకారం ఎరువులు, విత్తనాలను విక్రయించాలని సూచించారు. డీఏఓ తనిఖీల్లో మండల వ్యవసాయ అధికారి శివరామకృష్ణతో పాటు వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

బ్యాంకుల ప్రైవేటీకరణను ఆపేయాలి

- బ్యాంకు ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి
- సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి చొప్పరి రవికుమార్

సిద్దిపేట అర్బన్, సెప్టెంబర్ 11(ప్రజాజ్యోతి):- ప్రభుత్వ రంగ సంస్థలు అయినటువంటి బ్యాంకులను ప్రైవేటీకరించడం సరికాదని ప్రజలకు, వినియోగదారులకి మేలైన సేవలు అందించడానికి బ్యాంకు ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి చొప్పరి రవికుమార్ డిమాండ్ చేశారు. శుక్రవారం నాడు బ్యాంకు ఉద్యోగులు చేస్తున్న ఆల్ ఇండియా జనరల్ స్ట్రైక్ సందర్భంగా సిద్దిపేట జిల్లా కేంద్రంలో నిరసన వ్యక్తం చేస్తున్న బ్యాంకు ఉద్యోగులకు సంఘీభావ ప్రకటించారు. ఈ సందర్భంగా చొప్పరి రవికుమార్ మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం ప్రభుత్వ రంగ సంస్థలను కారు చౌకగా కార్పొరేట్ శక్తులకు అప్పగించడానికి బ్యాంకుల ను విలీనం చేసిందని వాటితో ఏర్పాటు అయినటువంటి లోటులు బ్యాంకు ఉద్యోగులపై భారం వేస్తూ బ్యాంకు ఉద్యోగులు సేవలలో అంతరాయం ని సృష్టించారన్నారు. ప్రభుత్వ రంగ సంస్థల స్థానంలో ప్రైవేటు బ్యాంకులని ప్రోత్సహించాలనే దుర్మార్గ బుద్ధిని వెనక్కి తీసుకోవాలని అన్నారు. బ్యాంక్ ఉద్యోగులు చేస్తున్న డిమాండ్ ల ప్రకారంగా పని గంటలు తగ్గించి పని భారం తగ్గించాలని అలాగే ప్రతి ఉద్యోగికి పేస్కేలు కనుగుణంగా కేటగిరి వారిగా జీతాలను ఇవ్వాలని ప్రజల సొమ్మును ప్రభుత్వాలు నేరుగా రైతులకి, వినియోగదారులకి, ఖాతాదారులకి రుణాలు అందించే విధంగా చూడాలి తప్ప ప్రజల సంపద ను కార్పొరేటు ప్రైవేటు బ్యాంకులకు పెట్టుబడిదారులకి అప్పగించాలని చూడడం సరికాదని అన్నారు. ఇలాంటి విధానాలకు వ్యతిరేకంగా చేస్తున్న స్ట్రైక్ కు సిఐటియు తప్పనిసరిగా మద్దతు తెలుపుతుందని బ్యాంకింగ్ వ్యవస్థను ప్రజల ప్రయోజనాలు కాపాడడానికి చేస్తున్నటువంటి సమ్మెలకు సిఐటియు ఎప్పటికీ వెన్నుదన్నుగా ఉంటుందని అన్నారు. ఈ జనరల్ సమ్మెలోయూనియన్ బ్యాంక్, ఎస్బిఐ, గ్రామీణ బ్యాంకు అన్ని రకాల ప్రభుత్వ బ్యాంకులకు సంబంధించిన ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ రహదారిపై రైతుల రాస్తారోకో

- విద్యుత్ కోతలకు నిరసనగా రైతుల ఆందోళన
- రాస్తారోకోతో హైవే పై భారీగా ట్రాఫిక్ జామ్
- యూరియా కోసం అష్ట కష్టాలు పడుతున్నామని ఆవేదన
- లేదంటే కార్యాలయాలు ముట్టడిస్తామని హెచ్చరిక

మిరుదొడ్డి, సెప్టెంబర్ 11, (ప్రజా జ్యోతి): విద్యుత్ కోతలపై అన్నదాతల ఆగ్రహం వ్యక్తం చేశారు. 14 గంటల విద్యుత్ నిరంతరంగా సరఫరా చేయాలని డిమాండ్ చేస్తూ రోడ్డెక్కి రైతులు ఆందోళన చేపట్టారు. సిద్దిపేట జిల్లా అక్బర్ పేట భూంపల్లి మండలంలో విద్యుత్ కోతలను నిరసిస్తూ శుక్రవారం మండల రైతులు నిరసనగళం విప్పారు. జాతీయ ప్రధాన రహదారిపై ఉన్న కూడవెల్లి వాగు బ్రిడ్జిపై రైతులు భారీ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా బొప్పాపూర్ గ్రామ సర్పంచ్ మాధవనేని భాను ప్రసాద్ మాట్లాడుతూ దుబ్బాక నియోజకవర్గంలో విద్యుత్ కోతల వల్ల పంటలు ఎండిపోతున్నాయని, రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. సమస్యను వెంటనే పరిష్కరించని పక్షంలో త్వరలోనే సిద్దిపేట విద్యుత్ కార్యాలయంతో పాటు, సబ్‌స్టేషన్లను ముట్టడిస్తామని అధికారులను హెచ్చరించారు. మరోవైపు సకాలంలో యూరియా దొరక్క పంటలు కళ్ల ముందే ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులకు సకాలంలో యూరియా అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. రైతుల ధర్నాతో జాతీయ రహదారిపై వాహనాలు భారీగా నిలిచిపోయి ట్రాఫిక్ స్తంభించింది. సమాచారం అందుకున్న భూంపల్లి పోలీసులు వెంటనే ధర్నా స్థలానికి చేరుకుని, రైతులతో మాట్లాడి విద్యుత్ సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇవ్వడంతో రైతులు ధర్నా విరమించారు.

అటవీ కళాశాలలో జాతీయ అటవీ అమరవీరుల దినోత్సవం

ములుగు, సెప్టెంబర్ 11, 2026: ములుగులోని అటవీ కళాశాల మరియు పరిశోధనా సంస్థలో శుక్రవారం జాతీయ అటవీ అమరవీరుల దినోత్సవాన్ని నిర్వహించారు. అడవులు, వన్యప్రాణులు మరియు ప్రకృతి వనరుల పరిరక్షణలో విధి నిర్వహిస్తూ ప్రాణత్యాగం చేసిన అటవీ సిబ్బందికి ఈ సందర్భంగా ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కళాశాల డీన్ శ్రీమతి బి. ప్రవీణ, ×ఖీూ మాట్లాడుతూ జాతీయ అటవీ అమరవీరుల దినోత్సవం నిర్వహణ వెనుక ఉన్న నేపథ్యం, ప్రాధాన్యతను వివరించారు. అడవులు, వన్యప్రాణులు మరియు సహజ వనరుల పరిరక్షణలో ఫారెస్ట్ గార్డులు మరియు ఇతర అటవీ క్షేత్రస్థాయి సిబ్బంది పోషిస్తున్న కీలక పాత్రను, వారి అంకితభావాన్ని వివరించారు. ఇటీవల విధి నిర్వహణలో మృతి చెందిన అటవీ సిబ్బందిని స్మరించుకుంటూ డీన్, అధ్యాపకులు మరియు విద్యార్థులు నివాళులు అర్పించారు. అటవీ, వన్యప్రాణుల సంరక్షణ కోసం అటవీ అమరవీరుల త్యాగాలను స్ఫూర్తిగా తీసుకోవాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.

ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించిన సర్పంచ్ పంజా స్వామి

దౌల్తాబాద్, సెప్టెంబర్ 11 (ప్రజాజ్యోతి) ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించిన సర్పంచ్ పంజ స్వామి . శుక్రవారం మండల పరిధిలోని గాజులపల్లి పాఠశాలను తనిఖీ చేసి మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన ప్రకారం విద్యార్థులకు రుచికరమైన భోజనాన్ని అందించాలని తెలియజేశారు. ఉపాధ్యాయులు పాఠశాలకు సమయానికి వచ్చి విద్యార్థులకు విద్యాబోధన చేయాలని ఉపాధ్యాయులకు తగు సూచనలను చేశారు. విద్యార్థులు విద్యతోపాటు క్రీడారంగంలో కూడా ముందుండి మంచి విద్యను అభ్యసించినప్పుడే పాఠశాలకు తల్లిదండ్రులకు మంచి పేరు లభిస్తుందని తెలియజేశారు. విద్యార్థులు ఇష్టంతో కష్టపడి చదువుకొని బావి భారత పౌరులుగా ఎదగాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ప్రేమ కుమార్, స్కూల్ డెవలప్మెంట్ కమిటీ మెంబర్ కుమ్మరి నరేష్ ,మదారి సురేష్, పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

కమ్యూనిటీ హాళ్ల అభివృద్ధికి రూ.8.50 కోట్లు

- వార్డు 2, 7లకు నిధులు కేటాయింపుపై ఎమ్మెల్యే శ్రీగణేష్‌కు ప్రజల కృతజ్ఞతలు

బోయిన్ పల్లి, సెప్టెంబర్ 11.(ప్రజా జ్యోతి) : కంటోన్మెంట్ నియోజకవర్గ పరిధిలోని 28 కమ్యూనిటీ హాళ్ల నిర్మాణం, అసంపూర్తి పనుల పూర్తి,మరమ్మతులు, అదనపు సౌకర్యాల కోసం ప్రభుత్వం మంజూరు చేసిన రూ.8.50 కోట్ల నిధుల్లో వార్డు 7లోని చిన్న కమేళా, పెద్ద కమేళా, సెంట్రల్ బ్యాటరీ, వార్డు 2లోని కట్ట మైసమ్మ ఆలయ ప్రాంత కమ్యూనిటీ హాళ్లకు నిధులు కేటాయించడంపై ఆయా ప్రాంతాల ప్రజలు ఎమ్మెల్యే శ్రీగణేష్‌ను కలిసి ధన్యవాదాలు తెలిపారు.ఈ నిధులతో అసంపూర్తి పనులు పూర్తి చేయడంతో పాటు అవసరమైన చోట అదనపు గదులు, మరుగుదొడ్లు, ఇతర మౌలిక సదుపాయాలు కల్పించనున్నట్లు తెలిపారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీగణేష్ మాట్లాడుతూ కంటోన్మెంట్‌లో ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించడమే తన లక్ష్యమని, ప్రతి వార్డులో ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులు చేపడతామని అన్నారు. నిధుల మంజూరుకు సహకరించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి పొన్నం ప్రభాకర్, మంత్రి శ్రీధర్ బాబుతో పాటు అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ ప్రాధాన్యత ఇవ్వాలి

- గణపతి పండుగలను భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలి
- శంషాబాద్ జిహెచ్ఎంసి జోనల్ కమిషనర్ చంద్రకళ
- శంషాబాద్ జోనల్ కార్యాలయంలో మట్టి గణపతులను పంపిణీ చేసిన జోనల్ కమిషనర్ చంద్రకళ

రాజేంద్రనగర్, సెప్టెంబర్ 11 (ప్రజా జ్యోతి) : పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ ప్రాధాన్యత ఇవ్వాలని శంషాబాద్ జిహెచ్ఎంసి జోనల్ కమిషనర్ చంద్రకళ పేర్కొన్నారు. పర్యావరణ పరిరక్షణను ప్రోత్సహిస్తూ, వినాయక చవితి వేడుకలను పర్యావరణహితంగా నిర్వహించాలనే ఉద్దేశంతో శంషాబాద్ జోనల్ కమిషనర్ కుమారి కె. చంద్రకళ, శంషాబాద్ సర్కిల్-18 డిప్యూటీ కమిషనర్ సుమన్ రావు సమక్షంలో శుక్రవారం గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని శంషాబాద్ జోనల్ కార్యాలయంలో పర్యావరణహిత గణేష్ మట్టి విగ్రహాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పండుగలను భక్తిశ్రద్ధలతో జరుపుకోవడంతో పాటు పర్యావరణ పరిరక్షణకు కూడా ప్రతి ఒక్కరూ ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. పర్యావరణానికి హాని కలిగించే ప్లాస్టర్ ఆఫ్ పారిస్, రసాయనాలతో తయారు చేసిన విగ్రహాలకు బదులుగా మట్టి మరియు ఇతర పర్యావరణహిత గణేష్ విగ్రహాలను వినియోగించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.గణేష్ విగ్రహాల నిమజ్జనం సందర్భంగా నీటి కాలుష్యాన్ని నివారించేందుకు ప్రజలు పర్యావరణహిత విధానాలను పాటించాలని, పరిశుభ్రమైన మరియు పచ్చని వాతావరణం కోసం ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలని అధికారులు పిలుపునిచ్చారు.

పర్యావరణ పరిరక్షణపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించిన గ్రీన్ ఎర్త్ ఇంటిగ్రేటెడ్ ఫెసిలిటీ ప్రతినిధి నాగరాజ్‌ను అధికారులు అభినందించారు. ఇలాంటి పర్యావరణహిత కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమం ద్వారా పర్యావరణాన్ని కాపాడుతూ పండుగను ఆనందంగా జరుపుకుందాం అనే సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లారు. ఈ కార్యక్రమంలో జిహెచ్ఎంసి అధికారులు, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

కొత్తూరు బస్సును పునరుద్ధరించాలని తాండూరు డిపో మేనేజర్‌ను కలిసిన ప్రజాసంఘాలు

తాండూరు సెప్టెంబర్ 11 ప్రజా జ్యోతి : తాండూర్ బస్సు డిపో నుంచి గత కొన్నేళ్ళుగా కొత్తూరు గ్రామానికి బస్సు సర్వీస్ క్రమం తప్పకుండా రావడంతో పాటు రాత్రి వేళ (నైట్ హల్ట్) బస్సు సర్వీస్ ఉండేదని ప్రజా సంఘాలతో పాటు ఆ గ్రామా సర్పంచ్ గుర్తు చేశారు. ఇట్టి బస్సు సర్వీసును మరల పునరుద్ధరించాలని కోరుతూ తాండూరు బస్ డిపో మేనేజర్ ప్రవీణ్ కుమార్‌కు వినతిపత్రం సమర్పించి నట్లు ప్రజా సంఘాల నాయకులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి శ్రీనివాస్, ఎస్సి,ఎస్టి,బిసి,మైనార్టి హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు కొత్తూరు చంద్రయ్య లు మాట్లాడుతూ ప్రతి రోజు ఉదయం సమయంలో వివిధ పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే విద్యార్థులకు ఈ బస్సు సౌకర్యం ఎంతో ఉపయోగపడేదని చెప్పారు. బొంరాస్ పేట్ మండలంలోని పలు గ్రామాలకు ఎంతో ఉపయోగకరంగా ఉండేద న్నారు. కొత్తూరు మీదుగా వాడిచర్ల గ్రామానికి ఉదయం సాయంత్రం వేళలో కొనసాగించాలని అప్పట్లో వినతిపత్రం సమర్పించామని చెప్పారు. బస్సు డీపో మేనేజర్ (డిఎం) ఇట్టి సమస్యను ఆయా గ్రామాలకు చెందిన విద్యార్థులు,ప్రజలతో రాస్తారోకో నిర్వహిస్తామని హెచ్చరించారు. తాండూరు డీపో మేనేజర్ ను కలిసిన వారిలో కొత్తూరు సర్పంచ్ కె లక్ష్మయ్య, హన్మయనాయక్ తండా సర్పంచ్ సోమ్లానాయక్ ఎనమిని తండా సర్పంచ్ డాక్యానాయక్, ఉప్పసర్పంచ్ హన్మయనాయక్, వాడిచర్ల సర్పంచ్ గోపాల్ రెడ్డి, దేవనూరు సర్పంచ్ తదితరులు పాల్గొన్నారు.

సెప్టెంబర్ 12, 13న పరిగి నియోజకవర్గంలో

ప్రత్యేక ఓటరు నమోదు ప్రచారం

- పోలింగ్ కేంద్రాల్లో హెల్ప్‌డెస్కులు ఏర్పాటు
-- బీఎల్‌వోలు, సూపర్‌వైజర్లు తప్పనిసరిగా హాజరు కావాలని ఈఆర్‌వో ఆదేశాలు

పరిగి, సెప్టెంబర్ 11 (ప్రజాజ్యోతి) : జిల్లా కలెక్టర్ ఉ జిల్లా ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు పరిగి నియోజకవర్గ పరిధిలో ఈ నెల 12, 13 తేదీలలో రెండవ విడత ప్రత్యేక ఓటరు నమోదు ప్రచారం నిర్వహించనున్నట్లు ఎన్నికల నమోదు అధికారి తెలిపారు. ఈ సందర్భంగా అన్ని పోలింగ్ కేంద్రాల్లో హెల్ప్‌డెస్కులను ఏర్పాటు చేసి ఓటర్లకు అవసరమైన సేవలు అందించనున్నట్లు పేర్కొన్నారు.

ప్రత్యేక ప్రచార కార్యక్రమంలో భాగంగా అన్ని పోలింగ్ కేంద్రాల్లో బీఎల్‌వోలు, సూపర్‌వైజర్లు తమకు కేటాయించిన కేంద్రాల్లో తప్పనిసరిగా హాజరై విధులు నిర్వహించాలని ఆదేశించారు. ఓటర్ల నుంచి ఫారం-6, ఫారం-7, ఫారం-8 దరఖాస్తు లను స్వీకరించి వెంటనే డిజిటలైజ్ చేయాలని సూచించారు. అలాగే బూత్ లెవల్ ఏజెంట్ల (బీఎల్ఏలు) సహకారంతో ముసాయిదా ఓటరు జాబితాలో అవసరమైన సవరణలను గుర్తించాలని పేర్కొన్నారు. ప్రచార కార్యక్రమాల సందర్భంగా తీసిన ఫోటోలు, వీడియోలను వెంటనే సంబంధిత వాట్సాప్ గ్రూపుల్లో పంపించాలని ఆదేశించారు. ముందస్తు లిఖితపూర్వక అనుమతి లేకుండా ఎలాంటి సెలవులు తీసుకోరాదని, హెడ్‌క్వార్టర్స్‌ను విడిచి వెళ్లరాదని స్పష్టం చేశారు. విధుల్లో నిర్లక్ష్యం వహించినా లేదా గైర్హాజరైన పక్షంలో ప్రజాప్రాతినిధ్య చట్టం ప్రకారం కఠిన క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని ఎన్నికల నమోదు అధికారి హెచ్చరించారు.

గణేష్ ఉత్సవాల ఏర్పాట్లపై

అధికారులు అప్రమత్తంగా ఉండాలి

- శాంతి భద్రతల పరిరక్షణకు పోలీస్ శాఖ నిరంతరం నిఘా పెట్టాలి
- ప్రజా ప్రతినిధులు మంటపాల నిర్వాహకులు సహకరించాలి
- తాండూరు ఆర్డీఓ కర్ర అనిత
- తాండూర్ డి.ఎస్.పి నర్సింగ్ యాదయ్య

తాండూరు సెప్టెంబర్ 11 ప్రజా జ్యోతి : ఈ నెల 14న జరుపుకునే వినాయక చవితి ఉత్సవాలతో పాటు నిమజ్జనోత్సవ కార్యక్రమాలను పోలీస్ శాఖ నియంత్రణలో అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసే ప్రశాంతంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని తాండూరు ఆర్డీవో కర్ర అనిత సూచించారు.శుక్రవారం రోజు తాండూరు రెవిన్యూ డివిజన్ (ఆర్డీఓ) అధికారి కర్ర అనిత అధ్యక్షతన ప్రత్యేక పీస్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో తాండూర్ ఆర్డీవో అనిత, డి.ఎస్.పి నర్సింగ్ యాదయ్య లు మాట్లాడుతూ తాండూరు సబ్ డివిజన్ పరిధిలో నిర్వహించనున్న గణేష్ ఉత్సవాలు ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా ప్రశాంత వంతమైన వాతావరణంలో జరిగేలా ముందస్తు చర్యలు చేపట్టడం కోసం ఈ సమావేశం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.

ముఖ్యంగా రెవెన్యూ, పోలీస్, మున్సిపల్, ఆర్ అండ్ బి, ఇరిగేషన్, విద్యుత్ శాఖ తదితర శాఖల అధికారులతో గణేష్ ఉత్సవాల నిర్వహణకు సంబంధించి చేపట్టాల్సిన ఏర్పాట్లపై సమీక్షించారు. గణేష్ మండపాల ఏర్పాటు, నిమజ్జన కార్యక్రమాలు, ట్రాఫిక్ నియంత్రణ, విద్యుత్ సరఫరా, పారిశుధ్యం, తాగునీటి సౌకర్యం, భక్తులకు అవసరమైన మౌలిక వసతులు వంటి అంశాలపై శాఖల వారీగా చర్చించారు. గణేష్ ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో పాటు ప్రశాంత వాతావరణంలో విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. ఉత్సవాల సందర్భంగా ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు ప్రణాళికతో తగిన ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులకు సూచించారు.

ప్రధాన కూడళ్లు, గణేష్ మండపాలు, నిమజ్జన మార్గాల్లో అవసరమైన ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. నిమజ్జనం సందర్భంగా ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా చర్యలు చేపట్టడంతో పాటు, ప్రజల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని పేర్కొన్నారు. విద్యుత్ వైర్లు, పారిశుధ్యం, రహదారులు, తాగునీరు తదితర అంశాల్లో ఎలాంటి లోపాలు లేకుండా సంబంధిత శాఖలు ముందస్తుగా చర్యలు తీసుకోవాలని సూచించారు. గణేష్ ఉత్సవాలు సామరస్యానికి ప్రతీకగా నిలిచేలా నిర్వాహకులు, భక్తులు అధికారులకు సహకరించాలని కోరారు. ప్రజలు, ఉత్సవ కమిటీలు నిబంధనలను పాటిస్తూ ఉత్సవాలను విజయవంతం చేయాలని సూచించారు. ఈ సమావేశంలో మున్సిపల్ చైర్ పర్సన్ నీరజ బాల్ రెడ్డి , సిఐలు ప్రవీణ్ కుమార్ రెడ్డి, పరమేష్, మున్సిపల్ కమిషనర్ రాకేష్ రెడ్డి, ఆర్ అండ్ బి డి ఈ శ్రావణ్ కుమార్, విద్యుత్ డి ఈ, ఏఈ, వైద్య, ఎక్సైజ్, అటవీ, మత్స్య శాఖల అధికారులు, అలాగే తాండూర్ తహసిల్దార్ తార సింగ్, ఆయా మండలాకు ఎంపీడీవో లు తదితరులు పాల్గొన్నారు.

కొత్తపల్లి ఇంటి కాంపౌండ్‌లోనే విద్యుత్ స్తంభం..

అధికారుల మౌనం!

చౌడాపూర్ మండల్ (ప్రజా జ్యోతి) సెప్టెంబర్ 11 : వికారాబాద్ జిల్లా చౌడాపూర్ మండల కేంద్ర పరిధిలోని కొత్తపల్లి గ్రామంలో ఇంటి కాంపౌండ్ నిర్మాణం విషయంలో విద్యుత్ స్తంభం చుట్టూ వివాదం నెలకొంది. ఇంటి కాంపౌండ్‌కు ముందుగానే కొన్ని సంవత్సరాలుగా ఉన్న విద్యుత్ స్తంభాన్ని రోడ్డుకు వదిలి నిర్మాణం చేపట్టాల్సి ఉండగా, స్తంభాన్ని కాంపౌండ్‌లోనే ఉంచి నిర్మాణ పనులు పూర్తి చేసినట్లు గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఇలా విద్యుత్ స్తంభం కాంపౌండ్‌లో భాగంగా మారడంతో భవిష్యత్తులో విద్యుత్ నిర్వహణ, మరమ్మతులు చేపట్టే సమయంలో ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొన్ని సంవత్స రాలుగా ఈ పరిస్థితి కొనసాగుతున్నప్పటికీ విద్యుత్ శాఖ అధికారులు,గ్రామ పంచాయతీ సిబ్బంది చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా ఇలా నిర్మాణం ఎలా పూర్తయిందని వారు ప్రశ్నిస్తున్నారు.

విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్యమా?

గ్రామపంచాయతీ అధికారుల నిర్లక్ష్యమా?

విద్యుత్ స్తంభాన్ని కాంపౌండ్‌లోకి తీసుకుని నిర్మాణం చేపట్టడానికి అనుమతులు ఉన్నాయా?

నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణం జరిగితే ఇన్నేళ్లుగా అధికారులు ఎందుకు చర్యలు తీసుకోలేదనే ప్రశ్నలు స్థానికంగా వినిపిస్తు న్నాయి. ఈ విషయంపై సంబంధిత విద్యుత్ శాఖ అధికారులు, గ్రామపంచాయతీ అధికారులు స్పందించి వాస్తవాలను వెల్లడించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

భూముల రీ సర్వేకు అందరూ సహకరించాలి

- చిట్టిఘనాపూర్ గ్రామ ప్రజలతో ప్రత్యేక సమీక్ష
- భూ భారతి భూ సర్వేతో శాశ్వత పరిష్కారం
- జిల్లా అదనపు కలెక్టర్ వెంకటాచారి
- జిల్లా సర్వే అధికారి మధుసూదన్

తాండూరు సెప్టెంబర్ 11 ప్రజా జ్యోతి : వికారాబాద్ జిల్లా తాండూరు మండలం చిట్టి ఘనాపూర్ గ్రామంలో రైతులతో ప్రత్యేక సమీక్ష సమావేశాన్ని గ్రామ సర్పంచ్ పటేల్ విజయ్ కుమార్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా అదనపు కలెక్టర్ వెంకటాచారి, జిల్లా సర్వే అధికారి మధుసూదన్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆదనపు కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నో తరాలుగా భూ సమస్యలతో ఇబ్బందులు పడుతున్న రైతులు, ప్రజలకు భూముల రీ సర్వే తో శాశ్వత పరిష్కారం కానున్నాయని చెప్పారు. గ్రామంలో మొత్తం 816 ఎకరాల విస్తీర్ణం భూమి ఉండగా అందులో 98 సర్వే నంబర్లు ఉన్నట్లు గుర్తించామని చెప్పారు. సర్వే నెంబరు వారిగా గుర్తించి హద్దులు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ రీ సర్వే చేయడంతో భూ తగాదాలకు చెక్ పెట్టడంతోపాటు శాశ్వత పరిష్కారం లభిస్తుందని స్పష్టం చేశారు. ఇట్టి రీ సర్వే లో స్థానిక మండల సర్వేయర్ తో పాటు జిల్లా సర్వే అధికారులు స్థానిక తహసీల్దార్, రెవెన్యూ ఇన్స్పెక్టర్,జిపిఓ, దరిద్ర శాఖల అధికారుల నేతృత్వంలో భూముల సర్వే కార్యక్రమం నిర్వహించనున్నట్లు చెప్పారు. ఇట్టి రీ సర్వే కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు రాజకీయాలకు అతీతంగా గ్రామానికి చెందిన రైతులు ప్రజలు అందరూ సహకరించాలని కోరారు. భూభారతి భూ సర్వే చేసే సమయంలో ముందుగానే చాటింపు వేసి ప్రజలందరినీ అప్రమత్తంగా ఉండేటట్లు ప్రణాళిక సిద్ధం చేస్తామని సూచించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ వడ్ శ్రీనివాస్, మాజీ ఎంపీపీ శరణు బసప్ప, పలు గ్రామాల సర్పంచులు రాజ్ కుమార్, నారాయణ, స్థానిక నాయకులు ప్రభాకర్ రెడ్డి, రెవెన్యూ అధికారులు, పంచాయతీ కార్యదర్శి అమరేశ్వరి, స్థానిక రైతులు తదితరులు ఉన్నారు.

రూప్ ఖాన్‌పేట్‌లో 226, 227, 228 పోలింగ్ కేంద్రాలపై విచారణ పూర్తి

పరిగి, సెప్టెంబర్ 11 (ప్రజాజ్యోతి): పరిగి అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని పరిగి మండలం రూపఖాన్‌పేట్ గ్రామంలోని పోలింగ్ కేంద్రాలు నంబర్ 226, 227, 228కు సంబంధించి చేపట్టిన విచారణ ప్రక్రియ శుక్రవారం ముగిసిందని ఏఇఆర్ఓ, డిప్యూటీ తహసీల్దార్ విజయేందర్ తెలిపారు. అదేవిధంగా సంబంధిత అంశాలపై విచారణ నిర్వహించి, ప్రక్రియను పూర్తి చేసినట్లు తెలిపారు. ఎన్నికల ప్రక్రియలో భాగంగా చేపట్టిన ఈ విచారణకు సంబంధించిన వివరాలను ఉన్నతాధికారులకు నివేదించనున్నట్లు తెలిపారు.

స్పీకర్ గడ్డం ప్రసాద్‌పై ఎమ్మెల్సీ తాతా మధు, నరేష్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై తీవ్రంగా ఖండిస్తున్నాం

బషీరాబాద్ ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు పోశమొల్ల శ్యామ్

బషీరాబాద్ సెప్టెంబర్ 11 ప్రజా జ్యోతి : బషీరాబాద్ ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు శ్యామ్ పోశమొల్ల శ్యామ్ ఒక ప్రకటనలో మాట్లాడుతూ తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌పై ఎమ్మెల్సీలు తాతా మధు, నరేష్ రెడ్డి చేసిన కులపరమైన, అవమానకర వ్యాఖ్యలను ఎమ్మార్పీఎస్ తరఫున తీవ్రంగా ఖండించారు. రాజకీయ విమర్శల పేరుతో దళిత నాయకుడిని అవమానించడం యావత్ దళిత సమాజం ఆత్మగౌరవాన్ని కించపరచడమేనని పేర్కొన్నారు. ఇలాంటి కుల వివక్ష వ్యాఖ్యలు పునరావృతం కాకుండా తాతా మధు, నరేష్ రెడ్డిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కులరహిత సమాజ నిర్మాణంలో ఎమ్మార్పీఎస్ ఎల్లప్పుడూ ముందుంటుందని, దళితుల ఆత్మగౌరవాన్ని కించపరిచే చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని స్పష్టం చేశారు. సమాజంలో కుల వివక్షకు ఎలాంటి చోటు ఉండకూడదని పిలుపునిచ్చారు.

అరెస్టులు ఆపాలి.. హామీలు అమలు చేయాలి

- బిఆర్ఎస్ పార్టీ మండల యూత్ అధ్యక్షుడు కడల శ్రీశైలం
- బిఆర్ఎస్ నాయకుడు కడల శ్రీశైలం ముందస్తు అరెస్ట్

కొత్తూరు సెప్టెంబర్ 11 (ప్రజా జ్యోతి) : అసెంబ్లీ సమావేశాల నేపథ్యంలో ప్రతిపక్ష బిఆర్ఎస్ ఎమ్మెల్యేలను అసెంబ్లీలో అనుమతించకుండా ప్రభుత్వం పోలీసులతో అక్రమంగా అరెస్టు చేయించడం అప్రజాస్వామికమని బిఆర్ఎస్ పార్టీ మండల యూత్ అధ్యక్షుడు కడల శ్రీశైలం అన్నారు.చలో అసెంబ్లీ ముట్టడి కార్యక్రమం నేపథ్యంలో బిఆర్ఎస్ పార్టీ మండల యూత్ అధ్యక్షుడు కడల శ్రీశైలం ను ఈరోజు ఉదయం పోలీసులు అక్రమంగా అరెస్టు చేసి స్టేషన్కు తరలించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రజల పక్షాన ప్రజల హక్కుల కోసం పోరాటం చేసే ప్రతిపక్ష ఎమ్మెల్యేలను అసెంబ్లీకి వెళ్లకుండా అడ్డుకోవడం రాజ్యాంగ విరుద్ధమని ఆయన అన్నారు.

అన్‌హైప్' స్కిన్‌కేర్ బ్రాండ్ ప్రారంభించిన విజయ్ దేవరకొండ

హైదరాబాద్, సెప్టెంబర్ 11 (ప్రజా జ్యోతి) : భారతీయ వాతావరణం, ఎండ, తేమ, కాలుష్యం, చెమట, హార్డ్ వాటర్‌ను దృష్టిలో పెట్టుకుని నటుడు విజయ్ దేవరకొండ సహ వ్యవస్థాపకుడిగా 'అన్‌హైప్' స్కిన్‌కేర్ బ్రాండ్‌ను ప్రారంభించినట్లు ఆ సంస్థ ప్రతినిధులు శుక్రవారం నగరంలో విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వారు మాట్లాడుతూ 'నో బీఎస్ ఓన్లీ వాట్ వర్క్స్' నినాదంతో యువతను లక్ష్యంగా చేసుకుని శాస్త్రీయ ఆధారిత, పారదర్శకమైన స్కిన్‌కేర్ ఉత్పత్తులను అందిస్తున్నట్లు తెలిపారు. విజయ్ దేవరకొండ తొమ్మిది నెలల పాటు ఉత్పత్తుల అభివృద్ధిలో స్వయంగా పాల్గొని, వివిధ ఫార్ములేషన్లను పరీక్షించినట్లు పేర్కొన్నారు. ఆన్‌లైన్-ఫస్ట్ విధానంలో ప్రారంభమైన అన్‌హైప్ ఉత్పత్తులకు సెప్టెంబర్ 11న ప్రీ-బుకింగ్ ప్రారంభమై, సెప్టెంబర్ 21 నుంచి షిప్‌మెంట్లు మొదలు కానున్నాయని తెలిపారు.

48వ డివిజన్‌లో ఉచిత వైద్య శిబిరం

ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభించిన మేయర్

కరీంనగర్ బ్యూరో, సెప్టెంబర్ 11 (ప్రజాజ్యోతి)
నగర ప్రజలకు మెరుగైన వైద్య సేవలను అందుబాటులోకి తీసుకురావడంతో పాటు, ఆరోగ్యంపై అవగాహన కల్పించేందుకు నిర్వహిస్తున్న ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ అన్నారు.
నగరంలోని 48వ డివిజన్‌లో స్థానిక కార్పొరేటర్ కర్రె పద్మ అనిల్ ఆధ్వర్యంలో, అపోలో

రీచ్ హాస్పిటల్ వారి సహకారంతో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ ప్రారంభించారు.ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూప్రజల ఆరోగ్య పరిరక్షణకు వైద్య శిబిరాలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని అన్నారు. ముఖ్యంగా పేద, మధ్యతరగతి కుటుంబాలకు నాణ్యమైన వైద్య సేవలను ఉచితంగా అందించడం అభినందనీయమన్నారు. ప్రజలు తమ ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేయకుండా ఎప్పటికప్పుడు వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు.నగరంలో ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలతో పాటు ఆరోగ్య పరిరక్షణకు కూడా ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నామని మేయర్ తెలిపారు. స్వచ్ఛంద సంస్థలు, ప్రైవేట్ ఆసుపత్రులు, వైద్యులు ముందుకు వచ్చి మరిన్ని ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించడం ద్వారా ప్రజలకు మరింత ప్రయోజనం చేకూరుతుందని అన్నారు.ఈ వైద్య శిబిరంలో వైద్యులు ప్రజలకు వివిధ ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వైద్య సలహాలు మరియు సూచనలు అందించారు.ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు గాజ రమా శివరాం, ఎన్నం లక్ష్మీ ప్రకాష్, నాయకులు ఉప్పరపల్లి శ్రీనివాస్, పర్వతం మల్లేశం, అపోలో రీచ్ హాస్పిటల్ సిబ్బంది, డివిజన్ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

పట్టుదల.. అంకితభావం.. కఠోర శ్రమే విజయానికి సోపానాలు

నగర మేయర్ కొలగాని శ్రీనివాస్

కరీంనగర్ బ్యూరో, సెప్టెంబర్ 11 (ప్రజాజ్యోతి)
పట్టుదల, అంకితభావం, కఠోర శ్రమతో నిర్దేశించుకున్న లక్ష్యాలను సాధించి జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని కరీంనగర్ నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ అన్నారు.కరీంనగర్ జిల్లా కేంద్రంలోని వివేకానంద డిగ్రీ మరియు పీజీ కళాశాలలో "నా

దేశం – నా జాతి – నా బాధ్యత" అనే అంశంపై వ్యక్తిత్వ నిర్మాణ ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. నేషనల్ యూత్ ప్రాజెక్ట్ సౌజన్యంతో నిర్వహించిన ఈ కార్యక్రమానికి నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ ముఖ్యఅతిథిగా హాజరై విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ, 1893 సెప్టెంబర్ 11న అమెరికాలోని చికాగో నగరంలో జరిగిన సర్వమత సమ్మేళనంలో స్వామి వివేకానంద చేసిన చారిత్రాత్మక ప్రసంగం ప్రపంచవ్యాప్తంగా భారతదేశ ఔన్నత్యాన్ని చాటిందన్నారు. స్వామి వివేకానంద చూపిన మార్గం నేటి యువతకు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు.
విద్యార్థులు స్వామి వివేకానంద బోధనలు, ఆధ్యాత్మిక సందేశాలను ఆదర్శంగా తీసుకుని క్రమశిక్షణ, పట్టుదల, అంకితభావం, కఠోర శ్రమతో ముందుకు సాగాలని సూచించారు. ప్రతి విద్యార్థి ఉన్నతమైన విలువలు, భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను గౌరవిస్తూ బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదగాలని పిలుపునిచ్చారు.
దేశ భవిష్యత్తు యువత చేతుల్లోనే ఉందని, విద్యార్థులు తమలోని ప్రతిభను గుర్తించి వివిధ నైపుణ్యాలను పెంపొందించుకోవడంతో పాటు సమాజం, దేశ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని మేయర్ ఆకాంక్షించారు.జిల్లా యువజన అధికారి జి. తిరుపతి రెడ్డి మాట్లాడుతూ ప్రతి విద్యార్థి విద్యతో పాటు వివిధ నైపుణ్యాలను అభివృద్ధి చేసుకుని, సన్మార్గంలో నడుస్తూ ఉత్తమ పౌరులుగా ఎదగాలని సూచించారు.కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సిహెచ్. శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యార్థుల్లో వ్యక్తిత్వ వికాసం, దేశభక్తి, సామాజిక బాధ్యతను పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఏసీఓ బి. సంపత్ కుమార్, ఏవో బి. శ్రావణ్ కుమార్, కామర్స్ విభాగాధిపతి డాక్టర్ ఆర్. గోపికృష్ణ, నేషనల్ యూత్ ప్రాజెక్ట్ బాధ్యులు కె. యాదవరాజు, ఎం.డి. తాహర్ పాషా, అధ్యాపక బృందం, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

కేజీబీవీ విద్యార్థులకు కంటి పరీక్షలు

అవసరమైన వారికి ఉచితంగా కళ్లద్దాల పంపిణీ

కరీంనగర్ బ్యూరో , సెప్టెంబర్ 11 (ప్రజాజ్యోతి):
విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణలో భాగంగా కరీంనగర్ జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమం ద్వారా సప్తగిరి కాలనీలోని కేజీబీవీ పాఠశాలలో విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించారు. కంటి చూపు సమస్యలు ఉన్న విద్యార్థులను గుర్తించి వారికి ఉచితంగా కళ్లద్దాలను పంపిణీ చేశారు.
ఈ సందర్భంగా జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ రాజగోపాల్ రావు కేజీబీవీ పాఠశాలను సందర్శించి కార్యక్రమాన్ని పరిశీలించారు. విద్యార్థులు ఆరోగ్యంగా ఉండటంతో పాటు చదువులో రాణించేందుకు కంటి ఆరోగ్యం ఎంతో ముఖ్యమని ఆయన అన్నారు. విద్యార్థులకు ఎప్పటికప్పుడు ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తూ అవసరమైన వైద్య సేవలను అందిస్తున్నామని తెలిపారు.ఆర్ బి ఎస్ కె ద్వారా చిన్నారులు, విద్యార్థుల్లో వివిధ ఆరోగ్య సమస్యలను ప్రారంభ దశలోనే గుర్తించి చికిత్స అందిస్తున్నట్లు పేర్కొన్నారు. కంటి చూపు సమస్యలను గుర్తించి అవసరమైన విద్యార్థులకు ఉచితంగా కళ్లద్దాలు అందజేస్తున్నామని తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ శైలేందర్, ఆర్ బి ఎస్ కె సిబ్బంది, సప్తగిరి కాలనీ వైద్యాధికారి, పాఠశాల సిబ్బంది, ప్రాథమిక ఆరోగ్య శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వం సెప్టెంబర్ 17ను అధికారికంగా నిర్వహించాలి

బీజేపీ జిల్లా అధ్యక్షుడు సాయిని మల్లేశం

కరీంనగర్ టౌన్, సెప్టెంబర్ 11 (ప్రజాజ్యోతి)
నిజాం నిరంకుశ పాలన, రజాకార్ల రాక్షస కాండ నుండి తెలంగాణ విముక్తి పొందిన చారిత్రక దినమైన సెప్టెంబర్ 17ను రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా, ఘనంగా నిర్వహించాలని భారతీయ జనతా పార్టీ కరీంనగర్ జిల్లా అధ్యక్షులు సాయిని మల్లేశం డిమాండ్ చేశారు. శుక్రవారం రోజున హుజురాబాద్ పట్టణం దర్శిని ఫంక్షన్ హాల్ లో స్థానిక బిజెపి శ్రేణుల తో కలిసి నిర్వహించిన మీడియా సమావేశంలో సాయిని మల్లేశం మాట్లాడుతూ.. దేశానికి 1947 ఆగస్టు 15న స్వాతంత్ర్యం వచ్చినప్పటికీ, నాటి నిజాం నవాబు దుర్మార్గపు పాలన కారణంగా తెలంగాణ ప్రాంత ప్రజలు మరో 13 నెలల పాటు బానిసత్వంలోనే మగ్గిపోయారన్నారు. వేలాది మంది అమరవీరుల త్యాగాలు, సర్దార్ వల్లభాయ్ పటేల్ దృఢ సంకల్పంతో చేపట్టిన 'ఆపరేషన్ పోలో' సైనిక చర్య ఫలితంగా 1948 సెప్టెంబర్ 17న హైదరాబాద్ సంస్థానం భారత యూనియన్‌లో విలీనమైందని గుర్తుచేశారు.గత ప్రభుత్వాలు ఓటు బ్యాంకు రాజకీయాల కోసం సెప్టెంబర్ 17ను అధికారికంగా నిర్వహించకుండా తెలంగాణ చరిత్రను విస్మరించాయని మండిపడ్డారు. ముఖ్యంగా నేడు తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వం సెప్టెంబర్ 17ను 'ప్రజా పాలన దినోత్సవం' పేరుతోసెప్టెంబర్ 17ను 'విమోచన దినోత్సవం' గా కాకుండా ప్రజా పాలన దినోత్సవంగా రాజకీయ డ్రామాలు చేస్తుందని ఆయన మండిపడ్డారు.కర్ణాటక, మహారాష్ట్రల మాదిరిగానే తెలంగాణలోనూ సెప్టెంబర్ 17ను అధికారికంగా తెలంగాణ విమోచన దినోత్సవం'గా జరపాలని బీజేపీ గట్టిగా డిమాండ్ చేస్తూ వస్తుందని, మరోవైపు కేంద్ర

ప్రభుత్వం మాత్రం సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో ప్రతి ఏటా అధికారికంగా 'హైదరాబాద్ విమోచన దినోత్సవం' వేడుకలను నిర్వహిస్తుందని తెలిపారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అధికారికంగా విమోచన దినోత్సవ వేడుకలను నిర్వహిస్తున్న స్ఫూర్తితో, రాష్ట్ర ప్రభుత్వం కూడా దీనిని అధికారిక పండగగా ప్రకటించాలని డిమాండ్ చేశారు.ఈ సెప్టెంబర్ 17న హుజురాబాద్ నియోజకవర్గ కేంద్రంతో పాటు జిల్లావ్యాప్తంగా ప్రతి గ్రామంలోనూ తెలంగాణ విమోచన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని, ప్రజలు, పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఈ చారిత్రక దినోత్సవాన్ని విజయవంతం చేయాలని సాయిని మల్లేశం పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి మాడ వెంకట్ రెడ్డి, బిజెపి సీనియర్ నాయకులు కనుమల గణపతి,బిజెపి ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షులు ఆకుల రాజేందర్ హుజురాబాద్ నియోజకవర్గం మండల అధ్యక్షులు తూర్పాటి రాజు పారుపల్లి కొండల్ రెడ్డి కొలగాని రాజు దొంతరవేణి రమేష్ ర్యాకం శ్రీనివాస్ కౌన్సిలర్లు కొలుగురి సుమలత శీలం శ్రీనివాస్ సర్పంచులు ఉప్పు మహేష్, కుమార్ బిజెపి సీనియర్ నాయకులు రావుల భాస్కర్ రెడ్డి గంగిశెట్టి రాజు స్థానిక బీజేపీ నాయకులు, మాజీ ప్రజా ప్రతినిధులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

భారతీయ సంస్కృతికి ప్రతీక యోగా :ఆల్ఫోర్స్ నరేందర్ రెడ్డి

అట్టహాసంగా రాష్ట్రస్థాయి యోగా పోటీలు

కరీంనగర్ టౌన్, సెప్టెంబర్ 11 (ప్రజాజ్యోతి)
భారతదేశంలో 2036లో జరిగే ఒలింపిక్స్‌లో యోగాలో తెలంగాణ నుంచి ఎక్కువ మంది క్రీడాకారులు పాల్గొనేలా కృషి చేయాలని ఆల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్, జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ పోషకులు వుటుకూరి నరేందర్ రెడ్డి ఆకాంక్షించారు. కరీంనగర్ జిల్లా యోగా అసోసియేషన్ ఆధ్వర్యంలో కొత్తపల్లిలోని ఆల్ఫోర్స్ ఈ–టెక్నో స్కూల్‌లో శుక్రవారం 13వ రాష్ట్రస్థాయి సబ్‌జూనియర్, జూనియర్ బాలబాలికల యోగా ఛాంపియన్‌షిప్

పోటీలు ఘనంగా ప్రారంభమయ్యాయి.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన నరేందర్ రెడ్డి మాట్లాడుతూ భారతీయ సంస్కృతికి, చరిత్రకు యోగా మూలాధారమని అన్నారు. యోగాతో శారీరక, మానసిక ఆరోగ్యం మెరుగుపడటంతో పాటు ఉల్లాసం, ఉత్తేజం, శరీర ధారుఢ్యం పెరుగుతాయని తెలిపారు. చిన్నారుల నుంచి పెద్దల వరకు ప్రతి ఒక్కరూ యోగాను తమ జీవితంలో భాగం చేసుకోవాలని సూచించారు. రాష్ట్రస్థాయి యోగా పోటీలకు ఆల్ఫోర్స్ విద్యాసంస్థలు వేదికగా నిలవడం సంతోషకరమన్నారు.యోగా క్రీడలో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులు ప్రొఫెషనల్ కోర్సుల్లో స్పోర్ట్స్ కోటా రిజర్వేషన్ల ద్వారా ప్రయోజనం పొందుతున్నారని పేర్కొన్నారు.తెలంగాణ యోగా అసోసియేషన్ అధ్యక్షులు ఎస్.ఎన్. రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రస్థాయి పోటీల నిర్వహణలో కరీంనగర్ మరోసారి రికార్డు సృష్టించిందన్నారు. ఈ పోటీల్లో ప్రతిభ కనబరిచే క్రీడాకారులను వచ్చే నెల 3వ తేదీ నుంచి రాజస్థాన్‌లోని జైపూర్‌లో జరిగే జాతీయస్థాయి యోగా పోటీలకు వెళ్లే తెలంగాణ జట్టుకు ఎంపిక చేయనున్నట్లు తెలిపారు.
తెలంగాణ యోగా అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి, కరీంనగర్ జిల్లా యోగా అసోసియేషన్ అధ్యక్షులు ఎన్. సిద్ధారెడ్డి మాట్లాడుతూ రెండు రోజుల పాటు జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు రాష్ట్రంలోని 24 జిల్లాల నుంచి సుమారు వెయ్యి మంది క్రీడాకారులు హాజరయ్యారని తెలిపారు. సబ్‌జూనియర్ విభాగంలో 8–10, 10–12, 12–14 ఏళ్ల వయసు విభాగాల్లో, జూనియర్ విభాగంలో 14–16, 16–18 ఏళ్ల వయసు విభాగాల్లో పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. 2017 నుంచి 2025 వరకు వరుసగా రాష్ట్రస్థాయి పోటీలకు కరీంనగర్ ఆతిథ్యం ఇచ్చిందని తెలిపారు.అంతకుముందు అతిథులు జ్యోతి ప్రజ్వలన చేసి పోటీలను ప్రారంభించారు. కరీంనగర్, నల్గొండ తదితర జిల్లాల క్రీడాకారులు ప్రదర్శించిన యోగాసనాలు ఆకట్టుకున్నాయి. మల్లీశ్వరి, రామకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. పాయింట్ల కేటాయింపులో పారదర్శకత కోసం, పోటీలను నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు తొలిసారిగా ఆన్‌స్క్రీన్ విధానాన్ని ఏర్పాటు చేయడం పట్ల క్రీడాకారులు హర్షం వ్యక్తం చేశారు.
కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ఒలింపిక్ అసోసియేషన్ సంయుక్త కార్యదర్శి జి. జనార్దన్ రెడ్డి, జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు టి. రమేష్ రెడ్డి, తెలంగాణ రాష్ట్ర యోగా అసోసియేషన్ ఉపాధ్యక్షులు కమలాకర్, యోగా ఫెడరేషన్ డిస్ట్రాక్ట్ కమిటీ సభ్యులు టి. మనోజ్ కుమార్, యోగా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గుంటి రామకృష్ణ, స్వరూపచారి, ప్రశాంత్, ఆనంద్, కిషోర్, వి. కిష్టయ్యతో పాటు రాష్ట్రంలోని వివిధ జిల్లాల యోగా సంఘాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పాల్గొన్నారు.

మట్టి గణపతులను పూజిద్దామంటూ విద్యార్థుల ర్యాలీ

ఇల్లంతకుంట సెప్టెంబర్11(ప్రజా జ్యోతి)
రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండల కేంద్రంలో మట్టి గణపతులను పూజిద్దాం పర్యావరణాన్ని కాపాడుదాం అంటూ శుక్రవారం రోజు విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. మండల కేంద్రంలోని వాణి నికేతన్ హై స్కూల్ విద్యార్థులు స్వయంగా మట్టితో తయారుచేసిన గణపతి

విగ్రహాలను పట్టుకొని పాఠశాల నుండి బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. విద్యార్థులు తయారుచేసిన మట్టి గణపతులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో కరస్పాండెంట్ తూముకుంట శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ తో తయారుచేసిన విగ్రహాలను చెరువులు కుంటలలో నిమజ్జనం చేయడం ద్వారా నీరు కలుషితం అవుతుందన్నారు. ఈ నీటిని త్రాగడం ద్వారా పశువులు, జలచరాలు అనారోగ్యం బారిన పడుతున్నాయన్నారు. మట్టి వినాయకులు అయితే మట్టిలోనే కలిసిపోతుందన్నారు. ప్రజల్లో అవగాహన పెంచడానికి ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయన్నారు అనంతరం పాఠశాల ఆవరణలో గణపతి ఆకృతిలో విద్యార్థుల ప్రదర్శన ఆకట్టుకుంది. కార్యక్రమంలో ప్రిన్సిపల్ తూముకుంట శ్రీనిధి, ఉపాధ్యాయులు శ్రీనివాస్, రాజు, సంతోష్, రమేష్, తిరుపతి, రాజు, శోభ, కళ్యాణి, రేణుక, సునీత, స్వాతి, మహాలక్ష్మి , లావణ్య, సుమంగళి, సునంద, మౌనిక, రేణుక, జలజ, శాంత, పద్మ, ఉష, శమిమాల తో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

సెప్టెంబర్ 17ను తెలంగాణ విమోచన దినోత్సవంగా అధికారికంగా నిర్వహించాలి

బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, నగర డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావు

కరీంనగర్ టౌన్,సెప్టెంబర్ 11 (ప్రజాజ్యోతి):
సెప్టెంబర్ 17ను రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా తెలంగాణ విమోచన దినోత్సవంగా నిర్వహించాలని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, నగర డిప్యూటీ మేయర్, మాజీ మేయర్ యాదగిరి సునీల్ రావు డిమాండ్ చేశారు. కరీంనగర్‌లోని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, 1948 సెప్టెంబర్ 17న తెలంగాణ ప్రాంతానికి స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు లభించాయని తెలిపారు. సర్దార్ వల్లభభాయ్ పటేల్ ఆధ్వర్యంలో చేపట్టిన 'ఆపరేషన్ పోలో'తో నిజాం పాలనకు ముగింపు పలికిందన్నారు.రజాకార్ల దౌర్జన్యాలు, నిజాం పాలన, జమీందారీ, జాగీర్దారీ దోపిడీకి వ్యతిరేకంగా ఎందరో రైతులు, మహిళలు, యువకులు పోరాడి ప్రాణత్యాగాలు చేశారని సునీల్ రావు పేర్కొన్నారు. గత ప్రభుత్వాలు సెప్టెంబర్ 17 ప్రాధాన్యతను ప్రజలకు తెలియకుండా పక్కన పెట్టాయని విమర్శించారు.
బీజేపీ కీలక డిమాండ్లుసెప్టెంబర్ 17న రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, జిల్లా కేంద్రాల్లో అధికారికంగా తెలంగాణ విమోచన దినోత్సవం నిర్వహించి జాతీయ జెండాను ఎగురవేయాలని కోరారు. హైదరాబాద్‌లో 'స్టాచ్యూ ఆఫ్ లిబరేషన్' ఏర్పాటు చేయాలని, ఆపరేషన్ పోలో, రజాకార్ల దురాగతాలు, తెలంగాణ పోరాట చరిత్రను ప్రతిబింబించేలా భారీ మ్యూజియం నిర్మించాలని డిమాండ్ చేశారు. ప్రతి జిల్లా కేంద్రంలో 'తెలంగాణ విమోచన స్మృతి కేంద్రం' ఏర్పాటు చేయాలని, విమోచన పోరాటంలో ప్రాణత్యాగం చేసిన అజ్ఞాత వీరుల వివరాలను సేకరించి అధికారిక అమరవీరుల జాబితా విడుదల చేయాలని అన్నారు. రజాకార్ల అరాచకాలకు బలైన గ్రామాలు, పోరాట ప్రాంతాల్లో విమోచన స్మారక స్థూపాలు నిర్మించాలని సూచించారు.
పరకాల తదితర చారిత్రక పోరాట ప్రాంతాలను కలుపుతూ 'విమోచన సర్క్యూట్' ఏర్పాటు చేసి పర్యాటకంగా అభివృద్ధి చేయాలని కోరారు. సెప్టెంబర్ 17 అధికారిక నిర్వహణ కోసం బీజేపీ గత 40 ఏళ్లుగా పోరాడుతోందని, ఈసారి కూడా పార్టీ

పిలుపు మేరకు రాష్ట్రవ్యాప్తంగా విమోచన వేడుకలు నిర్వహిస్తామని సునీల్ రావు తెలిపారు. ఈ సమావేశంలో బీజేపీ పార్లమెంట్ కన్వీనర్ బోయినిపల్లి ప్రవీణ్ రావు, కార్పొరేటర్లు, కోఆప్షన్ సభ్యులు, నాయకులు ఎన్నం ప్రకాష్, పొన్నం మొండయ్య గౌడ్, తేల్ల లక్ష్మి –రమేష్, సర్దార్ బల్వీర్ సింగ్, గాజ శివరాం, బండారి వేణు, నాంపల్లి శ్రీనివాస్, కొలిపాక శ్రీనివాస్, బండ రమణారెడ్డి, మేకల వెంకటేష్, మోతే గంగారెడ్డి, జాడి బాల్ రెడ్డి, అవుదుర్తి శ్రీనివాస్, యువమోర్చా అధ్యక్షుడు సంఘం నరేష్ తదితరులు పాల్గొన్నారు.

డాక్టరేట్ పట్టా అందుకున్న ప్రభుత్వ కళాశాల లెక్చరర్

కరీంనగర్ రూరల్, సెప్టెంబర్ 11 (ప్రజాజ్యోతి):
కరీంనగర్ లక్ష్మీనగర్‌కు చెందిన ప్రభుత్వ జూనియర్ కళాశాల లెక్చరర్ ముత్యం ప్రవళిక ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి డాక్టరేట్ పట్టా అందుకున్నారు.హైదరాబాద్‌లోని ఉస్మానియా విశ్వవిద్యాలయంలో నిర్వహించిన 85వ స్నాతకోత్సవంలో గవర్నర్ శివ ప్రతాప్ శుక్ల, వీసీ కుమార్ మొగిలి కరణ్,భారత్ బయోటెక్ వ్యవస్థాపకుడు ఎం.కృష్ణ ఎల్లా చేతుల మీదుగా ఆమె పట్టా స్వీకరించారు.ఓయూ ఆర్ట్స్ కళాశాల హిందీ విభాగంలో 'ఓం ప్రకాశ్ వాల్మీకి ఔర్ బాబురావు బాగుల్ కీ కహానియోం మే అభివ్యక్త దళిత్ చేతనా కా తులనాత్మక అధ్యయన్' అనే అంశంపై ప్రొఫెసర్ చంద్రముఖర్జీ పర్యవేక్షణలో ప్రవళిక పరిశోధన చేశారు. 2025లో తన పరిశోధనను విజయవంతంగా పూర్తి చేశారు.టీజీపీఎస్సీ ద్వారా గత ఏడాది జూనియర్ లెక్చరర్‌గా ఎంపికైన ఆమె ప్రస్తుతం మానకొండూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విధులు నిర్వహిస్తున్నారు.డాక్టరేట్ పట్టా అందుకున్న ప్రవళికను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ లెక్చరర్ల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు లింగానాయక్,జిల్లా అధ్యక్షుడు శామారావు, కళాశాల ప్రిన్సిపల్ రాజేశ్వరరావు,అధ్యాపకులు, టీఎస్‌యూటీఎఫ్ నాయకులు,కుటుంబ సభ్యులు,స్నేహితులు అభినందించారు.

అర్హుల ఓటు ఒక్కటీ మిస్ కావొద్దు!: కలెక్టర్ చిత్రా మిశ్రా

కరీంనగర్ బ్యూరో,సెప్టెంబర్ 11(ప్రజాజ్యోతి):
ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా ఓటర్ల జాబితా పరిశీలనను అత్యంత జాగ్రత్తగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా నో మ్యాపింగ్ ఓటర్ల విషయంలో ఆధారాలు లేకుండా ఎలాంటి నిర్ణయాలు తీసుకోవద్దని, నోటీసులు అందుకున్న వారి నుంచి అవసరమైన ధ్రువీకరణ పత్రాలు సేకరించి క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు. అర్హులైన ఓటర్లలో ఏ ఒక్కరి పేరు కూడా మిస్ కాకుండా అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు.
ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా నో మ్యాపింగ్ ఓటర్ల జాబితా పరిశీలన జరుగుతున్న తీరును తెలుసుకునేందుకు కలెక్టర్ చిత్రా మిశ్రా శుక్రవారం సాయంత్రం తిమ్మాపూర్ మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ కర్ర శ్రీనివాస్‌రెడ్డి నుంచి ప్రక్రియకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు.నో మ్యాపింగ్, కరెక్షన్స్‌కు సంబంధించి నోటీసులు అందించిన ప్రతి వ్యక్తి నుంచి అవసరమైన డాక్యుమెంట్లను సేకరించాలని కలెక్టర్ సూచించారు. సేకరించిన

పత్రాలను బీఎల్‌వోల యాప్‌లో డౌన్‌లోడ్ చేసి, వాటిని జాగ్రత్తగా పరిశీలించాలని ఆదేశించారు. ప్రతి కేసుకు సంబంధించిన వివరాలు, ఆధారాలను నిబంధనల ప్రకారం నమోదు చేయాలని పేర్కొన్నారు.
బీఎల్‌వోలు గ్రామాల వారీగా చేపడుతున్న ప్రక్రియను రెవెన్యూ అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు. క్షేత్రస్థాయిలో బీఎల్‌వోలు ఎదుర్కొంటున్న సమస్యలను కూడా కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు.ఓటర్ల పేర్ల తొలగింపు విషయంలో మరింత జాగ్రత్తగా వ్యవహరించాలని చిత్రా మిశ్రా సూచించారు. అర్హులైన ఓటర్ల పేరు పొరపాటున కూడా జాబితా నుంచి తొలగిపోకుండా చూడాలన్నారు. నోటీసులు అందించిన వారి నుంచి సరైన ధ్రువీకరణ పత్రాలు తీసుకుని, వాటి ఆధారంగా మాత్రమే తదుపరి చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. నో మ్యాపింగ్ ప్రక్రియకు సంబంధించిన రికార్డులను పక్కాగా నిర్వహించాలని ఆదేశించారు. రిజిస్టర్‌లో తేదీల వారీగా ఓటర్ల పేర్లు, నోటీసులు జారీ చేసిన కారణాలు, సమర్పించిన పత్రాలు తదితర వివరాలను నమోదు చేయాలని సూచించారు.
కొత్త ఓటర్ల నమోదుకు సంబంధించిన ఫారం–6, ఓటర్ల జాబితా నుంచి చనిపోయిన వారి పేర్ల తొలగింపునకు సంబంధించిన ఫారం–7 అంశాల్లోనూ నిబంధనల ప్రకారం జాగ్రత్తగా వ్యవహరించాలని కలెక్టర్ ఆదేశించారు.అదేవిధంగా ఓటర్ల మార్పులు చేర్పులకు సంబంధించి ఫారం 8 ప్రకారం చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాతే తదుపరి చర్యలు చేపట్టాలని సూచించారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో నో మ్యాపింగ్ జాబితా పరిశీలనను సమగ్రంగా పూర్తి చేయాలని, ఈ ప్రక్రియపై రెవెన్యూ అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ ఆదేశించారు.ఈ కార్యక్రమంలో తహసీల్దార్ కర్ర శ్రీనివాస్‌రెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ వేముల శ్రీనివాస్‌తో పాటు రెవెన్యూ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పోషక విలువలు కలిగిన ఆహారంతో సుఖ ప్రసవం

• ఐసిడిఎస్ సిడిపిఓ సత్యవతి

సత్తుపల్లి సెప్టెంబర్11(ప్రజా జ్యోతి) గర్భిణీలు పోషక విలువ కలిగిన ఆహారం తీసుకుంటే, రక్తహీనత,సమస్యలు లేకుండా సుఖ ప్రసవం అవుతారని సిడిపిఓ సత్యవతి అన్నారు. మండల పరిధిలోని కిష్టారం 6 అంగన్వాడి కేంద్రంలో టీచర్ మాధవి ఆధ్వర్యంలో నిర్వహించిన పోషకాహార మాస ఉత్సవాలలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మాట్లాడుతూ గర్భిణీగా గుర్తించిన దగ్గర్నుంచి,పోషక విలువలు కలిగిన ఆహారం తీసుకున్నట్లయితే పుట్టబోయే బిడ్డ సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటాడని అన్నారు. కిష్టారం సెక్టార్ సూపర్వైజర్ రజిని మాట్లాడుతూ వ్యక్తిగత ,పరిసరాల పరిశుభ్రత పాటించాలని దీని ద్వారా అనారోగ్య సమస్యలు రావని, పరిశుభ్రత ప్రధానమని, పరిశుభ్రత పై అవగాహన కల్పించారు. పరిశుభ్రత వలన వ్యాధులు దరి చేరకుండా ఉంటాయన్నారు. చిన్నారులను ప్రైవేటు పాఠశాలకు వ్యానులు ఎక్కించి పంపించ వద్దన్నారు. స్థానికంగా అంగన్వాడి కేంద్రాలకు పంపించి బలోపేతం చేయాలని అన్నారు. అనంతరం తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషక విలువలు కలిగిన,అదనపు ఆహారాన్ని ప్రదర్శించి తయారు చేసే విధానాన్ని తల్లులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ పాఠశాల హెచ్ఎం రాంబాబు,ఏఎన్ఎం పద్మ, చిన్నారులు ,గర్భిణీలు, బాలింతలు పాల్గొన్నారు.

వేంసూరు ఉత్తమ ప్రధానోపాధ్యాయులు చలంచర్లకు సన్మానం

వేంసూరు: సెప్టెంబర్ 11 ప్రజాజ్యోతి ఉత్తమ ప్రధానోపాధ్యాయుడిగా అవార్డు అందుకున్న మండల విద్యాశాఖ అధికారి చలంచర్ల వెంకటేశ్వరరావును సన్మానించడం విద్యారంగానికే గర్వకారణమని మాజీ ఎంపీపీ పగుట్ల వెంకటేశ్వరరావు అన్నారు. శుక్రవారం వేంసూరు మండల విద్యా వనరుల కేంద్రంలో ఉత్తమ ప్రధానోపాధ్యాయుడిగా అవార్డు అందుకున్న చలంచర్ల వెంకటేశ్వరరావును శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పగుట్ల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. చలంచర్ల వెంకటేశ్వరరావు మండలంలోని వివిధ పాఠశాలల్లో సుదీర్ఘకాలం ప్రధానోపాధ్యాయుడిగా పనిచేస్తూ, ప్రస్తుతం మండల విద్యాశాఖ అధికారిగా విద్యాభివృద్ధికి విశేష కృషి చేస్తున్నారని కొనియాడారు. పాఠశాలల్లో విద్యార్థుల హాజరుశాతాన్ని పెంచడంతోపాటు మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నారని తెలిపారు. ఆయన సేవలు విద్యారంగానికి ఆదర్శంగా నిలుస్తున్నాయని అన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీలు నున్నా రాంబాబు, నాయుడు వెంకటేశ్వరరావు, కళ్లూరుగూడెం బీఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు వీర వెంకు వెంకటేశ్వరరావు, కొంద్రు రవి తదితరులు పాల్గొన్నారు.

పోషక విలువలు కలిగిన ఆహారంతో సుఖ ప్రసవం

• ఐసిడిఎస్ సూపర్వైజర్ సంధ్యారాణి

చింతకాని సెప్టెంబర్11(ప్రజా జ్యోతి) గర్భిణీలు పోషక విలువ కలిగిన ఆహారం తీసుకుంటే రక్తహీనత సమస్యలు లేకుండా సుఖ ప్రసవం అవుతారని, చింతకాని సెక్టార్ సూపర్వైజర్ సంధ్యారాణి అన్నారు. చింతకాని మండల పరిధిలోని రాఘవాపురం అంగన్వాడి కేంద్రంలో టీచర్ కళ్యాణి ఆధ్వర్యంలో నిర్వహించిన పోషకాహార మాస ఉత్సవాలు శుక్రవారం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి సూపర్వైజర్ సంధ్యారాణి

హాజరైనారు. అనంతరం ఆమె మాట్లాడుతూ గర్భిణీగా గుర్తించిన దగ్గర్నుంచి పోషక విలువలు కలిగిన ఆహారం తీసుకున్నట్లయితే, పుట్టబోయే బిడ్డ సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటాడని అన్నారు. ప్రభుత్వ వైద్యులు వి.వి రావు మాట్లాడుతూ వ్యక్తిగత ,పరిసరాల పరిశుభ్రత పాటించాలని అన్నారు. పరిశుభ్రత వలన వ్యాధులు దరి చేరకుండా ఉంటాయన్నారు. గ్రామ ఉప సర్పంచ్ మహేష్ మాట్లాడుతూ చిన్నారులను ప్రైవేటు పాఠశాలకు వ్యానులు ఎక్కించి పంపించ వద్దన్నారు. స్థానికంగా అంగన్వాడి కేంద్రాలకు పంపించి బలోపేతం చేయాలని అన్నారు. అనంతరం తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషక విలువలు కలిగిన అదనపు ఆహారాన్ని ప్రదర్శించి,తయారు చేసే విధానాన్ని తల్లులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ పాఠశాల హెచ్ఎం రాంబాబు,ఏఎన్ఎం పద్మ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు బూట్లు, సాక్సులు

అందజేసిన ఎంపీడీవో అశోక్ కుమార్

రఘునాథపాలెం :ప్రజా జ్యోతి రఘునాథపాలెం: మండలంలోని వేపకుంట్ల గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం విద్యార్థులకు ఎంపీడీవో అశోక్ కుమార్ బూట్లు, సాక్సులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ పొట్లపల్లి రమాదేవి రాజా విద్యార్థులతో మాట్లాడి విద్య, క్రమశిక్షణపై సూచనలు చేశారు. మంచి మార్కులు సాధించి తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు, గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఎంపీడీవో పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి, విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని వంట కార్మికులకు సూచించారు. అనంతరం విద్యార్థులు, ఉపాధ్యాయులతో మాట్లాడి పాఠశాల పరిస్థితులను తెలుసుకున్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి అనీలు, అమ్మ ఆదర్శ కమిటీ చైర్మన్ మేడేపల్లి సుజాత, ప్రధానోపాధ్యాయురాలు గాయత్రి, ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు, యువకులు, విద్యార్థులు పాల్గొన్నారు

ఆర్యవైశ్య మహాసభ నూతన

భవన భూమి పూజను జయప్రదం చేయండి

ఇల్లందు, సెప్టెంబర్ 11 (ప్రజా జ్యోతి) ఈనెల 13న హైదరాబాద్ లోని ఉప్పల్ భగాయత్ లో జరగనున్న ఆర్యవైశ్య మహాసభ నూతన భవన భూమి పూజకు ఆర్యవైశ్యులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ పొలిటికల్ కమిటీ వైస్ చైర్మన్ పల్లెర్ల చంద్రశేఖర్ కోరారు. శుక్రవారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ జై వాసవి.. జై ఆర్యవైశ్య అనే నినాదంతో తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ ఆధ్వర్యంలో భారీ ఆత్మీయ సమావేశం జరగనున్నట్లు తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్యుల సామాజిక చైతన్యం కోసం అలాగే మన సంఘం అభివృద్ధి, భవిష్యత్ కార్యాచరణను చర్చించడానికి ఈ ప్రత్యేక సభను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ప్రతి ఒక్క ఆర్యవైశ్యులు తరలి రావాలని కోరారు.

గణేష్ నవరాత్రులు

భక్తిశ్రద్ధలతో జరపండి: ఏసిపి వసుంధర యాదవ్

సత్తుపల్లి సెప్టెంబర్11(ప్రజా జ్యోతి) గణేష్ నవరాత్రులు భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని, కల్లూరు ఏసిపి వసుంధర యాదవ్ ఐ.పి.ఎస్ అన్నారు. శుక్రవారం గణేష్ నవరాత్రులు సందర్భంగా ఏ.సి.పి కార్యాలయంలో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గణేష్ మండపాలు నిర్వహించేవాళ్లు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా, భక్తిశ్రద్ధలతో ,సోదర భావంతో, ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని, భద్రత నియమాలు పాటించాలని, జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. మండపాలు నిర్వహించేవారు పోలీస్ శాఖ పోర్టల్ **policeportal.tspolice.gov.in** వివరాలను ఆన్లైన్ లో నమోదు చేసుకోవాలని కోరినారు.విగ్రహ ప్రతిష్టాపన పూజా కార్యక్రమాలు, ఊరేగింపులు, నిమజ్జనం, తదితర కార్యక్రమాలను ముందస్తు ప్రణాళికతో నిర్వహించే అవకాశం ఉంటుందని అన్నారు. మండపాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని,విద్యుత్ కనెక్షన్లు వైరింగ్ నిపుణులతో తనిఖీ చేయించాలని వారికి సూచించారు. అగ్ని ప్రమాదాలు సంభవించకుండా అవసరమైన అగ్ని మాపక పరికరాలను అందుబాటులో ఉంచాలని, మండపాల వద్ద అత్యవసర పరిస్థితుల్లో బయటకు వెళ్లేందుకు మార్గాలను ఎట్టి పరిస్థితులను మూసి వేయకూడదని స్పష్టం చేశారు. మండపాల వద్ద భక్తులు, మహిళలు, చిన్నారులు పెద్ద సంఖ్యలో హాజరయ్యే అవకాశం ఉన్నందున రద్దీ నియంత్రణ, పార్కింగ్ ,ట్రాఫిక్ నిర్వహణ ఏర్పాట్లు చేసుకోవాలని, డీజే లు సౌండ్ సిస్టం వినియోగంలో ప్రభుత్వ నిబంధనలో తప్పనిసరిగా పాటించాలని, అధిక శబ్దాలతో ప్రజలను ఇబ్బంది కలిగించవద్దని నిర్వాహకులకు సూచించారు. రాత్రి వేళలో శబ్ద కాలుష్యానికి కారణమయ్యే కార్యక్రమాలు నిర్వహించకుండా, నిబంధనల పాటించాలని,విగ్రహాల ఊరేగింపు నిమజ్జనా కార్యక్రమం ట్రాఫిక్ అంతరాయం కలగకుండా పోలీసులతో సమన్వయంగా చేసుకోవాలని సూచించారు. ఊరేగింపులో పాల్గొనేవారు క్రమశిక్షణతో ఉండాలన్నారు. నిమజ్జన సమయంలో నీటిలోకి తొందరపడి వెళ్ళవద్దని, అత్యవసర సమయాల్లో 100 కి కాల్ చేయాలని, పోలీస్ సహకారాలు తీసుకోవాలని సూచించారు. మండపాలు నిర్వహించేవారు వారి ఫోన్ నెంబర్లు,రిజిస్ట్రేషన్ తప్పనిసరిగా చేపించాలని, మండపాలు పెట్టే ప్రదేశాలు సంబంధిత వ్యక్తుల నుండి అభ్యంతర లేదని ధ్రువీకరణ పత్రం, వివాద స్థలాలలో విగ్రహాలు ప్రతిష్టించవద్దని, ప్రధాన రహదారులపై ట్రాఫిక్ రద్దీగా ఉండే రహదారులపై విగ్రహాలు ఏర్పాటు చేయవద్దని, విద్యుత్ షార్ట్ సర్క్యూట్ నివారించేందుకు నాణ్యమైన విద్యుత్ తీగలను పరికరాలను ఉపయోగించాలని, మండపాల వద్ద డిజె లకు అనుమతి లేనందున,రెండు మైక్ తో కూడిన స్పీకర్లు మాత్రమే అనుమతించబడతాయని, అదేవిధంగా ఉదయం 06:00 గంటల నుండి రాత్రి 10:00 గంటల వరకు సమయాలను అనుసరించి మైక్ సౌండ్ సిస్టం

వినియోగించుకోవాలని వివరించారు. మండపాలలో అసభ్యకరమైన నృత్యాలు, కార్యక్రమాలు నిర్వహించవద్దని, కనీసం ఇద్దర సభ్యులు 24 గంటలు మండపాల్లో ఉండేవిధంగా చూడాలని, నోటీసు బోర్డును పాయింట్ బుక్ ఏర్పాటుచేసి, తప్పనిసరిగా నిర్వాహకుల సంప్రదింపు నెంబర్లు వివరాలు పొందుపరచాలని, అగ్ని ప్రమాదాలను నివారించడానికి ప్రతి మండపం దగ్గర తప్పనిసరిగా ఫైర్ ప్రూఫ్ ఉండేలా చూసుకోవాలని నిర్వాహకులకు తెలిపారు. అనంతరం ఫైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని, సైబర్ పోస్టర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సత్తుపల్లి సిఐ తుమ్మలపల్లి శ్రీహరి,ఎస్ ఐ లు కవిత, అశోక్ ,ప్రదీప్ ,పోలీస్ సిబ్బంది ఉన్నారు.

ఐలమ్మ పోరాట స్ఫూర్తితో ప్రజా సమస్యలపై ఉద్యమించాలి

• సిపిఎం మండల కార్యదర్శి తోటకూర రాజశేఖర్ • సిపిఎం మండల కమిటీ ఆధ్వర్యంలో ఐలమ్మ వర్ధంతి

పాలేరు ఆర్.సీ సెప్టెంబర్ 11 ప్రజాజ్యోతి చిట్యాల ఐలమ్మ పోరాట స్ఫూర్తితో ప్రజా సమస్యలపై ఉద్యమించాలని సిపిఎం మండల కార్యదర్శి తోటకూరి రాజశేఖర్ పిలుపునిచ్చారు. శుక్రవారం మండల కేంద్రంలోని పద్మా రెడ్డి భవనంలో సిపిఎం మండల కమిటీ ఆధ్వర్యంలో ఐలమ్మ వర్ధంతి నిర్వహించారు. ముందుగా చిట్యాల ఐలమ్మ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో ఐలమ్మ పోషించిన విరోచిత పోరాట స్ఫూర్తి అందరికీ ఆదర్శప్రాయమని, భూస్వామ్య, దోపిడీ, అన్యాయానికి వ్యతిరేక ఐలమ్మ చూపిన ధైర్యం పోరాటపటిమా నేటి తరానికి స్ఫూర్తిదాయకమని ఆయన అన్నారు. పేదలు, రైతులు, కార్మికులు, మహిళ హక్కుల కోసం ఐక్యంగా పోరాడినప్పుడే సామాజిక న్యాయం సాధ్యమవుతుందని తెలిపారు. చిట్యాల ఐలమ్మ ఆశలను ముందుకు తీసుకెళ్లేందుకు, ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటాలు నిర్వహించాలని, అణగారిన వర్గాల హక్కుల కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు మల్లెల సన్మతరావు, మండల కార్యదర్శివర్గ సభ్యులు యడవల్లి రమణారెడ్డి, బిక్కసాని గంగాధర్, శీలం గురుమూర్తి,కర్ణబాబు,మూడు గన్య నాయక్, మండల కమిటీ సభ్యులు జవ్వాజి శీను, ,ఎర్రబోయిన సురేష్, ఎస్ .కే బాబు, సోమనబోయిన కృష్ణయ్య,బాసు నాయక్, గూగులోత్ నాగేశ్వరరావు,ఊడుగు వెంకన్న, వై. రంగయ్య,వెన్ను ఉపేందర్, మాధవరావు, సురేష్ ఉపేందర్, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

ఇల్లందు క్రాస్ రోడ్‌లో ఘనంగా జాతీయ అటవీ అమరవీరుల దినోత్సవం

• అటవీ శాఖలో మరణించిన ఉద్యోగుల త్యాగాలు మరువరానివి • అటవీ శాఖ గిరిజన సమాజాల మధ్య పరస్పర సహకారం ఎంతో ముఖ్యం
• అటవీ నేరాలను నియంత్రించేందుకు సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవాలి
• పర్యావరణాన్ని పరిరక్షించడం ఎంత ముఖ్యమోబి గిరిజన హక్కులను పరిరక్షించడం కూడా అంతే ముఖ్యం: జిల్లా కలెక్టర్ అంకిత్

కొత్తగూడెం కలెక్టరేట్, సెప్టెంబర్ 11 ,(ప్రజా జ్యోతి) విధి నిర్వహణలో అటవీ సంపద, పర్యావరణ పరిరక్షణ కోసం తమ ప్రాణాలను సైతం త్యాగం చేసిన అటవీ శాఖ అధికారులు, సిబ్బంది సేవలు, త్యాగాలు స్ఫూర్తిదాయకమని జిల్లా కలెక్టర్ అంకిత్ అన్నారు. జాతీయ అటవీ అమరవీరుల దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం కొత్తగూడెం ఇల్లందు క్రాస్‌రోడ్స్ లోని చలమల శ్రీనివాసరావు మెమోరియల్ సెంట్రల్ పార్క్‌లో అటవీ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ అమరవీరుల సంస్మరణ సభకు జిల్లా కలెక్టర్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు, కార్యక్రమానికి ముందుగా విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన అమరవీరులు చలమల శ్రీనివాసరావు విగ్రహానికి కలెక్టర్ అంకిత్ పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ బానోతు నవీన్ నాయక్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా అటవీ సంపదను కాపాడే క్రమంలో ఎంతోమంది అటవీ శాఖ అధికారులు, సిబ్బంది విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయారని అన్నారు. వారి త్యాగాలను స్మరించుకోవడం, వారి సేవలను భావితరాలకు తెలియజేయడం మనందరి బాధ్యత అని అన్నారు . అటవీ శాఖలో విధులు నిర్వహించే ఫారెస్ట్ బీట్ ఆఫీసర్లు, ఇతర సిబ్బంది అటవీ సంపద సంరక్షణలో అత్యంత కీలకమైన బాధ్యతలను నిర్వర్తిస్తున్నారని , విధి నిర్వహణలో ఎదురయ్యే సవాళ్లు, ప్రమాదాలను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు సిబ్బందికి అవసరమైన శిక్షణ, భద్రతా పరికరాలు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, ఇతర మౌలిక సౌకర్యాలను అందుబాటులో ఉంచాల్సిన అవసరం ఉందన్నారు. ప్రస్తుతం నేరాల స్వభావం మారుతున్న నేపథ్యంలో అటవీ నేరాలను నియంత్రించేందుకు సాంకేతిక పరిజ్ఞానాన్ని మరింత సమర్థవంతంగా వినియోగించుకోవాలని కలెక్టర్ సూచించారు. విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన అటవీ శాఖ సిబ్బంది కుటుంబ సభ్యుల త్యాగాలను కూడా సమాజం ఎల్లప్పుడూ గుర్తుంచుకోవాలని కలెక్టర్ అన్నారు. అమరవీరుల త్యాగాలను స్ఫూర్తిగా తీసుకొని అటవీ సంపదను పరిరక్షించేందుకు అటవీ శాఖ అధికారులు, సిబ్బంది మరింత అంకితభావంతో పనిచేయాలని అన్నారు, కొత్తగూడెం జిల్లా విస్తారమైన అటవీ ప్రాంతాన్ని కలిగి ఉందని, ఇక్కడి గిరిజన సమాజానికి అడవులతో ఎంతోకాలంగా సన్నిహిత సంబంధం ఉందన్నారు, కోయలు, కొండరెడ్లు తదితర గిరిజన సమాజాలు అడవులతో మమేకమై జీవిస్తున్నారని, అటవీ శాఖ , గిరిజన సమాజాల మధ్య పరస్పర సహకారం, సమన్వయం ఎంతో ముఖ్యమని అన్నారు. అటవీ సంపదను పరిరక్షించడంతో పాటు గిరిజనుల హక్కులను కూడా కాపాడాల్సిన బాధ్యత ఉందని తెలిపారు. అడవులను కాపాడటం, పర్యావరణాన్ని పరిరక్షించడం

ఎంత ముఖ్యమో, అటవీ ప్రాంతాల్లో నివసించే గిరిజనుల హక్కులను పరిరక్షించడం కూడా అంతే ముఖ్యమని అన్నారు. ఈ రెండు అంశాల మధ్య సమతుల్యతను పాటిస్తూ సమన్వయంతో ముందుకు సాగాలని సూచించారు. అటవీ అమరవీరుల త్యాగాలను ఎల్లప్పుడూ స్మరించుకుంటూ, వారి స్ఫూర్తితో అటవీ సంపదను రక్షించేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా పనిచేయాలని జిల్లా కలెక్టర్ అంకిత్ పిలుపునిచ్చార, ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పి రోహిత్ రాజు,జిల్లా అటవీ అధికారి సిధార్ద్ విక్రమ్ సింగ్ , అటవీ శాఖ అధికారులు, ఫారెస్ట్ రేంజ్ అధికారులు, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్లు, ఇతర అటవీ శాఖ సిబ్బంది, అమరవీరుల కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ కొత్తగూడెం జిల్లా విభాగం ఎన్నికలు

• ఎన్నికల ప్రత్యేక అధికారిణిగా సీపీఓ సునీత నియామకం
• ఈ నెల 24 న నామినేషన్లు స్వీకరణ • 26న తుది జాబితా ప్రకటన 1 అక్టోబర్ 4న ఎన్నికలు • జిల్లా కలెక్టర్ అంకిత్

కొత్తగూడెం కలెక్టరేట్ ,సెప్టెంబర్ 11,(ప్రజా జ్యోతి) ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ (ఐ. ఆర్.సీ.ఎస్) కొత్తగూడెం జిల్లా విభాగం ఎన్నికలు వచ్చే నెల అక్టోబరు 4వ తేదీ ఆదివారం నిర్వహిస్తునట్లు జిల్లా కలెక్టర్ అంకిత్ శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్పెషల్ చీఫ్ సెక్రటరీబి టు గవర్నర్ అండ్ చైర్మన్ ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ తెలంగాణ స్టేట్ బ్రాంచ్ ఆదేశాలనుసారం జిల్లాలో ఈ ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.ఈ ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు ప్రత్యేకంగా జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారిణి (సీ.పీ.ఓ)సునీత ను నియమించినట్లు తెలిపారు. జిల్లాలో మొత్తం 2563 మంది సభ్యులు ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ లో ఉన్నారని,ఈ ఎన్నికల్లో పాల్గొనాలని కోరారు. ఈ ఎన్నికలు ఓటర్ లిస్టు ఈనెల 14వ తేదీ నుంచి జిల్లా అధికారుల వద్ద ఉంటుందని,ఏటువంటి అభ్యంతరాలు ఉన్న లిఖితపూర్వకంగా అందజేయాలని తెలిపారు.ఓ ఓటర్ల జాబితాలో ఏదైనా తప్పులు, ఒప్పులు ఉంటే 15వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ దరఖాస్తులను

తెలంగాణ స్టేట్ బ్రాంచ్ వారు పరిశీలించిన అనంతరం వాటిని ఓటరు జాబితాలో చేర్చడం ఈనెల 16వ తేదీన జరుగుతుందని తెలిపారు ,తుది ఓటర్ల జాబితా ఈ నెల 19 న ప్రకటించి, అదే రోజు ఎలక్షన్ నోటిఫికేషన్, షెడ్యూల్ విడుదల చేస్తున్నట్లు తెలిపారు. ఈనెల 24 న నామినేషన్లు ఉదయం పది గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు స్వీకరించి, అభ్యర్థులు తమ నామినేషన్ చేసే క్రమంలో ఒక నామినేషన్ కు రూ. 10,000/- (నాన్ - రిఫండబుల్) నగదును డిపాజిట్ చేయాలని, ఈనెల 25వ తేదీ నామినేషన్లను పరిశీలించి, 26వ తేదీ మధ్యాహ్న ఒంటిగంట వరకు నామినేషన్ల ఉపసంహరణ గడువుగా నిర్ణయించినట్లు తెలిపారు, మధ్యాహ్నం మూడు గంటలకు ఎన్నికల్లో బరిలో నిలిచే అభ్యర్థుల తుది జాబితా ప్రకటిస్తామని , వచ్చే నెల అక్టోబరు 4వ తేదీ ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు ఎన్నికలు నిర్వహించి, సాయంత్రం నాలుగు గంటలకు కౌంటింగ్ ప్రారంభిస్తామని, కౌంటింగ్ పూర్తయిన వెంటనే ఎన్నికల్లో విజేతల వివరాలు ప్రకటిస్తామని తెలిపారు, గెలిచిన వారి జాబితా పూర్తి వివరాలను ఎన్నికలు నిర్వహించిన అధికారి జిల్లా కలెక్టర్ కు నివేదిక రూపంలో అందిస్తారని, ఈ నివేదికను అక్టోబర్ 5వ తేదీన స్టేట్ బ్రాంచ్ కు జిల్లా కలెక్టర్ అందజేయనున్నారు.

తమ్ముడు.. లెట్స్ డూ కుమ్ముడు

మొదటిపేజీ తరువాయి..

తన తమ్ముడికి చెందిన కంపెనీకి కేవలం రూ. 7 కోట్లకే అడ్డికి పావుశేరు లెక్కన కట్టబెట్టారని కేటీఆర్ ఆరోపించారు. రూ. 1,000 కోట్ల మాయాజాలానికి తెరతీసి కొంగరకలాన్ భూములను కాజేసే కుట్ర జరుగుతోందన్నారు. భూములు ఇచ్చేందుకు నిరాకరించిన సామాన్యుల స్థలాలను ఉద్దేశపూర్వకంగానే నిషేధిత జాబితా అయిన 22ఏ కింద పెట్టి వేధిస్తున్నారని మండిపడ్డారు. తెలంగాణ రాకముందు రియల్ ఎస్టేట్ రంగానికి ఎలాంటి భరోసా లేదని, కానీ కేసీఆర్ అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే నీరు, విద్యుత్ సమస్యలను తీర్చి భూముల విలువను ఊహించని స్థాయికి తీసుకెళ్లారని కేటీఆర్ గుర్తుచేశారు. ఒకప్పుడు ఎకరం రూ. 5 లక్షలు ఉన్న భూమి కేసీఆర్ హయాంలో రూ. 50 లక్షలకు పెరిగిందని, దీంతో ప్రజలు భూమిపై పెట్టుబడులు పెట్టేందుకు ధైర్యంగా ముందుకు వచ్చారని తెలిపారు. కానీ ప్రస్తుత కాంగ్రెస్ పాలనలో భూమి కనిపిస్తే బుక్క పెట్టు.. జాగా కనిపిస్తే పాగా వేయ్ అనే చందంగా దందాలు నడుస్తున్నాయని విమర్శించారు. గాంధీల పేరు చెప్పుకుని రాష్ట్రాన్ని ఏలుతున్న లీడర్లు గజదొంగల్లా మారారని ఆరోపించారు. గతంలో ధరణి పోర్టల్‌లో బయోమెట్రిక్ వేలిముద్ర పడితే తప్ప అంగుళం భూమి కూడా మారేది కాదని, కానీ నేటి కాంగ్రెస్ భూభారతి అవతారంలో భూముల గోల్‌మాల్‌ను యథేచ్ఛగా నడిపిస్తున్నారని ధ్వజమెత్తారు. సెక్షన్ 22ఏ ఆధారంగా ఓ ముఠాను ఏర్పాటు చేసుకుని అమాయక ప్రజల ఆస్తులను గుంజుకుంటున్న ఈ కుంభకోణంపై ప్రభుత్వం తక్షణమే సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. బాధితుల తరఫున బీఆర్ఎస్ పోరాడుతుందని, ప్రభుత్వం చేస్తున్న ఈ అక్రమాలపై న్యాయపరంగా, ప్రజాక్షేత్రంలోనూ

నిలదీస్తామని కేటీఆర్ స్పష్టం చేశారు. తెలంగాణలో తీవ్ర చర్చనీయాంశంగా మారిన నిషేధిత భూముల జాబితా (22ఏ) వివాదంపై బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్ రావు కాంగ్రెస్ ప్రభుత్వం మరియు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. 22ఏ జాబితాలో ప్రజల భూములను చేర్చడం కేవలం సాంకేతిక పొరపాటు కాదని, కాంగ్రెస్ ప్రభుత్వం కావాలనే దురుద్దేశంతో చేసిన పెద్ద దుర్మార్గమని ఆయన ఆరోపించారు. . ప్రస్తుత ప్రభుత్వం 'భూ భారతి' పేరుతో ప్రజల భూములకు 'భూ హారతి' పడుతోందని ఆయన ఎద్దేవా చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజా పాలనను పూర్తిగా పక్కనపెట్టి, కేవలం భూములను కాజేయడమే పనిగా పెట్టుకున్నారని హరీశ్ రావు దుయ్యబట్టారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 30 వేల ఎకరాల పాలిటెక్నిక్ కళాశాలల భూములపై ప్రభుత్వం కన్నేశందని ఆరోపించారు. భూ సమస్యల పరిష్కారం కోసం ఫోన్ చేస్తే చాలంటూ ప్రచారం చేసుకున్నారని, కానీ బాధితులు నేరుగా వెళ్లి రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని కలిసినా ఎలాంటి న్యాయం జరగడం లేదని విమర్శించారు. మరోవైపు హైడ్రా పేరుతో పేదల ఇళ్లను నిర్దాక్షిణ్యంగా కూల్చివేస్తున్న ప్రభుత్వం, బడా బాబులు నిర్మించిన భారీ అక్రమ కట్టడాల జోలికి మాత్రం వెళ్లడం లేదని మండిపడ్డారు. రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి ఏమాత్రం నైతిక బాధ్యత ఉన్నా తక్షణమే తన మంత్రి పదవికి రాజీనామా చేయాలని హరీశ్ రావు డిమాండ్ చేశారు. నిబంధనల ప్రకారం ముఖ్యమంత్రి నివాసాన్ని 22ఏ నిషేధిత జాబితా నుంచి తొలగించుకున్న వారు, అదే జాబితాలో నానా ఇబ్బందులు పడుతున్న సామాన్య ప్రజల భూములు మరియు ఇళ్లను ఎందుకు తొలగించడం లేదని సూటిగా నిలదీశారు. తక్షణమే పేదల ఆస్తులను 22ఏ జాబితా నుంచి తొలగించాలని, బాధితులకు పూర్తి న్యాయం జరిగే వరకు బీఆర్ఎస్ పార్టీ ముందుండి రాజీలేని పోరాటం చేస్తుందని ఆయన స్పష్టం చేశారు.

బీసీల జనాభా లెక్కలు తేల్చాలి.. కులగణన చేపట్టాలి

కేంద్రానికి మంత్రి వాకిటి శ్రీహరి డిమాండ్

హైదరాబాద్, సెప్టెంబర్ 11(ప్రజాజ్యోతి):

దేశవ్యాప్తంగా బీసీల జనాభా, సామాజిక, విద్యా, ఆర్థిక పరిస్థితులపై స్పష్టమైన గణాంకాలు అందుబాటులోకి రావాలంటే కేంద్ర ప్రభుత్వం చేపట్టే జనగణనలో బీసీల కులగణనను తప్పనిసరిగా చేపట్టాలని రాష్ట్ర పశు సంవర్ధక, పాడి పారిశ్రామికాభివృద్ధి, మత్స్య, యువజన సర్వీసులు ఉ క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి డిమాండ్ చేశారు. శుక్రవారం అసెంబ్లీలో కులగణనపై జరిగిన చర్చలో మంత్రి మాట్లాడారు. బీసీలకు రిజర్వేషన్లు ఎవరో ఇచ్చిన దానం కాదని, అది బీసీల హక్కు, సామాజిక న్యాయం కోసం దశాబ్దాలుగా సాగిన పోరాటం ఫలితమని మంత్రి స్పష్టం చేశారు. 1953లో అప్పటి ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ ప్రభుత్వం కాకా కాలేల్కర్ కమిషన్‌ను ఏర్పాటు చేసిందని తెలిపారు. అనంతరం 1979లో బి.పి. మండల్ కమిషన్ ఏర్పడి దేశవ్యాప్తంగా బీసీల సామాజిక, విద్యా వెనుకబాటుతనాన్ని అధ్యయనం చేసిందన్నారు. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాల్లో ఓబీసిలకు 27 శాతం రిజర్వేషన్లు కల్పించాలని మండల్ కమిషన్ సిఫార్సు చేసిందని, 1990లో ఆ సిఫార్సుల అమలుకు కేంద్ర ప్రభుత్వం ముందడుగు వేసిందని గుర్తు చేశారు. 1992లో ఇంద్రా సాహ్నీ కేసులో సుప్రీంకోర్టు ఓబీసి రిజర్వేషన్లకు సంబంధించి కీలకమైన మార్గదర్శకాలు ఇచ్చిందన్నారు. 1993లో జాతీయ వెనుకబడిన తరగతుల కమిషన్ ఏర్పడిందని, 2018లో 102వ రాజ్యాంగ సవరణ ద్వారా దానికి రాజ్యాంగ హోదా లభించిందని తెలిపారు.

నాదీజ రిజర్వేషన్ల ప్రయోజనాలు అన్ని వర్గాలకు సమానంగా అందుతున్నాయా అనే అంశాన్ని పరిశీలించేందుకు జస్టిస్ రోహిణి కమిషన్‌ను కూడా కేంద్రం ఏర్పాటు చేసిందన్నారు. తెలంగాణలో సమగ్ర కుల సర్వే చారిత్రక నిర్ణయం-మంత్రి వాకిటి శ్రీహరి తెలంగాణలో కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం నిర్వహించిన సమగ్ర కుల సర్వే సామాజిక న్యాయానికి పునాది అని మంత్రి వాకిటి శ్రీహరి పేర్కొన్నారు. ఎవరు ఎంతమంది ఉన్నారు? వారి సామాజిక, విద్యా, ఆర్థిక పరిస్థితి ఏమిటి? ప్రభుత్వ ఉద్యోగాల్లో వారి ప్రాతినిధ్యం ఎంత? రాజకీయంగా వారి వాటా ఎంత? అనే అంశాలను డేటా ఆధారంగా తెలుసుకునేందుకు సమగ్ర కుల సర్వే నిర్వహించామని తెలిపారు. "ఇది కేవలం ఒక సర్వే కాదు.. సామాజిక న్యాయానికి పునాది. బీసీల హక్కులకు బలమైన ఆధారం" అని మంత్రి పేర్కొన్నారు. "జిత్నీ ఆబాదీ.. ఉత్నా హక్" రాహుల్ గాంధీ నినాదంతో ముందుకుసాగుతున్నాం-మంత్రి వాకిటి శ్రీహరి రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కలలు కన్నది సామాజిక సమానత్వమని మంత్రి అన్నారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఇచ్చిన "జిత్నీ ఆబాదీ, ఉత్నా హక్" నినాదం సామాజిక న్యాయానికి దిశానిర్దేశం చేస్తోందన్నారు. జనాభాలో ఎంత వాటా ఉంటే అవకాశాలు, అధికారంలో అంత వాటా ఉండాలనే స్ఫూర్తితో తెలంగాణ ప్రజా ప్రభుత్వం ముందుకు సాగుతోందని చెప్పారు. కేంద్రంలో పన్నెండేళ్లుగా అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం బీసీల జనాభా లెక్కలు తేల్చడానికి ఎందుకు వెనుకడుగు వేస్తోందని మంత్రి ప్రశ్నించారు.

కులగణన ఒక 'ఎక్స్‌రే'

మొదటిపేజీ తరువాయి..

అందుకు కులగణన ఎంతో కీలకమని అన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రవ్యాప్తంగా సామాజిక, ఆర్థిక, రాజకీయ పరిస్థితులపై సమగ్ర సర్వే నిర్వహించిందని భట్టి తెలిపారు. రాష్ట్రంలో ఏ కులానికి ఎంత జనాభా ఉంది, వారి వృత్తులు ఏమిటి, ఆర్థిక పరిస్థితి ఎలా ఉంది, ఎంతమంది చదువుకున్నారు, ఎంతమంది ఉద్యోగాల్లో ఉన్నారు, ఎంతమంది నిరుద్యోగులు, భూమి ఉన్నవారు ఎంతమంది, లేనివారు ఎంతమంది వంటి అనేక అంశాలను కూలంకషంగా సేకరించామని చెప్పారు. ప్లానింగ్ శాఖను పర్యవేక్షిస్తున్న డిప్యూటీ సీఎంగా తాను ప్రతిరోజూ ఈ ప్రక్రియను సమీక్షిస్తూ, ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా సర్వేను నిర్వహించామని తెలిపారు. తెలంగాణలో నిర్వహించిన ఈ సర్వే దేశానికే ఆదర్శంగా నిలిచిందని పేర్కొన్నారు. సర్వే నివేదికను అసెంబ్లీలో ప్రవేశపెట్టినప్పుడు ప్రతిపక్ష సభ్యులు సైతం అభినందించారని గుర్తుచేశారు.

దేశమంతా తెలంగాణ మోడల్ కావాలి తెలంగాణలో జరిగిన సర్వే తరహాలో దేశవ్యాప్తంగా కులగణన నిర్వహించాలని కాంగ్రెస్ పార్టీ మొదటి నుంచి డిమాండ్ చేస్తోందని భట్టి తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఢిల్లీకి వెళ్లి పార్లమెంట్‌లోని వివిధ పార్టీల నాయకులతో పాటు ప్రధానమంత్రిని కూడా కలిసి దేశవ్యాప్తంగా కులగణన నిర్వహించాలని విజ్ఞప్తి చేశారని చెప్పారు. మంత్రులు కూడా ఈ అంశంపై కేంద్రంపై ఒత్తిడి తెచ్చారని వివరించారు. అయినప్పటికీ కేంద్రం నుంచి ఆశించిన విధంగా స్పందన రాకపోవడంతో ఢిల్లీలో అన్ని రాజకీయ పార్టీలను ఆహ్వానించి సమావేశం నిర్వహించి, తెలంగాణలో అమలు చేసిన విధానాన్ని వివరించామని తెలిపారు. దేశవ్యాప్తంగా ఇదే తరహాలో కులగణన నిర్వహించాలని కోరామని చెప్పారు.

జనగణన నిర్వహించే సమయంలోనే కులగణనను కూడా అందులో చేర్చుతామని అప్పట్లో కేంద్రం చెప్పిందని భట్టి గుర్తుచేశారు. అయితే ప్రస్తుతం జరుగుతున్న జనగణనలో కులగణనను చేర్చకపోవడం బాధాకరమన్నారు. ఇచ్చిన మాట ప్రకారం జనగణనలో కులగణనను చేర్చాలని డిమాండ్ చేశారు. కులగణన లేకుండా దేశంలోని బలహీన వర్గాల వాస్తవ పరిస్థితులను ఎలా గుర్తిస్తారని ప్రశ్నించారు. కులగణనను చేర్చకుండా ప్రజలను పక్కదోవ పట్టించడం సరికాదన్నారు. "కులగణన

చేద్దామా? వద్దా? అనే విషయాన్ని బీజేపీ సభ్యులు సూటిగా చెప్పాలి. కులగణనకు అనుకూలమైతే సభ తరఫున కేంద్ర ప్రభుత్వానికి, ప్రధానమంత్రికి పిలుపునివ్వాలి. వ్యతిరేకమైతే అదే విషయాన్ని స్పష్టంగా చెప్పాలి" అని భట్టి విక్రమార్క అన్నారు. తెలంగాణలో సర్వే జరిగిన విషయాన్ని అసెంబ్లీలోనే అభినందించి, ఇప్పుడు దేశంలో ఎక్కడా కులగణన జరగలేదని చెప్పడం సరైన విధానం కాదన్నారు. తెలంగాణ మోడల్‌ను దేశవ్యాప్తంగా అమలు చేయాలని కోరుతున్నామని స్పష్టం చేశారు. సమాజంలో ఆస్తులు, వనరులు అందరికీ సమానంగా అందడం లేదని భట్టి పేర్కొన్నారు. ఈ అసమానతలను తొలగించాలంటే ముందుగా సమస్య ఎక్కడ ఉందో తెలుసుకోవాల్సి ఉంటుందని అన్నారు. "సమాజం ఆరోగ్యంగా లేకపోతే ముందుగా ఎక్స్‌రే తీయాలి. వ్యాధిని నిర్ధారించాలి. ఆ తర్వాతే చికిత్స చేయాలి. సమాజంలో ఉన్న అసమానతలను గుర్తించే ఎక్స్‌రేనే కులగణన" అని భట్టి అభివర్ణించారు. కులగణన ద్వారా వివిధ సామాజిక వర్గాల వాస్తవ జనాభా, వారి సామాజిక, ఆర్థిక పరిస్థితులు స్పష్టంగా తెలుస్తాయని, ఆ సమాచారం ఆధారంగా సంక్షేమ, అభివృద్ధి విధానాలను రూపొందించవచ్చని అన్నారు. జనాభా ప్రాతిపదికన అవకాశాలు, వనరులు, అభివృద్ధి ఫలాలు అందరికీ సమానంగా చేరేలా చర్యలు తీసుకోవచ్చని పేర్కొన్నారు. దేశంలో రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందని, రాహుల్ గాంధీ ప్రధానమంత్రి అవుతారని భట్టి విక్రమార్క ధీమా వ్యక్తం చేశారు. రాహుల్ గాంధీ నాయకత్వంలో దేశవ్యాప్తంగా తెలంగాణలో నిర్వహించిన తరహాలో సామాజిక, ఆర్థిక, రాజకీయ సర్వే నిర్వహిస్తామని ప్రకటించారు. ఆ సర్వే ద్వారా దేశంలోని వివిధ సామాజిక వర్గాల వాస్తవ పరిస్థితులను తెలుసుకుని, వాటి ఆధారంగా భవిష్యత్ కార్యాచరణ ప్రణాళికలను రూపొందిస్తామని చెప్పారు. జనాభా ప్రాతిపదికన దేశ అభివృద్ధికి అవసరమైన నిధులు, వనరులు, అవకాశాలు, ఆస్తులు అందరికీ న్యాయంగా, సమానంగా చేరేలా విధానాలను అమలు చేస్తామని భట్టి విక్రమార్క స్పష్టం చేశారు.

బ్రిక్స్ సదస్సు సర్వం సిద్ధం

మొదటిపేజీ తరువాయి..

ప్రాధాన్యతలను గళమెత్తేందుకు భారత్ ఈ వేదికను సిద్ధం చేసింది. భారత్ అధ్యక్షతన జరగనున్న ఈ కీలక సమావేశానికి ప్రపంచ దేశాల నుంచి ప్రముఖ నేతలు హాజరుకానున్నారు. అంతర్జాతీయ రాజకీయాలు, ఆర్థిక వ్యవస్థ, వాణిజ్యం, పెట్టుబడులు, సాంకేతిక రంగం, ఇంధన భద్రత, ఆహార భద్రత తదితర అంశాలపై నేతలు విస్తృతంగా చర్చించే అవకాశం ఉంది. ప్రపంచవ్యాప్తంగా మారుతున్న రాజకీయ, ఆర్థిక పరిస్థితుల నేపథ్యంలో ఈ సమావేశానికి అత్యంత ప్రాధాన్యత ఏర్పడింది. అభివృద్ధి చెందుతున్న దేశాల మధ్య సహకారాన్ని మరింత బలోపేతం చేయడం, పరస్పర వాణిజ్యాన్ని పెంచడం, ఆర్థిక సంబంధాలను విస్తరించడం వంటి అంశాలు ప్రధాన చర్చనీయాంశాలుగా నిలవనున్నాయి. భారత్ అధ్యక్షతన జరుగుతున్న ఈ సమావేశం ద్వారా ప్రపంచ దక్షిణ దేశాల ప్రయోజనాలకు మరింత ప్రాధాన్యత కల్పించేందుకు భారత్ ప్రయత్నిస్తోంది. సభ్య దేశాల మధ్య పరస్పర సహకారం, అభివృద్ధి, సమగ్ర ఆర్థిక పురోగతికి సంబంధించిన అంశాలపై కీలక నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉంది. ఇదిలా ఉండగా, బ్రిక్స్ సమావేశం సందర్భంగా పలువురు దేశాధినేతలతో ప్రధాని నరేంద్ర మోదీ ద్వైపాక్షిక చర్చలు జరిపే అవకాశం ఉంది. ముఖ్యంగా భారత్--చైనా సంబంధాలు, అంతర్జాతీయ పరిణామాలు, వాణిజ్యం, భద్రత వంటి అంశాలు ప్రాధాన్యత సంతరించుకోనున్నాయి. ఈ నేపథ్యంలో 'బ్రిక్స్ 2026కు సర్వం సిద్ధం' అంటూ ప్రధాని నరేంద్ర మోదీ చేసిన తాజా సందేశం ప్రాధాన్యత సంతరించుకుంది. ప్రపంచ దేశాల దృష్టిని ఆకర్షిస్తున్న ఈ సమావేశం ద్వారా అంతర్జాతీయ వేదికపై భారత్ తన దౌత్యపరమైన ప్రాధాన్యతను మరింత బలోపేతం చేసుకునే అవకాశం ఉంది. ప్రపంచ నేతలు ఒకే వేదికపైకి రానుండటంతో ఢిల్లీలో భద్రతను భారీగా పెంచారు. సుమారు 15 వేల మంది ఢిల్లీ పోలీసు సిబ్బంది, 200 పారామిలటరీ బలగాల కంపెనీలు, 500కు పైగా సీసీటీవీ కెమెరాలు భద్రతా ఏర్పాట్లలో భాగంగా మోహరించినట్లు అధికారులు తెలిపారు. విదేశీ నేతలు ప్రయాణించే మార్గాల్లో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. అత్యాధునిక కెమెరాలు, ముఖ గుర్తింపు వ్యవస్థలు, వాహన నంబర్ గుర్తింపు కెమెరాలతో నిరంతర పర్యవేక్షణ చేపడుతున్నారు. నగరం మొత్తాన్ని మూసివేయడం లేదని ట్రాఫిక్ పోలీసులు స్పష్టం చేసినప్పటికీ.. వీవీఐపీ కాన్వాయ్‌ల కదలికల సమయంలో తాత్కాలిక ట్రాఫిక్ నిలిపివేతలు, మార్గాల మళ్లింపులు ఉండవచ్చని తెలిపారు. మథురా రోడ్, సర్దార్ పటేల్ మార్గ్, శాంతి పథ్, జనపథ్, అశోకా రోడ్, బరాఖంబా రోడ్, టాల్‌స్టాయ్ మార్గ్, ఆఫ్రికా అవెన్యూ రోడ్, నీతి మార్గ్, పంచశీల్ మార్గ్, ఏపీజే అబ్దుల్ కలాం రోడ్ వంటి కీలక మార్గాలపై ప్రభావం పడే అవకాశం ఉంది. బ్రిక్స్ సదస్సు వేదిక భారత్ మండపం అయినప్పటికీ.. అంతర్జాతీయ అతిథులకు ఆతిథ్యం ఇవ్వడంలో ఢిల్లీలోని ప్రముఖ హోటళ్లు కూడా ప్రత్యేక ఏర్పాట్లు చేశాయి. విదేశీ ప్రతినిధులకు భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను పరిచయం చేసేలా ప్రత్యేక వంటకాల జాబితాలను సిద్ధం చేశారు. మరోవైపు బ్రిక్స్ బిజినెస్ ఫోరమ్‌లో భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కీలక ప్రసంగం చేశారు. బ్రిక్స్ కూటమి విస్తరిస్తున్న తీరు, ఆర్థికంగా సాధిస్తున్న పురోగతి, ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో పెరుగుతున్న ప్రాధాన్యతను ఆయన వివరించారు. బ్రిక్స్ దేశాల ప్రతినిధులకు స్వాగతం పలికిన ప్రధాని.. ఈ కూటమి భవిష్యత్‌లో మరింత బలమైన ఆర్థిక భాగస్వామ్యంగా ఎదగాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. బ్రిక్స్‌ను ఏర్పాటు చేసిన సమయంలో ఈ కూటమిలో కేవలం నాలుగు దేశాలు మాత్రమే ఉన్నాయని మోదీ గుర్తుచేశారు. అయితే ప్రస్తుతం బ్రిక్స్ 21 దేశాల కుటుంబంగా విస్తరించిందని చెప్పారు. నేడు బ్రిక్స్ దేశాలు ప్రపంచ జనాభాలో దాదాపు 50 శాతానికి, ప్రపంచ జీడీపీలో సుమారు 40 శాతానికి ప్రాతినిధ్యం వహిస్తున్నాయని వివరించారు. గత కొన్నేళ్లలో బ్రిక్స్ దేశాల ఆర్థిక ప్రగతి ప్రపంచ సగటు కంటే వేగంగా సాగిందని మోదీ పేర్కొన్నారు. ప్రపంచ జీడీపీ దాదాపు రెండున్నర రెట్లు పెరిగిన సమయంలో.. బ్రిక్స్ దేశాల ఉమ్మడి జీడీపీ దాదాపు నాలుగున్నర రెట్లు పెరిగిందని చెప్పారు. ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో బ్రిక్స్ ప్రాధాన్యత ఏ స్థాయిలో పెరిగిందో ఈ గణాంకాలు స్పష్టం చేస్తున్నాయని అన్నారు. ప్రపంచవ్యాప్తంగా ఆవిష్కరణలు, కొత్త పరిష్కారాలకు బ్రిక్స్ దేశాలు ముఖ్యమైన కేంద్రాలుగా మారుతున్నాయని ప్రధాని మోదీ అన్నారు. క్షేత్రస్థాయి కార్యక్రమాల నుంచి అత్యాధునిక సాంకేతికతల వరకు అనేక రంగాల్లో కొత్త అవకాశాలు ఏర్పడుతున్నాయని తెలిపారు. వ్యవసాయం, ఆరోగ్యం, నైపుణ్యాభివృద్ధి, డిజిటల్ టెక్నాలజీ, స్మార్ట్ గ్రిడ్లు వంటి రంగాల్లో పరస్పర సహకారాన్ని మరింత పెంచాల్సిన అవసరం ఉందన్నారు. బ్రిక్స్ దేశాల మధ్య జ్ఞానం, సాంకేతికత, పెట్టుబడులు, ప్రతిభ పరస్పర మార్పిడితో మరిన్ని అవకాశాలు సృష్టించవచ్చని పేర్కొన్నారు.

రైతుల మోటార్లకు మీటర్లు పెట్టబోము

మొదటిపేజీ తరువాయి..

ప్రభుత్వం ఏటా రూ. 14,000 కోట్లు, 53 లక్షల గృహ వినియోగదారులకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ కోసం 5,000 కోట్లు చెల్లిస్తోందని భట్టి విక్రమార్క తెలిపారు. ఈ విధంగా కేవలం సబ్సిడీల రూపంలోనే ఏటా దాదాపు రూ. 19,000 కోట్లు ఖర్చవుతోందని ఆయన వివరించారు. ఈ నిధులను సోలరైజేషన్ వైపు మళ్లిస్తే ఖజానాపై భారం తగ్గడంతో పాటు రైతులు స్వయంసమృద్ధి సాధిస్తారన్నారు. పగటిపూట లభించే సోలార్ విద్యుత్ రాత్రివేళ అందుబాటులో ఉండనందున, ఎంపిక చేసిన గ్రామాల్లో బ్యాటరీ స్టోరేజ్ సిస్టమ్స్‌తో మైక్రో గ్రిడ్లను నిర్మిస్తున్నట్లు భట్టి విక్రమార్క తెలిపారు. సోలార్ విద్యుత్‌తో పాటు బ్యాటరీ స్టోరేజ్ ద్వారా గ్రామాలకు విద్యుత్ ఇచ్చే 'మైక్రో గ్రిడ్' ప్రాజెక్టులను ప్రయోగాత్మకంగా(పైలట్) చేపట్టామని ఆయన మండలిలో వివరించారు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చే వీజీఎఫ్ ద్వారా మూడుసార్లు టెండర్లు పిలిచినా, బ్యాటరీ స్టోరేజ్ ఖర్చులు ఎక్కువగా ఉండటం వల్ల కాంట్రాక్టర్లు ముందుకు రాలేదని పేర్కొన్నారు. భవిష్యత్తులో సాంకేతికత పెరిగి బ్యాటరీ ధరలు తగ్గితే ఈ ప్రాజెక్టులు వేగవంతమవుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో పెరుగుతున్న విద్యుత్ డిమాండ్‌కు తగినట్లుగా పర్యావరణహితమైన హరిత ఇంధన రంగాన్ని బలోపేతం చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. శాసనమండలిలో సభ్యులు అడిగిన ప్రశ్నలకు ఆయన సమాధానం ఇస్తూ తెలంగాణ క్లీన్ అండ్ గ్రీన్ ఎనర్జీ పాలసీ-2025 విశేషాలను వివరించారు. గత ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 2014 నాటికి రాష్ట్రంలో విద్యుత్ డిమాండ్ కేవలం 15,497 మెగావాట్లుగా మాత్రమే ఉండేదని, అయితే సెప్టెంబర్ 9 నాటికి అది 19,543 మెగావాట్లకు చేరిందని భట్టి విక్రమార్క వెల్లడించారు. వివిధ కారణాల రీత్యా ఈ ఏడాది డిమాండ్ 20,000 నుంచి 21,000 మెగావాట్లకు పెరిగే అవకాశం ఉందని, ఈ భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకునే సాంప్రదాయ, సాంప్రదాయేతర ఇంధన వనరులను సమన్వయం చేస్తూ ఈ నూతన పాలసీని తెచ్చినట్లు తెలిపారు. పీఎం-కుసుమ్ పథకం కింద రైతులకు 2,000 మెగావాట్ల సోలార్ విద్యుత్ అందించాలని నిర్ణయించినట్లు భట్టి వెల్లడించారు. ఒక్కొక్కరు 2 మెగావాట్ల చొప్పున సోలార్ ప్లాంట్లు ఏర్పాటు చేసుకునేలా రైతులను ప్రోత్సహిస్తున్నామన్నారు. అచ్చంపేట నియోజకవర్గంలోని మన్ననూరు ప్రాంతంలో పైలట్ ప్రాజెక్ట్‌గా పూర్తి సోలరైజేషన్ పూర్తి చేసి ప్రారంభించినట్లు తెలిపారు. కంప్రెస్డ్ బయో గ్యాస్ ప్రాజెక్టులను ప్రభుత్వం పూర్తిస్థాయిలో ప్రోత్సహిస్తోందని, ఇటీవల కరీంనగర్‌లో ఒక ప్లాంట్‌కు శంకుస్థాపన చేసినట్లు గుర్తుచేశారు. మణుగూరు వద్ద సింగరేణి చేపట్టిన మిథేన్ గ్యాస్ ప్రాజెక్ట్ ఖర్చు ఎక్కువగా ఉండటంతో గిట్టుబాటు కాలేదని, అయితే కోల్ గ్యాసిఫికేషన్‌పై అధ్యయనం జరుపుతున్నామని తెలిపారు.

పురపాలక పాలనలో ట్రాన్స్‌జెండర్లు..

మొదటిపేజీ తరువాయి..

మున్సిపల్ కార్పొరేషన్లలో ఒక్కో ట్రాన్స్‌జెండర్‌ను నామినేటెడ్ సభ్యునిగా కో-ఆప్ట్ చేసుకునే అవకాశం కలుగుతుంది. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ, సామాజిక వివక్ష, వెలికి గురవుతున్న ట్రాన్స్‌జెండర్లను ప్రధాన స్రవంతిలోకి తీసుకురావడంతో పాటు, ప్రజా జీవితంలో వారి భాగస్వామ్యాన్ని పెంపొందించేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు వివరించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచనలకు అనుగుణంగానే ఈ సంస్కరణలు చేపట్టినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ బిల్లుకు బీజేపీ, సీపీఐ సహా ఇతర పక్షాల సభ్యులు మద్దతు ప్రకటించగా, అనంతరం సభ దీనిని ఏకగ్రీవంగా ఆమోదించింది.

ప్రధాని మోదీ, రష్యా అధ్యక్షుడు పుతిన్ భేటీ

మొదటిపేజీ తరువాయి..

రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ భారత్‌కు చేరుకున్నారు. ఈ నేపథ్యంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, పుతిన్ మధ్య ద్వైపాక్షిక సమావేశం శుక్రవారం భారత్ మండపంలో ప్రారంభమైంది. భారత్ మండపానికి చేరుకున్న పుతిన్‌కు ప్రధాని మోదీ ఆత్మీయ స్వాగతం పలికారు. ఇరువురు నేతలు పరస్పరం ఆలింగనం చేసుకున్నారు. అనంతరం మోదీ.. పుతిన్‌కు ఒక పుస్తకాన్ని బహూకరించారు. ఆ తర్వాత ఇరువురు నేతలు ద్వైపాక్షిక చర్చలకు కూర్చున్నారు. ప్రధాని నరేంద్ర మోదీ రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌కు తమిళ మహాకవి తిరువళ్లువర్ రచించిన 'తిరుక్కురళ్' రష్యన్ అనువాద ప్రతిని బహూకరించారు. ప్రాచీన తమిళ సాహిత్యంలోని గొప్ప గ్రంథంగా గుర్తింపు పొందిన తిరుక్కురళ్‌లో జీవితం, నైతికత, ప్రేమ, పాలన, సామాజిక విలువలకు సంబంధించిన సూత్రాలు ఉన్నాయి. ఈ బహుమతి భారత్-రష్యా సాంస్కృతిక బంధానికి ప్రతీకగా నిలిచింది. ప్రధాని మోదీ-పుతిన్ భేటీలో భారత్, రష్యా మధ్య ఆర్థిక, వాణిజ్య, రక్షణ, ఇంధన రంగాల్లో సహకారంపై ప్రధానంగా చర్చ జరిగే అవకాశం ఉంది. ముఖ్యంగా ద్వైపాక్షిక వాణిజ్యాన్ని 2030 నాటికి 100 బిలియన్ డాలర్లకు తీసుకెళ్లే లక్ష్యంపై ఇరువురు నేతలు దృష్టి సారించనున్నారు. ప్రస్తుతం ఇరు దేశాల మధ్య వాణిజ్యం సుమారు 60 బిలియన్ డాలర్ల స్థాయిలో ఉందని, దాన్ని మరింత పెంచేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని భారత

వాణిజ్య మంత్రి పీయూష్ గోయల్ పేర్కొన్నారు. చమురు, ఎరువులు, ఫార్మాస్యూటికల్స్, ఆటోమొబైల్ విడిభాగాలు, ఆహార ఉత్పత్తులు తదితర రంగాల్లో పరస్పర వాణిజ్యాన్ని పెంచే అవకాశాలపైనా చర్చలు జరగనున్నాయి. అలాగే రష్యాలో భారతీయ కంపెనీల పెట్టుబడులు, రష్యాలో భారత నైపుణ్యం కలిగిన కార్మికుల సంఖ్య పెంపు వంటి అంశాలు కూడా చర్చకు వచ్చే అవకాశం ఉంది. ప్రధాని మోదీ-పుతిన్ భేటీలో రక్షణ రంగం అత్యంత కీలక అంశంగా మారే అవకాశం ఉంది. ముఖ్యంగా రష్యా తయారు చేసిన సుఖోయ్-57 ఐదో తరం స్టెల్త్ ఫైటర్ జెట్ల కొనుగోలుకు సంబంధించిన ప్రతిపాదన చర్చల్లో ఉండనున్నట్లు రష్యా వర్గాలు వెల్లడించాయి. అయితే ఒప్పందం